


www.navabhoomidaily.com | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 8 సోమవారం | సెప్టెంబర్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 355
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

## ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ విజయం

- ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై భారత్ 4-1 గోల్స్ తేడాతో ఘన విజయం
- ఈ గెలుపుతో భారత్‌కు 8 ఏళ్ల తర్వాత మళ్లీ ఆసియా కప్
- ఈ విజయంతో 2026 హాకీ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించిన భారత



**రాజగిర్-నవభూమి:** ఆసియా కప్ 2025లో భారత హాకీ జట్టు మళ్లీ రికార్డు సృష్టించింది. ఉత్కంఠభరితంగా కొనసాగిన ఫైనల్‌లో దక్షిణ కొరియాపై 4-1 గోల్స్ తేడాతో విజృంభించిన భారత్, తన పవర్ ఏంటో మరోసారి ప్రపంచానికి చూపించింది. బిహార్ రాజగిర్‌లో జరిగిన ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ మరోసారి సత్తా చాటింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై భారత్ 4-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి, నాలుగో టైటిల్ దక్కించుకుంది. ఈ గెలుపుతో భారత్‌కు 8 ఏళ్ల తర్వాత ఆసియా కప్ మళ్లీ దక్కింది. ఈ విజయంతో భారత జట్టు రాబోయే 2026 హాకీ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి నిమిషానికే సుఖజీత్ సింగ్ ఫీల్డ్ గోల్ చేసి దక్షిణ కొరియాపై భారత ఆధిక్యానికి బీజం వేశాడు. ఆ తర్వాత భారత్ ఆత్మవిశ్వాసంతో మ్యాచ్ కొనసాగించి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అసలైన హీరోగా నిలిచాడు దిల్‌ప్రీత్ సింగ్. రెండో క్వార్టర్‌లో ఒక గోల్, మూడో క్వార్టర్‌లో మరో గోల్ చేసి తనదైన శైలిలో మ్యాచ్‌ను డామినేట్ చేశాడు. అతని వేగం, కూల్ ఫినిషింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇలా రెండు గోల్స్‌తో దిల్‌ప్రీత్ భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. దక్షిణ కొరియా గోల్స్ కోసం పలుమార్లు ప్రయత్నించినా, భారత గోల్‌కీపర్ అద్భుతమైన సేవ్‌లు చేసి ప్రతి ప్రయత్నాన్ని విఫలం చేశాడు. ఆ క్రమంలో భారత డిఫెన్స్ కొరియా దాడులను సమర్థంగా అడ్డుకుంది. చివరికి ఒక్క గోల్‌కే పరిమితమైన దక్షిణ కొరియా అనేక సార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది.

# యుద్ధమేఘాలు

- కొత్త యుద్ధానికి తెర తీస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనుజువెలాపై కన్నేసిన అమెరికా
- ఏ క్షణంలోనైనా వెనుజువెలాలో చొరబడొచ్చని ప్రచారం

2



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో**

ఈ ఏడు యుద్ధాలను ఆపినట్లు పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్ జెట్లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనుజులా చుట్టూ ఇవి సమయం కోసం ఎదురు చూస్తూ కాచుకు కూర్చొన్నాయి. దీంతో కరేబియన్ జలాలపై యుద్ధమేఘాలు కమ్ముకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనుజువెలాలో చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది.


వెనుజువెలా ముఖాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ముఠాలను అంతం చేసేందుకు సైనికబ రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనుబనెలా అధ్యక్షుడు నిరోషన్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. నియన్ను పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 180 కోట్లు) బహుమలే

కేవలం మాదకద్రవ్యాల ముఠాల కోసం యుద్ధం స్థాయిలో అమెరికా బలగాలను మోహరించింది. మొత్తం ఎనిమిది వార్షిప్లను అక్కడకు పంపింది. ది ఇవో జిమా యాంఫిబియస్: రెడీగ్రూప్లోని యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో, యూఎస్ఎస్ ఇవో జిమా, యూఎస్ఎస్ ఫోర్ట్ లాడరోల్ నౌకలు 4,500 మంది సైనికులతో కరేబియన్ సముద్రంలోకి వెళ్లాయి. 22వ మెరైన్ యూనిట్ కమాండోలు 2200 మంది వీరిలో ఉన్నారు. ఏవీ-8బీ హారియర్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయరైన యూఎస్ఎస్ జాన్సన్ డున్హమ్, యూఎస్ఎస్ గ్రేవీ దక్షిణ కరేబియన్లో మోహరించాయి. తూర్పు పసిఫిక్ యూఎస్ఎస్ శాంప్సన్ త్వరలో వచ్చి చేరనుంది. ఒక్కో డెస్ట్రాయర్లో 90 క్షిపణులు ఉంటాయి. గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ లేక్ ఎరి, మిన్నియాపోలీస్ సెయింట్ పాల్ కూడా వెనుజువెలా పై గురిపెట్టి ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 ఎఫ్-35 ఫైటర్ జెట్లను ప్యూర్టోరికోలో మోహరించింది. పెద్ద సంఖ్యలో పీ-8. నిఘా విమానాలను రంగంలోకి దించింది.

వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు పనిచేస్తున్నాయన్న ట్రంప్ ఆరోపణలు వాస్తవమే. దళాలకు దొరికినప్పుడు సముద్రంలో పారబోసే కొకైన్ దెబ్బకు అక్కడి షార్క్ చేపల్లో కూడా దాని ఆనవాళు ్లంటున్నాయంటే అక్రమ రవాణ స్థాయిని అర్థం చేసుకోవచ్చు. కానీ, డ్రగ్స్ సముద్రంలో పట్టుకొని, నిందితులను అరెస్టు చేయడానికి ఇంత భారీ సంఖ్యలో యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లు అవసరమా? అన్నదే సందేహాస్పదం. వాస్తవానికి ప్రపంచంలోనే అతి పెద్ద చమురు నిల్వలు వెనుజువెలాలో ఉన్నట్లు నిర్ధారణ

## అంబటికి బిగుస్తున్న ఉచ్చు!

- గత ఐదేళ్లల్లో వివిధ రూపాల్లో సంపాదించినట్లు ఆరోపణలు
- జగనన్న కాలనీల కోసం భూముల కొనుగోలులో అక్రమాలు
- రియల్ వెంచర్లల్లో ల్యాండ్ కన్వర్షన్‌కు ఎకరాకు 5లక్షల డిమాండ్
- అంబటిపై ఆరోపణలు పెరిగిపోవడంతో రంగంలోకి విజిలెన్స్



**పల్నాడు జిల్లా-నవభూమిబ్యూరో**

వైసీపీ నేత అంబటి రాంబాబుకు ఉచ్చు బిగుస్తోంది. వైసీపీ హయాంలో అంబటి పైన వచ్చిన ఆరోపణల పైన విచారణ మొదలైనట్లు తెలుస్తోంది. జగనన్న కాలనీల కోసం భూముల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారని అంబటి పైన ఆరోపణలు ఉన్నాయి. రియల్ వెంచర్లలో ల్యాండ్ కన్వర్షన్‌కు ఎకరాకు 5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అదే విధంగా విద్యుత్ కేంద్రాల్లో పోస్టుల కోసం డబ్బు వసూలు చేసారనే ఆరోపణల పైన విజిలెన్స్ విచారణ జరుగుతోంది. దీంతో, అంబటి పైన తదుపరి చర్యలపై రాజకీయంగా ఉత్కంఠ కొనసా గుతోంది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో అంబటి రాంబాబు భారీ ఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నా యి. రియల్ ఎస్టేట్, ఉద్యోగుల బదిలీలు, కోడి పందేల వరకు పలు ఆరోపణలు వచ్చాయి. ముగ్గురాయి వ్యాపారుల ముక్కుపిండి మరీ రూ.కోట్లు వసూలు చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు రావడంతో కదలిక ప్రారంభమైంది. మాజీ మంత్రి అవినీతి వ్యవహారం తేల్చాలని ప్రభుత్వం ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. ప్రధాన ఫిర్యాదుల పైన విజిలెన్స్ పూర్తి సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదించేందుకు ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక జగనన్న కాలనీల కోసం ఎకరం రూ.10 లక్షలకు కొనుగోలు చేసి.. అదే భూమిని ప్రభుత్వానికి ఎకరం రూ.30 లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఆయన వేధింపులు, బెదిరింపులకు తాళలేక సొంత పార్టీ నాయకుడొకరు హైకోర్టును ఆశ్రయించారు. వైసీపీ ప్రభుత్వం ఉండగానే అంబటి అవినీతి

## తెలంగాణలో మళ్లీ వర్షాలు

**ఈ జిల్లాల వాసులకు కీలక హెచ్చరికలు.. 12 గంటల్లో..!**



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో వాతావరణ శాఖ కొత్త అంచనాలు విడుదల చేసింది. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం క్రమంగా పెరుగుతుందని.. రేపటి నుంచి వర్షాల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని సూచించారు. ప్రత్యేకించి మంగళ, బుధ వారాల్లో తుఫాన్ ప్రభావం మరింతగా ఉండే అవకాశముందని తెలిపారు. రాబోయే 12 గంటల్లో.. హైదరాబాద్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం,

## బెయిల్ రద్దుకై హైకోర్టుకు సర్కార్

- ఏపీ లిక్కర్ కేసులో తాజా ట్విస్ట్‌లు..!
- లిక్కర్ కేసులో ముగ్గురికి బెయిల్
- బెయిల్ రద్దు చేయాలని సర్కార్ పిటిషన్
- విచారణకు హైకోర్టు కీలక నిర్ణయం..!

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

వైసీపీ హయాంలో జరిగిందని ఆరోపిస్తున్న ఏపీ మద్యం స్కాంలో గత రెండు రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా భావిస్తూ ఇప్పటికే సిట్ అరెస్టు చేసిన ఐదుగురిలో నలుగురికి వివిధ కారణాలతో విజయవాడ ఏసీబీ కోర్టులో బెయిల్ లభించింది. ఏసీబీ కోర్టు నిర్ణయాలు సహజంగానే సిట్ తో పాటు ప్రభుత్వానికి షాకిచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీన్ని సవాల్ గా తీసుకుంటోంది. మద్యం స్కాంలో నిందితులుగా భావిస్తూ సిట్ అరెస్టు చేసిన మాజీ అధికారులు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఇప్పటివరకూ జైల్లోనే ఉన్నారు. అయితే తాజాగా వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను విచారించిన విజయవాడ ఏసీబీ కోర్టు.. వీరి విజ్ఞప్తిని మన్నించింది. దీంతో ఈ ముగ్గురూ బెయిల్ పై విడుదలయ్యారు. మరోవైపు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు మరో నిందితుడు, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సైతం తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. దీంతో మిథున్ రెడ్డి మినహా మిగిలిన నిందితులపై ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. మద్యం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సీమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రభుత్వం హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఇవాళ ఆదివారం కావడం, అత్యవసర పిటిషన్ కాకపోవడంతో హైకోర్టు దీనిపై రేపు రెగ్యులర్ విచారణ జరపాలని నిర్ణయించింది. దీంతో ఈ ముగ్గురి బెయిల్ రద్దు పిటిషన్లపై రేపు హైకోర్టు విచారణ జరిపి కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే మద్యం స్కాం కేసులో సిట్ దూకుడుగా

## జైలులో లైబ్రరీ క్లర్క్‌గా ప్రజ్వల్ రేవణ్ణ


- అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ..జైల్లో రోజుకు రూ.522 జీతం
- ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటి రికార్డులను నిర్వహించడం విధులు

2



**బెంగళూరు-నవభూమిబ్యూరో:** అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న కర్ణాటకలోని హసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు పరప్పన అగ్రహార జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటి రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు ఆయన నిర్వహించాలి. ఈ పని చేసినందుకు రోజుకు రూ.522 చెల్లిస్తారు. కాగా, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు, జేడీ(ఎస్) సీనియర్ నేత, హొలెనరసిపుర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ రేవణ్ణపై నమోదైన అత్యాచారం కేసులో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. జైలు నిబంధనల ప్రకారం జీవిత ఖైదు శిక్ష పడిన వారు జైలులో ఏదో ఒక పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిపాలనా పరమైన పనులు చేయడానికి రేవణ్ణ ఆసక్తి చూపినట్లు జైలు అధికారులు తెలిపారు. అయితే ఆయనకు లైబ్రరీ క్లర్క్ పని అప్పగించినట్లు చెప్పారు.

### గ్రామాల్లో నగ్నంగా పురుషులు



3

### రేపే ఉపరాష్ట్రపతి ఎన్నిక



2

### ఎర్ర సముద్రంలో కేబుల్ కట్..



3


## సీఎం రేవంత్‌పై బీజేపీ పరువు నష్టం కేసు

- నేడు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ

**న్యూఢిల్లీ-నవభూమి** : సీఎం రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టులో వేసిన పరువు నష్టం పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తగూడెం సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు గతేడాది హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-125 కింద కేసు కొనసాగుతుందని తెలిపింది. దీంతో రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

రాజకీయ ప్రసంగాలు అతిశయోక్తులతో ఉండేవేనని, వాటిని పరువు నష్టంగా పరిగణించలేమంటూ ట్రయల్ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. అయితే హైకోర్టు తీర్పును బీజేపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

## ఏం చేద్దాం!



- పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం!
- స్పీకర్ నోటీసులందుకున్న ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ భేటీ
- కృష్ణమోహన్‌రెడ్డి సహా 9 మంది హాజరు
- జ్వరం కారణంగా రాలేకపోయిన కడియం శ్రీహరి
- అనర్హత పిటిషన్ విచారణపై న్యాయనిపుణులతో సమీక్ష
- ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధికి నిధులిస్తామన్న సీఎం

2

## గుంతకల్లు కుర్రాడికి 5 కోట్ల ప్యాకేజీ

- గుంతకల్లు యువకుడికి అమెరికాలో బంపరాఫర్
- ఏడాదికి రూ. 5 కోట్ల వేతనంతో ఉద్యోగం
- ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆప్టివర్‌లో కొలువు
- 10 వారాల ఇంటర్న్‌షిప్‌కే రూ. కోటి వేతనం
- బీటెక్ ఫైనల్ ఇయర్‌లోనే భారీ ప్యాకేజీతో కొలువు

2




**అనంతపురం-నవభూమిబ్యూరో**

అనంతపురం జిల్లాకు చెందిన ఓ తెలుగు విద్యార్థి అమెరికాలో అద్భుతం సృష్టించాడు. గుంతకల్లు పట్టణానికి చెందిన సాయి సాకేత్, ఏకంగా రూ. 5 కోట్ల వార్షిక వేతనంతో అమెరికాలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ 'ఆప్టివర్'లో ఉద్యోగం దక్కించుకున్నాడు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతుండగానే ఇంతటి భారీ ప్యాకేజీతో కొలువు సాధించడం విశేషం. ఉద్యోగంలో భాగంగా సాయిసాకేత్ ముందుగా పది వారాల పాటు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. కేవలం ఈ ఇంటర్న్‌షిప్ కాలానికే సదరు సంస్థ అతనికి రూ. కోటి వేతనం చెల్లించనుంది. ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తికాగానే, ఏడాదికి రూ. 5 కోట్ల వేతనంతో పూర్తిస్థాయి ఉద్యోగంలోకి తీసుకునేందుకు ఆప్టివర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని అతని కుటుంబ సభ్యులు సంతోషంగా వెల్లడించారు. సాయిసాకేత్ తల్లిదండ్రులు రమేశ్, వాసవి. గుంతకల్లుకు చెందిన ఈ దంపతులు పదేళ్ల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. సాయిసాకేత్ విద్యాభ్యాసం మొత్తం అమెరికాలోనే సాగింది. చదువు పూర్తికాకముందే కొడుకు అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యోగానికి ఎలా ఎంపికయ్యాడనే విషయంపై సాయిసాకేత్ మాట్లాడుతూ.. "సంస్థ నిర్వహించిన ఎంపిక పరీక్షలో గణితం, బిజినెస్, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా కంపెనీ నన్ను ఎంపిక చేసింది" అని తెలిపారు.

## విశాఖలో ఈస్ట్ ఇండియా పెట్రోల్ కంపెనీపై పిడుగు

- పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు..చెలరేగిన మంటలు
- హుటాహుటిన రంగంలోకి ఫైర్ సిబ్బంది..మంటల ఆర్పివేత
- పరిస్థితిపై స్పందించిన హోం మంత్రి అనిత
- పూర్తిగా అదుపులోకి మంటలు, ప్రజలు భయపడొద్దని సూచన
- ప్రమాద స్థలంలో కొనసాగుతున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ

2



**విశాఖపట్నం-నవభూమి:** నగరంలో శనివారం భారీ వర్షాల నడుమ ఓ పెట్రోలియం కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుని కలకలం సృష్టించింది. ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీ ప్రాంగణంలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు నేరుగా పడటంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో సమీప ప్రాంతాల్లో కాసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన పలు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా నియంత్రించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత స్పందించారు. అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
2
హైదరాబాద్
సోమవారం
08 । సెప్టెంబర్ । 2025





# రూ. 1,88,888 కు గణేష్ లడ్డూ దక్కించుకున్న ముస్లిం మహిళ



**నిర్మల్-నవభూమి:** తెలంగాణలో మతసామరస్యం వెల్లివిరిసింది. ఓ ముస్లిం మహిళ గణేష్ లడ్డూను దక్కించుకుంది. అది కూడా భారీ ధరకు దక్కించుకుంది. దీంతో స్థానికులు ఆమెను అభినందిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా లడ్డూను వేలంపాట వేశారు. ఈ వేలంపాటలో అదే కాలనీకి చెందిన ముస్లిం మహిళ అఫ్రీన్ పాల్గొంది. ఆమె రూ. రూ.1,88,888 కు లడ్డూను దక్కించుకుంది. దీంతో ఆమెకు స్థానికులు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ ఘటన ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. %శా౧జవతీఅంవఎవత్% తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో మతసామరస్యం వెల్లివిరిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ నగర్ కాలనీలో అద్భుతం జరిగింది. ఓ ముస్లిం మహిళ గణేష్ లడ్డూను దక్కించుకుంది. దీంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. నిర్మల్ పట్టణంలోని ఈద్గాం ఆదర్శ్ నగర్ గణపతి లడ్డూ వేలంలో రూ.1,88,888 కు లడ్డూను ముస్లిం మహిళ అఫ్రీన్ దక్కించుకుంది. దీంతో ఆమెకు స్థానికులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆమె ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచింది. %శాశ్రీంశ్ =ముం౧% " రికార్డు సృష్టించిన బాలాపూర్ లడ్డూ..ఎంతంటే..?" నిర్మల్ జిల్లాలో మరో ఘటన జరిగింది. కుంటాల మండలంలోని అంబకంటిలో గణేష్ నిమజ్జనం వేల నిర్వహించిన వేలం పాటలో స్థానికులుగా ఉన్న ఓ ముస్లిం కుటుంబం వేలంపాటలో పాల్గొంది. ఈ క్రమంలో ఏడవ తరగతి విద్యార్థి రెహమాన్ రూ. 1111 వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నాడు.

## చికెన్ షాపుల ముందు జనం క్యూ.. కేజీ ధర ఎంతంటే..?




**హైదరాబాద్-నవభూమి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో పాటు ఆదివారం కావటంతో హైదరాబాద్ నగరంలోని మాంసం మార్కెట్లు కళకళలాడుతున్నాయి. దాదాపు పది రోజుల పాటు సాగిన నవరాత్రి ఉత్సవాల కారణంగా నాన్- వెజ్ వినియోగం తగ్గింది. నేడు ఆదివారం కావడంతో మాంసం ప్రియులు చికెన్, మటన్, చేపల దుకాణాల వద్ద భారీగా క్యూ కట్టారు. హైదరాబాద్ నగరంలో చికెన్ ధరలు గత వారంతో పోలిస్తే కాస్త పెరిగాయి.ఆదివారం మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.240 వద్ద ఉంది. అదే స్కిన్‌తో కూడిన చికెన్ కిలో ధర రూ.220కి లభిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ అధికంగా ఉండటం వల్ల ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. ముఖ్యంగా జనావాసాలు ఎక్కువగా ఉన్న కాలనీలు, శివారు ప్రాంతాల్లో చికెన్ డిమాండ్ పెరగటం వల్ల ఈ ధరల హెచ్చుతగ్గులు కనిపించాయి. వ్యాపారులు కూడా కొనుగోలుదారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు స్టాక్‌ను సిద్ధం చేసుకున్నారు.మటన్ ధరలు మాత్రం యథావిధిగా అధికంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో మటన్ ధర కిలోకు రూ.950 నుంచి రూ.1000 మధ్య కొనసాగుతోంది. గణేష్ ఉత్సవాల సమయంలోనూ మటన్ వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ.. ధరల్లో పెద్దగా మార్పులు రాలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు, చేపల మార్కెట్‌లో కూడా సందడి నెలకొంది. బొచ్చ చేప కిలో రూ.200కి, కొర్రమేను కిలో రూ.300 వరకు విక్రయిస్తున్నారు. పండుగ రోజుల్లో నాన్-వెజ్ జోలికి వెళ్లని చాలా మంది ప్రజలు, ఈ ఆదివారం ఆ లోటును తీర్చుకునేందుకు మాంసం కొనుగోలుకు ఆసక్తి చూపారు.

నగరంలోని పలు చికెన్, మటన్ షాపుల యజమానులు రద్దీపై సంతోషం వ్యక్తం చేశారు. "గత పది రోజులుగా వ్యాపారం అంతగా లేదు. కానీ ఈ ఆదివారం, గణేష్ ఉత్సవాలు ముగిసిన తర్వాత భారీగా కొనుగోలుదారులు వస్తున్నారు. దీనివల్ల మాకు మంచి వ్యాపారం జరుగుతోంది' అని ఒక వ్యాపారి తెలిపారు. ఈ రద్దీని బట్టి చూస్తే, రాబోయే రోజుల్లో కూడా మాంసం వినియోగం పెరుగుతుందని ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఆదివారం మాంస ప్రియులకు నిజంగానే పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని చెప్పవచ్చు.

## రేవంత్ రెడ్డిని కలిసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్-నవభూమిబ్యూరో



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్‌ను రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న మహేశ్ కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అభినందన లు తెలిపారు. ముున్ముందు ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## రేపే ఉపరాష్ట్రపతి ఎన్నిక

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. మంగళవారం జరిగే ఎన్నికల్లో పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. పాలక ఎన్‌డీఏ తరఫున మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి నుంచి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (79) పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. తమ తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేసేందుకు వీలు కల్పిస్తూ రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండ్రోజుల వర్క్‌షాప్ ఆదివారం ఢిల్లీలో మొదలైంది. ప్రధాని మోదీ దీనికి హాజరయ్యారు. సోమవారం ఎన్‌డీఏ ఎంపీలతో కలిసికట్టుగా వ్యూహరచన చేయాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయించారు. ఇక విపక్ష ఎంపీలకు కాంగ్రెస్ సోమవారం మధ్యాహ్నం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో మాక్‌పోల్ నిర్వహించి.. ఓటు ఎలా వేయాలో వివరిస్తుంది. రాత్రికి ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే వారికి విందు ఇవ్వనున్నారు. అన్ని పార్టీల ఎంపీలూ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్‌రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చేశారు. తాను ఏ పార్టీ తరఫునా పోటీ చేయడం లేదని, రాజకీయాలకతీతంగా తనకు ఓటు వేయాలని ఆయన ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. పార్లమెంటు భవనంలోని వసుధలో ఎఫ్-101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు.

ఉభయసభల్లో ఎన్‌డీఏకే సంఖ్యాబలం ఉంది. రెండు సభల్లో మొత్తం 788 మంది సభ్యులకు గాను ప్రస్తుతం 781 మంది (లోక్‌సభలో 542, రాజ్యసభలో 239 మంది) ఉన్నారు. ఎన్‌డీఏకి 425 మంది, ఇండీ కూటమికి 311 మంది, ఇతర ప్రతిపక్షాలకు 45 మంది సభ్యులున్నారు. ఇతర ప్రతిపక్షాల్లో వైసీపీ (11).. ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. బీజేడీ (7) మద్దతు కోసం ఆ పార్టీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేశారు. సరైన సమయంలో తమ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బీఆర్‌ఎస్ ఎంపీ కె.సురేశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. శిరోమణి అకాలీదళ్ వంటి ఏక సభ్య పార్టీలు, స్వతంత్రులు ఎటు మొగ్గుతారో చూడాల్సి ఉంది. రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగనున్నందున.. అధికార కూటమి నుంచి సుదర్శన్‌రెడ్డికి క్రాస్‌ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది. అటు బీజేపీ కూడా.. తమిళనాడు ఎంపీల్లో కొందరు తమ రాష్ట్రానికే చెందిన రాధాకృష్ణన్ వైపు మొగ్గుచూపుతారని అంచనా వేస్తోంది.

## బురదలో తిరిగే వారికి ప్రమాదకర వ్యాధి.. గుర్తించకపోతే ప్రాణాలకే ముప్పు.. ప్రాథమిక లక్షణం జ్వరమే..



**హైదరాబాద్-నవభూమి:** తెలుగు రాష్ట్రాల్లో మెలియాయిడోసిస్ అనే కొత్త సంక్రమణ వ్యాధి కలకలం రేపుతోంది. మొదట్లో సాధారణ జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పుల మాదిరిగా కనిపించే ఈ వ్యాధి.. సకాలంలో గుర్తించకపోతే ప్రాణాంతకంగా మారుతుంది. వర్షాకాలంలో బురద, తడి మట్టి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ వ్యాధి విస్తరిస్తోంది. 'బర్క్‌హోల్డేరియా సూడోమల్లీ' అనే సూక్ష్మజీవి వల్ల ఈ వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇది రెండు మార్గాల్లో మానవ శరీరంలోకి వెళు ్తుంది.అందులో ఒకటి బురదలో గాయాల ద్వారా.. మరొకటి తేమ ఎక్కువగా ఉన్న గాలి ద్వారా. ఈ వ్యాధికి ఎక్కువగా వ్యవసాయం చేసే రైతులు, కూలీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే అందరికీ రోగం సోకదు. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారు, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ రోగులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు, అధిక మద్యం తీసుకునే వారు అధిక ప్రమాదంలో ఉంటారు. ఈ వ్యాధిని సాధారణ రక్త, మూత్ర పరీక్షలతో గుర్తించడం కష్టమని, మైక్రోబయాలజీ ల్యాబ్‌లో చేసే ప్రత్యేక పరీక్షల ద్వారానే నిర్ధారణ సాధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ల్యాబ్ సదుపాయాలు లేని కారణంగా, వ్యాధి గుర్తింపులో ఆలస్యం అవుతోంది

లక్షణాలు.. తప్పుదారి పట్టించే చికిత్స..

మెలియాయిడోసిస్ సోకినవారికి సాధారణ జ్వరమే మొదటి లక్షణం. దానికి తోడు చలి, కీళ్ల నొప్పులు, దగ్గు, ఛాతి నొప్పి వంటి సమస్యలు కనిపిస్తాయి. ఈ కారణంగా చాలా సందర్భాల్లో డాక్టర్లు న్యూమోనియాగా భావించి చికిత్స చేస్తారు. కానీ మందులు ఆపిన తర్వాత తిరిగి లక్షణాలు మళ్లీ బయటపడతాయి. బురద ద్వారా వ్యాపించే కేసుల్లో చర్మంపై గడ్డలు, పుసు కారడం, వాంతులు, డయేరియా, రక్త ఇన్ఫెక్షన్, సెప్టిక్ షాక్ వచ్చే అవకాశం ఉంది. తీవ్ర స్థాయిలో మూర్ఛ సమస్యలు కూడా రావచ్చు.

చికిత్స పద్ధతి ఇలా..


ఈ వ్యాధి చికిత్స రెండు దశల్లో జరుగుతుంది. మొదట ఇన్‌జెక్షన్ రూపంలో సెఫ్టాజిడైమ్, మెరోపెనెమ్ వంటి యాంటీబయోటిక్స్ 10-14 రోజులు ఇస్తారు. తర్వాతి దశలో కో-ట్రైమాక్సజోల్, డాక్సీసైక్లిన్ వంటి మాత్రలు 3-6 నెలల పాటు ఇస్తారు. ఈ చికిత్స సమయానికి మొదలుపెట్టకపోతే.. వ్యాధి రక్తంలోకి చేరి సెప్సిస్, మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమవుతుంది. నిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రధాన ఆసుపత్రుల్లో చికిత్స అందుబాటులో ఉంది. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా పేదలకి ఉచితంగా సదుపాయం కల్పిస్తున్నారు.నిమ్స్‌కు చెందిన వైద్యుల బృందం 12 కేసులపై పరిశోధన జరిపింది. ఎక్కువ మంది రోగులు వ్యవసాయం చేసే వారు, డయాబెటిస్ ఉన్నవారే అని తేలింది. ఈ వ్యాధి ద్వారా ఎక్కువగా ఊపిరితిత్తులు, ఎముకలు, లివర్, చర్మం, మెదడు, మూత్రపిండాలు ప్రభావితమవుతున్నాయి. మొత్తం కేసుల్లో సగానికి పైగా రోగులు ప్రాణాలు కోల్పోయారని స్టడీ చెబుతోంది. అంటే అవగాహన లోపం, సకాలంలో చికిత్స లేమి ప్రాణనష్టం పెంచుతున్నాయి.

## వరంగల్‌లో వర్ష బీభత్సం.. వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులు



**హైదరాబాద్-నవభూమి:** వరంగల్ నగరంలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. ఈ వరదలో రెండు ఆర్టీసీ బస్సులు చిక్కుకుపోయాయి. బస్సుల్లో ఉన్న ప్రయాణికులను పోలీసులు, స్థానికులు కలిసి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం భారీ వర్షం వల్ల వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోయింది. ఈ మార్గంలో వెళ్తున్న రెండు ఆర్టీసీ బస్సులు, వరద నీటి లోతును అంచనా వేయలేక మధ్యలో చిక్కుకుపోయాయి. బస్సులు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో లోపల ఉన్న సుమారు వంద మంది ప్రయాణికులు భయంతో కేకలు వేశారు.స్థానికులు వెంటనే మిల్స్ కాలనీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తాడు సాయంతో బస్సుల్లో ఉన్న ప్రయాణికులను ఒక్కొక్కరిగా సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బస్సులు కరీంనగర్ జిల్లా అన్నారం, మహబూబాబాద్ నుంచి వస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటన తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు ఆ మార్గాన్ని వెంటనే మూసివేశారు. ఇతర వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించారు. ఈ అండర్ బ్రిడ్జి కింద తరచుగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఇక దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల మీదుగా వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (%×వీణ%) తెలిపింది. ఈ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం కూడా ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పలు జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది:


## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు.. మంత్రి పొంగులేటి కీలక అప్డేట్




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంపై కీలక అప్డేట్. రాష్ట్రంలోని నిరుపేదలందరికీ మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ పథకంలో వేగం, పారదర్శకత పెంచడానికి లబ్ధిదారులకు నేరుగా నిర్మాణ దశల ఫోటోలను అప్‌లోడ్ చేసే అవకాశాన్ని కూడా కల్పించారు. శనివారం వనపర్తి జిల్లా మంగంపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి పొంగులేటి.. ప్రభుత్వం మొదటి దశ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతలో రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 1,275 రెండు పడకగదుల ఇళ్లను తామే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామని గుర్తు చేశారు. అదేవిధంగా గద్వాల జిల్లా కేంద్రంలో 687 మందికి రెండు పడక గదుల ఇళ్ల పట్టాలు అందజేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. గతంలో, నిర్మాణ దశల ఫోటోలను పంచాయతీ కార్యదర్శి లేదా గృహనిర్మాణశాఖ అధికారులు మాత్రమే అప్‌లోడ్ చేసేవారు. దీనివల్ల బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగేది. ఈ సమస్యను నివారించడానికి ఇప్పుడు లబ్ధిదారులకే నేరుగా చిత్రాలను అప్‌లోడ్ చేసే సదుపాయాన్ని కల్పించారు. లబ్ధిదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌లో ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివిధ దశల ఫోటోలను స్వయంగా నమోదు చేయవచ్చు.

పునాది దశ పూర్తయితే రూ.లక్ష, గోడల దశలో మరో రూ.లక్ష, స్లాబ్ దశలో మరో రూ.లక్ష, రంగులు వేశాక మిగతా డబ్బులు మొత్తంగా రూ.5 లక్షలు విడతల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. లబ్ధిదారులు పంపిన ఫోటోలను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అవి వాస్తవమైనవో కాదో నిర్ధారిస్తారు. ఈ ప్రక్రియ వల్ల నిధుల విడుదల మరింత వేగవంతం అవుతుందని, లబ్ధిదారులకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త విధానం వల్ల అధికారులు, లబ్ధిదారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. తద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగంగా పూర్తవుతుంది.

## ఏం చేద్దాం!



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ పార్టీ అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి నోటీసులందుకున్న ఎమ్మెల్యేలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీకి.. కడియం శ్రీహరి మినహా 9మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జ్వరం కారణంగా ఆయన ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారు. అయితే తాను పార్టీ మారలేదంటూ పలుమార్లు ప్రకటించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఈ భేటీకి హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు న్యాయనిపుణులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది మంది ఎమ్మెల్యేల అనర్హత కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, స్పీకర్ నోటీసుల జారీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై న్యాయ నిపుణులతో సమీక్షించారు. అయితే ఇప్పటివరకు వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేలు.. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధికి నిధులడిగేందుకు ముఖ్యమంత్రిని ఇతర ఎమ్మెల్యేలు కలిసినట్లుగానే తామూ కలిశామని చెప్పినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటిదాకా వంద మందికి పైగా ఎమ్మెల్యేలు కలిశారని వివరించినట్లు తెలుస్తోంది. కాగా, అనర్హత కేసు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, పిటిషన్‌దారుల సమక్షంలో ఈ కేసు విచారణ ప్రక్రియను స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విచారణను ఎమ్మెల్యేలు ఎలా ఎదుర్కొనాలన్నదానిపై న్యాయ నిపుణులతో కొంత చర్చ జరిగింది. ఎమ్మెల్యేలతో భేటీలో వారి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైనే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువగా చర్చించినట్లు తెలుస్తోంది. భేటీలో పాల్గొన్న 9మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటిలో తక్షణం పూర్తి చేయాల్సిన పనులు ఏమేమి ఉన్నాయన్న దానిపై సీఎం ఆరా తీశారు. వాటికి తక్షణమే నిధులు మంజూరు చేస్తామమని హామీ ఇచ్చారు. అలాగే ఆయా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సాధక బాధకాలనూ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు.

## కనువిందు చేసిన సంపూర్ణ చంద్రగ్రహణం..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ గ్రహణం కనిపించింది. ఈ సమయంలో చంద్రుడిని భూమి నీడ కప్పేసింది.దాదాపు 82 నిమిషాల పాటు చంద్రుడు కనిపించకుండా పోగా.. పలుచోట్ల ఎర్రగా కనిపించాడు చందమామ. దాదాపు 82 నిమిషాల పాటు చంద్రుడు కనిపించకుండా పోగా.. పలుచోట్ల ఎర్రగా కనిపించాడు చందమామ. భారత్‌లో మూడేళ్ల తర్వాత ఎక్కువ సేపుగా కనిపించి గ్రహణం ఇదే కావడం విశేషం. భారత్‌లో మూడేళ్ల తర్వాత ఎక్కువ సేపుగా కనిపించి గ్రహణం ఇదే కావడం విశేషం.

అయితే, సూర్యుడికి చంద్రుడికి మధ్యలో భూమి వచ్చినప్పుడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందన్న విషయం అందరికీ తెలిసిందే.

## తెలంగాణలో మళ్లీ వర్షాలు

(1వపేజీ తరువాయి)సూర్యాపేట, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో గాలివానలతో కూడిన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, రాత్రిపూట బయటకు వెళ్ళేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 8 నుంచి 9 వరకు వర్షాల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున, తక్కువ ఎత్తులోని ప్రాంతాల్లో నీరు నిలిచిపోవచ్చని.. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉందని హెచ్చరించారు.ఇప్పటికే మున్సిపల్ అధికారులు, గ్రామ పంచాయతీలు కాల్వలు శుభ్రం చేయడం, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక దళాలను సిద్ధం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం, రక్షణ చర్యలు తక్షణమే అందేలా వ్యవస్థలు సిద్ధమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

## యుద్ధమేఘాలు

(1వపేజీ తరువాయి)అయింది. స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ లెక్కల ప్రకారం. బి2021 నాటికి ఈ దేశంలో 48 వేల మిలియన్ టన్నుల చమురును గుర్తించారు. ఇవి సౌదీలో నిల్వల కంటే అధికం. ప్రపంచ చమురులో 17శాతానికి సమానం. కానీ, ప్రపంచ చమురు. వ్యాపారంలో ఈ దేశం వాటా కేవలం 0.8శాతమే. అమెరికా అక్కడి ప్రభుత్వ రంగ కంపెనీ పెట్రోలియన్ డే వెనుజువెలా ఎస్‌ఏపై ఆంక్షలు విదించడమే దీనికి కారణం. అగ్రరాజ్యంతో పాటు కెనడా. ఐరోపా సమాఖ్య తదితర దేశాలు కలిసి 350 ఆంక్షలు విధించాయి.

ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు -వెనుజువెలాలో చమురు రిజర్వులను అమెరికా స్వాదీనం చేసుకోవాలి' అని అన్నారు. 2017లో ఓ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుజువెలాపై ఎందుకు యుద్ధం చేయడంలేదని ప్రశ్నించారు. "వాళ్ల వద్ద చాలా చమురు ఉంది. భౌగోళికంగా మనకు చాలా దగ్గర -అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా మదురో సర్కారును కూల్చేందుకు ట్రంప్ ప్రయత్నించారు.

## అంబటికి బిగుస్తున్న ఉచ్చు!

(1వపేజీ తరువాయి)బాగోతంపై అనేక ఫిర్యాదులు ఉండటంతో విజిలెన్స్ ఫోకస్ చేసింది. అదే విధంగా అంబటి ప్రధాన అనుచరుడు వందల కోట్లు విలువచేసే రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఆయనకు ఏటా రూ.కోట్లల్లో ముడుపులు అందాయని చెబుతున్నారు. జగనన్న కాలనీల్లో మట్టి తోలకంలో మంత్రి వాటా 10 శాతం పైగా ఉందనే ఆరోపణలతో ..విజిలెన్స్ పూర్తి స్థాయిలో విచారణ చేస్తోంది. దీంతో.. ఇప్పుడు అంబటి విషయంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఆసక్తిగా మారుతోంది.

## జైలులో లైబ్రరీ క్లర్క్‌గాప్రజ్వల్ రేవణ్ణ

(1వపేజీ తరువాయి)మరోవైపు ఖైదీలు సాధారణంగా వారానికి మూడు రోజులు, నెలలో కనీసం 12 రోజులు జైలులో పని చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం కోర్టు విచారణలకు హాజరు కావడం, న్యాయవాదులను కలిసేందుకు ప్రజ్వల్ రేవణ్ణ ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనకు కేటాయించిన లైబ్రరీ క్లర్క్ పని షెడ్యూల్ పరిమితంగా ఉన్నదని వెల్లడించారు.

## విశాఖలో ఈస్ట్ ఇండియా

(1వపేజీ తరువాయి)అదుపులోకి తెచ్చారని ఆమె తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హోం మంత్రి భరోసా ఇచ్చారు. ఉన్నతాధికారులు ప్రమాద స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని ఆమె వెల్లడించారు.


## బెయిల్ రద్దుకై హైకోర్టుకు సర్కార్

(1వపేజీ తరువాయి)వ్యవహరించడం లేదన్న చర్చ ఉంది. ఓ దశలో జగన్‌ను సైతం అరెస్టు చేస్తారని ప్రచారం జరిగినా ఇప్పటివరకూ ఆయన్ను నిందితుడిగా సైతం చేర్చడంలో సిట్ విఫలమైందన్న చర్చ ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరెస్టు చేసిన నిందితులు సైతం బెయిల్ పై విడుదల కావడంతో సిట్ ఆత్మరక్షణలో పడుతోంది. దీంతో ప్రభుత్వం కేసు కీలక దశలో ఉన్నందున వీరి బెయిల్స్ రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు పిటిషన్లు దాఖలు చేసింది.

## రేవంత్ రెడ్డి వరాల జల్లు:

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. మంచినీటి సరఫరా నెట్ వర్క్ ను మరింత బలోపేతం చేయడానికి, వేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాల అవసరాలను తీర్చడానికి 8,858 కోట్ల రూపాయల వ్యయంతో గోదావరి నీటి తరలింపు పథకాలను ప్రారంభించనున్నారు. ఫేస్-2, ఫేస్- 3 ఇందులో ఉన్నాయి. హైదరాబాద్ కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాలకూ మంచినీటి తరలింపు మరింత సులభతరమౌతుంది. గోదావరి మంచినీటి పథకం రెండు, మూడుదశల కోసం 7,360 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కింద మల్లన్నసాగర్ జలాశయం నుండి 20 టీఎంసీల నీటిని తీసుకుంటారు. ఇందులో 2.5 టీఎంసీలను మూసీ నది పునరుజ్జీవనం కోసం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు మళ్లిస్తారు. మిగిలిన 17.5 టీఎంసీలు హైదరాబాద్ మంచినీటి అవసరాలకు ఉపయోగపడతాయి. ఈ క్రమంలో ఏడు మధ్యస్థ సరస్సులను కూడా గోదావరి జిలాలతో నింపుతారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే సమయంలో- ఔటర్ రింగ్ రోడ్ మంచినీటి సరఫరా ప్రాజెక్టు మూడోదశనూ రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. దీనికి 1,200 కోట్లు రూపాయలు ఖర్చవుతుంది. ఈ ప్రాజెక్టు జీహెచ్‌ఎంసీ పరిధి, దాని చుట్టుపక్కల గల మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, ఔటర్ రింగ్ రోడ్ వెంబడి ఉన్న గ్రామ పంచాయతీలకు విస్తరించి ఉంది. నిర్మించిన 71 రిజర్వాయర్లలో 15 ఇప్పుడు ప్రారంభించనున్నారు. ఇవి సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, బొల్లారం సహా 14 మండలాల్లోని 25 లక్షల మందికి మంచినీటి అవసరాలను తీరుస్తాయి. కోకాపేట లేఅవుట్ అభివృద్ధి ప్రాజెక్టుకు కూడా రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇది కోకాపేట లేఅవుట్, నియో పోలిస్, ఎస్ఈజెడ్లకు మంచినీరు, మురుగునీటి పారుదల నెట్ వర్క్ ను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది. దీని నిర్మాణ వ్యయం 298 కోట్ల రూపాయలు. ఇది వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని అంచనా.

## స్నేహితుడిపై పగతోనే ముంబైలో మానవబాంబులని బెదిరింపు



**నొయిడా-నవభూమి:** ముంబైలో తీవ్ర కలకలం రేపిన.. మానవబాంబులతో వరుస పేలుళ్ల బెదిరింపులకు సంబంధించి అశ్విన్ కుమార్ సుప్ర(50) అనే వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో పోలీసులు అరెస్టు చేశారు. వృత్తిరీత్యా జ్యోతిష్యుడైన అశ్విన్ కుమార్ తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకు అతడి పేరు మీద ముంబై పోలీసులకు బాంబు బెదిరింపు మెసేజ్ పంపినట్టు పోలీసులు గుర్తించారు. లష్కరే జిహాదికి చెందిన 14 మంది ముంబైలోకి ప్రవేశించారని, 400కిలోల ఆర్డీఎక్స్‌ను 34 వాహనాల్లో అమర్చామని వినాయక



నిమజ్జనోత్సవం రోజున వాటిని పేలుస్తామంటూ ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు శుక్రవారం ఓ బెదిరింపు మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమై దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసు యంత్రాంగం ఆ సందేశాన్ని పంపిన అశ్విన్ కుమార్‌ను నొయిడా పోలీసుల సాయంతో అరెస్టు చేసింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దాని ప్రకారం.. బిహార్‌కు చెందిన ఫిరోజ్ అనే స్నేహితుడు పెట్టిన కేసులో అదే రాష్ట్రానికి చెందిన అశ్విన్ కుమార్ 2023లో మూడు నెలలు జైలులో గడిపాడు. అప్పట్నించి ఫిరోజ్‌పై అశ్విన్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఫిరోజ్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు అతడి పేరు మీద ముంబై పోలీసులకు బెదిరింపు మెసేజ్ పెట్టాడు. అశ్విన్ కుమార్ నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమురీ కార్డులు, రెండు డిజిటల్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
సోమవారం
08 । సెప్టెంబర్ । 2025

## గొడవలు పెట్టేవాళ్లే శాంతి బహుమతులు కోరుకుంటారు: ట్రంప్‌పై సల్మాన్ సెటైర్



ప్రముఖ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ 19 తాజా ఎపిసోడ్‌లో.. హోస్ట్ సల్మాన్ ఖాన్ కంటెస్టెంట్లపై గట్టిగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కొందరు శాంతిని కోరుకుంటున్నామని చెప్పి.. ఇంట్లో గొడవలకు కారణమవుతున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలోనే సల్మాన్ ఖాన్ ప్రస్తావించిన ఒక వ్యాఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగానే కాదు అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశంగా మారింది. ఆ వ్యాఖ్య అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై చేసిన పరోక్ష విమర్శగా అందరూ భావిస్తున్నారు.బిగ్ బాస్ షో ప్రారంభమైన తొలి వారం నుంచే మంచి టీఆర్పీ రేటింగ్స్‌ను సొంతం చేసుకుంది. ఈ వారాంతపు ఎపిసోడ్‌లో.. ఎప్పటిలాగే సల్మాన్ తనదైన శైలిలో ఇంటి సభ్యులకు హితబోధ చేశారు. వారి తప్పులను సున్నితంగా ఎత్తిచూపారు. అయితే ఆయన హౌస్‌మేట్స్‌ను మందలిస్తూ.. ఒకానొక సమయంలో పరోక్షంగా ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. గొడవలు సృష్టించేవాళ్లే శాంతి బహుమతులు కోరుకుంటారని సల్మాన్ వ్యాఖ్యానించారు.సల్మాన్ ఎవరి పేరు చెప్పకుండానే.. "ఈ ప్రపంచంలో ఏం జరుగుతోంది? ఎవరు ఎక్కువ గొడవలు పెడుతున్నారో వాళ్లే శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యను విన్నవారందరికీ అది డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి చేసినదిగా అర్థమైంది. గత కొన్ని నెలలుగా ట్రంప్ తన మధ్యవర్తిత్వంతో భారత్-పాకిస్థాన్, ఇజ్రాయెల్-పాలస్తీనా వంటి అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించానని పలుమార్లు చెప్పుకున్నారు. మొత్తంగా ఏడు యుద్ధాలను ఆపానని.. అందుకోసం తనకు నోబెల్ శాంతి బహుమతి అందించాలని కోరారు. కానీ ఆ దేశాలు మాత్రం ట్రంప్ వాదనలను తోసిపుచ్చాయి. అయినప్పటికీ ఆయన మద్దతుదారులు మాత్రం నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ అర్హుడని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో సల్మాన్ వ్యాఖ్య ప్రాధాన్యతను సంతరించుకుంది.

## భర్త రఘువంశీ హత్యకు సోనమ్ ఎలా ప్లాన్ చేసింది? ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే నిజాలు..




**న్యూఢిల్లీ-నవభూమి:** హనీమూన్ మర్డర్‌గా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన రాజారఘువంశీ కేసులో మేఘాలయ పోలీసుల సిట్ దర్యాప్తు పూర్తయింది. భర్త రాజా రఘువంశీని హత్య చేసేందుకు సోనమ్ ఎలా ప్లాన్ చేసింది? హత్యకు పాల్పడ్డ నిందితులు ఎవరు? తదితర పూర్తి వివరాలతో కూడిన 790 పేజీల ఛార్జ్‌షీట్‌ను పోలీసులు షిల్లాంగ్ కోర్టులో దాఖలు చేశారు. రాజా రఘువంశీ భార్య సోనమ్ , ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహాతో పాటు మరో ముగ్గురిని ఛార్జ్‌షీట్‌లో నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.ఇండోర్ వ్యాపారవేత్త రాజా రఘువంశీ హత్య కేసులో మేఘాలయ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం సుదీర్ఘ దర్యాప్తు అనంతరం కోర్టులో 790 పేజీల ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. దర్యాప్తులో, పోలీసులు కాల్ రికార్డులు, లొకేషన్ డేటా, సాక్షుల వాంగ్మూలాలతో సహా అనేక ఆధారాలను సేకరించారు. వీటితో పాటు ఫోరెన్సిక్ నివేదికలను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజా భార్య సోనమ్ రఘువంశీ, ఆమె ప్రేమికుడు రాజ్ కుష్వాహ్ ఈ హత్య కేసులో ప్రధాన సూత్రధారులుగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. కుట్ర అమలుకు సహకరించిన ఆకాష్ రాజ్‌పుత్, ఆనంద్ కుర్మి, విశాల్ సింగ్ చౌహాన్ అనే మరో ముగ్గురు నిందితులపై అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ ఐదుగురిపై భారత శిక్షాస్మృతి ప్రకారం హత్య, సాక్ష్యాలను నాశనం చేయడం, నేరపూరిత కుట్ర అనే ఆరోపణల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. రాజా హత్య తర్వాత సోనమ్ దాక్కున్న ఇంటి యజమాని లోకేంద్ర తోమర్, సెక్యూరిటీ బల్బీర్ అహిర్బర్, జేమ్స్ అనే వ్యక్తులను పోలీసులు ఈ కేసులో సహనిందితులుగా చేర్చారు.ఈ ఏడాది మే 11న రాజా రఘువంశీకి, సోనమ్‌కు వివాహం జరిగింది. పెళ్లైన పది రోజుల తర్వాత (మే 20న) హనీమూన్ కోసం కొత్త దంపతులు మేఘాలయ వెళ్లారు. ఆ తర్వాత ఎన్ని రోజులు గడిచినా కొడుకు, కోడలు తిరిగిరాకపోవడంతో రాజా కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత జూన్ 1న సోహ్రా ప్రాంతంలోని ఓ లోయలో రాజా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో హత్యగా పోలీసులు అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించడం మొదలుపెట్టారు. అయితే, హఠాత్తుగా జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లో కనిపించింది. పోలీసులు ఏమైందని ప్రశ్నించగా.. తనను ఎవరో అపహరించి అక్కడ వదిలేశారని సోనమ్ కల్లబొల్లి కబుర్లు చెప్పింది. అప్పటికే ఆమెపై అనుమానాలు ఉండటంతో పోలీసులు తమదైన స్టైల్లో విచారించా. దీంతో తన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో కలిసి రాజాను హత్య చేయించినట్లు సోనమ్ ఒప్పుకుంది. ఆ తర్వాత వీరిద్దరితో పాటు హత్యకు సహకరించిన ఇతరులను పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 11న నిందితులను కోర్టు కస్టడీకి అప్పగించింది.

## సోనూసూద్ గొప్ప మనసు.. ప్రాణాలకు రిస్క్ అని తెలిసినా కూడా..



**ముంబై- నవభూమి:** సోనూసూద్ మంచితనం గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రపంచ దేశాలను గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి సమయం నుంచి ఇప్పటి వరకు లేదనకుండా అడిగిన వారికి సాయం చేస్తూనే ఉన్నారు. తన అవసరం ఉన్న చోటుకు నేరుగా వెళుతున్నారు. స్వయంగా తన చేతుల్తోనే సాయం చేసి వస్తున్నారు. ప్రస్తుతం ఆయన పంజాబ్‌లో ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. వరదల కారణంగా నష్టపోయిన గ్రామాల్లో పర్యటించటమే కాకుండా సాయం కూడా అందించనున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..'భాగ్‌పూర్, సుల్తాన్ పూర్, లోధి, పిరోజ్‌పూర్, ఫలిల్కా, అజ్‌నాలకు వెళతాను. ఆ ప్రాంతాల్లో తిరిగి అక్కడి పరిస్థితులను తెలుసుకుంటాను. వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయాయి. ప్రజలు అన్ని రకాలుగా దెబ్బతిన్నారు. ఇక్కడి ప్రజలకు సాయం చేయటం అన్నది వారంలోనో.. పది రోజుల్లోనే అయ్యే పని కాదు. పంజాబ్ కోలుకోవటానికి కొన్ని నెలల సమయం పడుతుంది. పంజాబ్ కోసం నిలబడే వారు మాకు చాలా అవసరం. ఇళ్లు కూలిపోయి ఇబ్బంది పడుతున్నవారికి మేము ఇళ్లు కట్టించే ప్రయత్నం చేస్తాం.నేను ఇప్పుడే వెనక్కు తిరిగి వెళ్లిపోవడానికి రాలేదు. వీలైనన్ని వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తాను' అని స్పష్టం చేశారు. కాగా, పంజాబ్‌లోని వరద ప్రభావిత గ్రామాల పరిస్థితి దారుణంగా ఉంది. దాదాపు 1998 గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. 48 మంది ప్రజలు చనిపోయారు. 1.45 లక్షల మంది ప్రజలపై వరద ప్రభావం పడింది. భారీగా పంట నష్టం కూడా సంభవించింది. 50 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో వరదలు బీభత్సం సృష్టించాయి. అక్కడ పరిస్థితులు ఇంకా సాధారణ స్థితిలోకి రాలేదు. వర్షం పడుతూనే ఉంది. ఇలాంటి సమయంలో అక్కడికి వెళ్లటం రిస్క్ అని తెలిసినా సోనూసూద్ వెనకడుగు వేయటం లేదు.

## వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ దర్శకురాలిగా అనుపర్ణరాయ్



**వెనిస్ (ఇటలీ)-నవభూమి:** భారతీయ యువ దర్శకురాలు అనుపర్ణ రాయ్ చరిత్ర సృష్టించారు. వెనీస్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 82వ ఎడిషన్‌లో ఉత్తమ దర్శకురాలిగా అవార్డు పొందారు. ఆమె సినిమా 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్'కు ఈ అవార్డు దక్కింది. ఓరిజాంటి పోటీలో అనుపర్ణ బెస్ట్ డైరెక్టర్ అవార్డును గెలుచుకున్నారు. ఈ అవార్డును ఓరిజాంటి జ్యూరీ అధ్యక్షురాలిగా ఉన్న ఫ్రెంచ్ డైరెక్టర్ జూలియా డుకోర్నావు.. అనుపర్ణకు అవార్డు ప్రదానం చేశారు.ముంబైలో ఇద్దరు వలస మహిళల జీవితాలను చిత్రిస్తూ తీసిన సినిమా 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్'. ఒంటరితనం, జీవనోపాధి, క్షణిక సంబంధాల థీమ్‌లతో ఈ సినిమా రూపొందిచారు అనుపర్ణ. ఓరిజాంటి విభాగంలో భారత్ నుంచి ఈ సినిమా మాత్రమే పాల్గొనడం విశేషం. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ చరిత్రాత్మక విజయం భారతీయ సినిమాను అంతర్జాతీయంగా మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.


## పశ్చిమ బెంగాల్‌లో సంచలనం: బీజేపీ నేత నోటిలో యాసిడ్ పోస్తా.. తృణమూల్ ఎమ్మెల్యే బెదిరింపు



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. గతంలో బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ నాయకుల చేతులు, కాళ్లు నరుకుతానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మాల్డా జిల్లా అధ్యక్షుడు అబ్దుర్ రహీమ్ బక్షీ.. ఇప్పుడు ఓ బీజేపీ ఎమ్మెల్యే నోట్లో యాసిడ్ పోస్తానని బెదిరించడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ తాజా వ్యాఖ్యలు బెంగాల్ రాజకీయాల్లో కలకలం సృష్టించాయి.సరిహద్దు రాష్ట్రాల్లో బెంగాలీ వలస కార్మికులపై జరుగుతున్న "అత్యాచారాలను" నిరసిస్తూ శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఒక బహిరంగ సభలో బక్షీ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో ఆయన బీజేపీ శాసనసభ్యుడు శంకర్ ఘోష్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. గతంలో శంకర్ ఘోష్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. బెంగాల్ నుంచి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన 30 లక్షల మంది కార్మికులను రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు అని తెలిపారు. వాటిని గుర్తు చేస్తూ బక్షీ తీవ్ర విమర్శలు గుప్పించారు.

"బయట పనిచేస్తున్న 30 లక్షల మంది బెంగాలీ వలస కార్మికులు బెంగాలీలు కాదు.. వారు రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు అని సిగ్గు లేకుండా చెబుతున్న ఆయనకు నేను అప్పుడే చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. అలాంటి మాట మళ్లీ నీ నోటి నుంచి వస్తే.. యాసిడ్ పోసి నీ గొంతును బూడిద చేస్తాను. నీవు గుర్తుంచుకో ఇది పశ్చిమ బెంగాల్. ఇక్కడ మాట్లాడటానికి బెంగాలీలు నీకు చోటివ్వరు. యాసిడ్ పోసి నీ ముఖాన్ని కాల్చివేస్తాను" అని బక్షీ ఘాటుగా హెచ్చరించారు. అంతేకాకుండా ప్రజలు బీజేపీ జెండాలను పీకివేయాలని, ఆ పార్టీని బహిష్కరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.బక్షీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. మాల్డా ఉత్తర్ బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము మాట్లాడుతూ.. ఇలాంటి వ్యాఖ్యలు టీఎంసీలో ఉన్న బెదిరింపు, హింస సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం కారణంగానే అధికార పార్టీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. "ఇది తృణమూల్ కాంగ్రెస్ సంస్కృతి. ప్రజలను భయపెట్టడం వారి పని. మాల్దాలో ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు నిరంతరం జరుగుతున్నాయి. టీఎంసీ జిల్లా అధ్యక్షుడు తరచుగా వార్తల్లో ఉండటానికి ఇలాంటివి చెబుతుంటాడు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఓడిపోతుందనే భయం వారిని వెంటాడుతోంది" అని ముర్ము అన్నారు. అబద్ధపు పోలీసు కేసులు పెట్టిస్తున్నారంటూ ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆయన మాల్దాలో నిరసనలకు కూడా ది .టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తన పార్టీ సహచరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని పలుమార్లు హెచ్చరించినా బక్షీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో.. పార్టీ నాయకుల బాధ్యతారహిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయని మమత గుర్తు చేశారు. అయినప్పటిక బక్షీ ఈ వ్యాఖ్యలు చేయడం, పార్టీలో క్రమశిక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది.

## అది బీజేపీ నిర్ణయం కాదు.. జీఎస్టీ శ్లాబ్‌లపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్లారిటీ



ఇటీవల కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ కౌన్సిల్ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్) జీఎస్టీ శ్లాబులు 4 ఉండగా.. వాటిని 2 శ్లాబులకు కుదించారు. అదే సమయంలో సామాన్యులకు అవసరమయ్యే నిత్యావసరాల వస్తువులపై పన్నులు తగ్గించడంతో.. భారీ ఊరట లభించినట్లయింది. అయితే జీఎస్టీ అమల్లోకి తీసుకువచ్చినపుడు 4 శ్లాబులు తెచ్చి.. ఇప్పుడు వాటిని 2 శ్లాబులకు తగ్గించి.. దేశ ప్రజలకు బీజేపీ ఏదో మేలు చేసినట్లు చెబుతోందని కాంగ్రెస్ సహా దేశంలోని ప్రతిపక్ష పార్టీలు గత కొన్ని రోజులుగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. జీఎస్టీ శ్లాబుల నిర్ణయం.. కేవలం బీజేపీది మాత్రమే కాదని స్పష్టం చేశారు.ఈ క్రమంలోనే కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్షాలు దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. జీఎస్టీని మొదట అమల్లోకి తీసుకువచ్చినపుడు 4 స్లాబులు ఉండాలని తీసుకున్న నిర్ణయం కేవలం బీజేపీదో లేక అప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీదో కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికారత కమిటీ తీసుకున్నదేనని తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నిర్మలా సీతారామన్ తెలిపారు.ఇక ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికారత కమిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్రాల మంత్రులు కూడా ఉన్నారనే విషయాన్ని కేంద్రమంత్రి గుర్తు చేశారు. ఈ విషయం ప్రతిపక్షాలకు తెలియకపోవడం ఏంటని నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. తాను చెప్పింది తప్పని ప్రతిపక్ష నాయకులు ఎవరైనా నిరూపిస్తే తాను క్షమాపణలు చెప్పేందుకు కూడా సిద్ధమైనని తేల్చి చెప్పారు. తనకు ఎలాంటి బేషజాలు లేవని.. తాను క్షమాపణ చెప్పేందుకు కూడా సిద్ధమేనని.. కానీ ప్రతిపక్షాలు అర్థం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై అవగాహన లేకపోతే కనీసం మౌనంగానైనా ఉండండి అంటూ ప్రతిపక్షాలకు నిర్మలా సీతారామన్ చురకలు అంటించారు.

జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం.. 12, 28 శాతం శ్లాబ్‌లు తొలగింపు, వాటిపై పూర్తిగా రద్దు శ్లాబులు తీసుకురావడంపై కాంగ్రెస్ పార్టీ సహా దేశంలోని పలు విపక్షాలు కేంద్రంపై విమర్శలు చేస్తూ వచ్చాయి. అయితే గత వారం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రెండు శ్లాబులకు ఆమోదం కల్పించారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఈ 2 శ్లాబులు అమల్లోకి రానున్నాయి. గతంలో 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లు ఉండగా.. ప్రస్తుతం 12 శాతం, 28 శాతం శ్లాబ్‌లను తొలగించారు. అదే సమయంలో లగ్జరీ వస్తువులు, పొగాకు, సిగరెట్లపై కొత్తగా 40 శాతం పన్నులు విధిస్తూ కొత్త శ్లాబ్ తీసుకువచ్చారు.

# గ్రామాల్లో నగ్నంగా పురుషులు



**మీరట్-నవభూమి:** ఉత్తర్‌ప్రదేశ్‌లో న్యూడ్ గ్యాంగ్ సంచలనం రేపుతోంది. మీరట్ పట్టణానికి సమీపంలోని పలు గ్రామాల్లో పలువురు పురుషులు.. నగ్నంగా తిరుగుతున్నారు. గ్రామాల్లోకి చొరబడి.. మహిళ కనిపిస్తే చాలు.. వారిని చెట్ల పొదలు, ఎవరూ లేని ప్రాంతాలకు బలవంతంగా తీసుకెళ్లి దాడి చేస్తున్నారు. ఈ న్యూడ్ గ్యాంగ్ మీరట్ పరిసరాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారారు. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటివరకు 4 సార్లు ఈ న్యూ గ్యాంగ్ పలు గ్రామాల మహిళలపై దాడులు చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే భారాలా అనే గ్రామంలో ఒక మహిళ ఒంటరిగా ఆఫీస్‌కు వెళ్తుండగా.. ఎవరూ లేని ప్రాంతంలో కొందరు నగ్నంగా ఉన్న యువకులు ఆమెను పక్కనే ఉన్న పొలంలోకి లాక్కెళ్లేందుకు ప్రయత్నించారని భారాలా గ్రామస్థులు వెల్లడించారు. ఆ న్యూడ్ గ్యాంగ్‌ను చూసి.. ఆ మహిళ అరుపులు, కేకలు వేయడంతో.. ఆ పురుషులు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆ న్యూడ్ గ్యాంగ్‌ను గుర్తించేందుకు.. స్థానికులు ఆ ప్రాంతంలో వెతికినా ఎవరూ దొరకలేదు. ఇక తనను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన పురుషులు ఒంటిపై ఎలాంటి బట్టలు లేకుండా నగ్నంగా ఉన్నారని బాధిత మహిళ వెల్లడించింది.

ర గ్రామంలో మరో ముగ్గురు మహిళలకు ఇలాంటి అనూహ్య సంఘటనే ఎదురైందని.. అయితే భయం, సమాజంలో అవమాన భారంతో ఆ విషయాన్ని బయటికి వెల్లడించలేదని పేర్కొన్నారు. రోజురోజుకూ ఈ న్యూడ్ గ్యాంగ్ ఘటనలు పెరిగిపోతుడంటంతో బాధిత గ్రామాల ప్రజలు.. పోలీసులను ఆశ్రయించారు. భారాలా, దౌరాలా సహా పలు గ్రామస్థుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. న్యూడ్ గ్యాంగ్‌ను చూసినట్లు చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు.దీంతో పోలీసులు.. డ్రోన్లను ఉపయోగించి.. న్యూడ్ గ్యాంగ్ కోసం గాలింపు చేపడుతున్నారు. అయితే ఇప్పటివరకు ఎవరినీ అనుమానితులుగా గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు. అయితే ఆయా గ్రామాలకు దగ్గర ఉన్న అటవీ ప్రాంతంలో ఈ న్యూడ్ గ్యాంగ్ ముఠాలు ఉన్నాయా అనేది తెలుసుకునేందుకు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఆయా గ్రామాల్లో పోలీసులను మోహరించినట్లు పేర్కొన్నారు.

## యూపీ సీఎం ఇంటి ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

**న్యూఢిల్లీ-నవభూమి:** పోలీస్ స్టేషన్‌లో తనకు న్యాయం జరగడం లేదని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారిక నివాసం వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. రెండు నెలల క్రితం నోయిడాకు చెందిన ఓ మహిళ హర్యానాకు చెందిన జానపద గాయకుడు ఉత్తర్‌కుమార్ తనపై అత్యాచారం చేశాడని జూన్ 24న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.హైకోర్టు సూచన మేరకు దాదాపు 25 రోజుల తర్వాత పోలీసులు కేసును నమోదు చేశారు. దీంతో ఈ కేసులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని బాధితురాలు ఆరోపించింది. నిందితుడి ఆచూకీ గురించి సమాచారం ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నది.

## ఎరువుల కొరతపై.. ఎంపీలో నిరసనలు




**భోపాల్-నవభూమి:** బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లో అన్నదాతలను పట్టించుకునే వారే కరువయ్యారు. ఎరువుల కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేవాలో ఎరువుల కోసం బారులు తీరిన రైతన్నలపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. సాత్నాలో మంత్రి ప్రతిమ బగ్రి రైతుల ఆగ్రహాన్ని గుర్తించి, వేరొక మార్గంలో ప్రయాణించారు. అయితే రైతులు ఆమెను అడ్డగించి తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సాత్నా బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో రైతుల దుస్థితిని ఏకరువు పెట్టారు. దీనిపై వ్యవసాయ శాఖ స్పందిస్తూ, ఎరువుల కొరత లేదని, తగిన స్థాయిలో సరఫరాలు ఉన్నాయని, పంపిణీ జరుగుతున్నదని తెలిపింది. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ స్పందిస్తూ, ఇది అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. బీజేపీ ఎమ్మెల్యే ఓ కలెక్టర్ కాలర్ పట్టుకున్నారని, బీజేపీ ఎంపీ రైతుల దుస్థితి గురించి లేఖ రాశారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కళ్లు తెరవాలని, ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పందించాలని డిమాండ్ చేశారు.

## ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని గుజరాత్‌లో ధర్నా

**గాంధీనగర్-నవభూమి:** దేశమంతా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకుంటున్న వేళ బీజేపీ పాలిత గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉద్యో్ధలు మాత్రం శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దయెత్తున నిరసన తెలిపారు. దీంతో సత్యాగ్రహ చావనీ నిర సన స్థలంగా మారింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 10,700 టీచర్ పోస్ట్ లను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ మంత్రి కుబేర్ దిండోర్‌కు వ్యతిరేకంగా పెద్దయెత్తున నినాదాలు చేశారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యను ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని వారు ఆరోపించారు. కాగా, ఆర్ట్స్, సంగీతం, ఫిజికల్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో శాశ్వత పోస్టుల భర్తీకి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జరపాలని మరికొందరు నిరుద్యోగులు నిరసన తెలిపారు.

## ఎర్ర సముద్రంలో కేబుల్ కట్..

### భారత్, ఆసియా, పశ్చిమ ఆసియాలో ఇంటర్నెట్ సమస్యలు



**జెడ్డా-నవభూమి:** ఎర్ర సముద్రంలో జరిగిన అండర్‌సీ కేబుల్ కట్‌ల కారణంగా భారతదేశంతో సహా ఆసియా, పశ్చిమ ఆసియా దేశాలలో ఇంటర్నెట్ సేవలు అంతరాయం కలిగాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఘటనకు కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. కానీ, యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు ఈ కేబుల్‌లను లక్ష్యంగా చేసుకుని దాడి చేసి ఉండవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హౌతీలు ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఎర్ర సముద్రంలో దాడులు చేస్తున్నారు. అయినప్పటికీ, గతంలో ఇలాంటి ఘటనలకు తాము బాధ్యులం కాదని హౌతీలు తిరస్కరించారు.

ఇంటర్నెట్ సేవలను పర్యవేక్షించే సంస్థ నెట్‌బ్లాక్స్ ప్రకారం, ఎర్ర సముద్రంలో జరిగిన కేబుల్ కట్‌ల వల్ల భారతదేశం, పాకిస్తాన్‌తో సహా పలు దేశాలలో ఇంటర్నెట్ కనెక్టివిటీ దెబ్బతింది. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలో ఎస్ఎండబ్ల్యూ4, ఐఎంఈడబ్ల్యూ కేబుల్ సిస్టమ్‌లలో సమస్యలు తలెత్తాయని నెట్‌బ్లాక్స్ తెలిపింది. ఎస్ఎండబ్ల్యూ4 కేబుల్‌ను భారతదేశానికి చెందిన టాటా కమ్యూనికేషన్స్ నిర్వహిస్తుంది. ఐఎంఈడబ్ల్యూ కేబుల్‌ను ఆల్కాటెల్-లూసెంట్ నేతృత్వంలోని ఓ కన్సార్టియం చేపడుతుంది. ఈ రెండు సంస్థలు ఈ ఘటనపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.


సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధికారులు ఈ అంతరాయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ యూఏఈ యాజమాన్యంలోని డూ, ఎటిసలాట్ నెట్‌వర్క్‌లలో ఇంటర్నెట్ స్లోగా ఉందని ఫిర్యాదు చేశారు. మైక్రోసాఫ్ట్ కూడా తన స్టేటస్ వెబ్‌సైట్‌లో పశ్చిమ ఆసియాలో ఇంటర్నెట్ వేగం తగ్గవచ్చని పేర్కొంది. ఎర్ర సముద్రంలోని కేబుల్ కట్‌ల వల్ల ఈ సమస్య తలెత్తినప్పటికీ, దీనికి లింక్ లేని ప్రాంతాల్లో ఇంటర్నెట్ ట్రాఫిక్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.

ఈ కేబుల్ కట్‌లు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తున్న సమయంలో జరిగాయని అంటున్నారు. ఈ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ హౌతీ నాయకులపై వైమానిక దాడులు చేసింది. ఇందులో పలువురు కీలక నేతలు మరణించారు. 2024 ప్రారంభంలో యెమెన్‌లోని ప్రవాస ప్రభుత్వం హౌతీలు ఎర్ర సముద్రంలో అండర్‌సీ కేబుల్‌లపై దాడి చేయాలని ప్లాన్ వేస్తున్నారని ఆరోపించింది. ఆ సమయంలో కొన్ని కేబుల్‌లు దెబ్బతిన్నప్పటికీ, హౌతీలు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ఆదివారం హౌతీల అల్-మసీరా న్యూస్ ఛానల్ ఈ తాజా కేబుల్ కట్‌లను గుర్తించింది.ఈ కేబుల్ కట్‌లు ఆసియా, పశ్చిమ ఆసియా దేశాలలో ఇంటర్నెట్ సేవలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇప్పటికే భారతదేశం, పాకిస్తాన్ వంటి దేశాలలో ఇంటర్నెట్ వినియోగదారులు నెమ్మదిగా కనెక్షన్‌లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు ఎంత త్వరగా పరిష్కారమవుతాయనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఎందుకంటే సంబంధిత సంస్థల నుంచి ఇంకా అధికారిక ప్రకటనలు మాత్రం రాలేదు.

## లిక్కర్‌స్కామ్‌లో నలుగురు వైసీపీ నేతలు?

**అమరావతి-నవభూమి:** గత జగన్ ప్రభుత్వంలో రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో ఎందరో వైసీపీ నేతలు దోపిడీ చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో వైసీపీ నేతల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడుగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యాపార భాగస్వామి విజయానంద రెడ్డి(ఎర్రచందనం స్మగ్లర్)ని ఇటీవల సిట్ అధికారులు విచారించారు. వైసీపీ తరఫున విజయానంద రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చిత్తూరులోని ఆయన కాంప్లెక్స్‌లో సోదాలు చేపట్టినప్పుడు అత్యంత కీలకమైన డేటా అధికారులకు లభించింది. అందులో ఎవరెవరికి ఎంత ముడుపులు ఇచ్చారనే వివరాలు ఉన్నాయి. మరింత లోతుగా ఆరా తీసిన సిట్ అధికారులు పలువురి పేర్లు గుర్తించారు.

అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీ కీలక నేత మేనల్లుడికి భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది. వైసీపీ గౌరవాధ్యక్షురాలిగా ఉన్న విజయమ్మను పార్టీ నుంచి జగన్ శాశ్వతంగా సాగనంపిన రోజున గుంటూరు జిల్లాలో జరిగిన ఆ పార్టీ ప్లీనరీకి చేసిన ఖర్చుకు ప్రతిఫలంగా ఈ ముడుపులు ఇచ్చినట్లు సమాచారం. మద్యం సరఫరాదారుల నుంచి కోట్లాది రూపాయలు ఇప్పించినట్లు తెలిసింది. గోదావరి జిల్లాల్లోఒక మాజీ మంత్రికి కూడా భారీగా ముడుపులు చేరినట్లు సిట్ వర్గాలు గుర్తించాయి. రెండేళ్లకు పైగా మంత్రిగా పనిచేసిన ఆ నేత లిక్కర్ సొమ్ములు తీసుకున్నట్లు పూర్తిస్థాయిలో ఆధారాలు ఉన్నట్లు తెలుస్తోంది. గుంటూరు జిల్లాలో ఓ మాజీ మంత్రికి కూడా లిక్కర్ ముడుపులు చేరినట్లు సమాచారం. ఎప్పుడూ వివాదాల్లో ఉండే ఆ మాజీ మంత్రిపై ఇప్పటికే అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేకు కూడా భారీగానే లిక్కర్ సొమ్ములు చేరినట్లు దర్యాప్తు బృందాలు ఆధారాలు సేకరించాయి.



## ధిక్కారస్వరం..గౌరీలంకేష్

భారతీయ జర్నలిస్టు, ఉద్యమకారిణి, ఒక నిష్కపటమైన వామపక్ష జర్నలిస్ట్, హిందూ తీవ్రవాదల చేతిలో ఈ రోజు అంటే 2017 సెప్టెంబరు 4 సాయంత్రం ఆమె ఇంటివద్ద కాల్చి చంప బడ్డారు. గౌరీ లంకేష్ వర్ధంతి జ్ఞాపకం !

లంకేష్ రచనలు భారతదేశంలోని ప్రగతిశీల రాజకీయాలతో సంబంధం ఉన్నవారికి - హిందూ జాతీయవాదం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, లింగవివక్ష కులతత్వాన్ని విమర్శించేవారికి సపరిచితురాలు. ముఖ్యంగా జాతీయ టెలివిజన్ ప్రింట్ మీడియా రంగంలో కఠినమైన వినియోగదారులవాదం ద్వేషపూరిత జాతీయవాదం మధ్య, ఆనాటి వివాదాస్పద విషయాలపై నినదించిన ఆమే బిజెపి దాని వివిధ నిఘా సైన్యాల కుడి-వింగ్ రాజకీయా హిందూ తీవ్రవాదల ఆగ్రహానికి గురి అయ్యారు.

గౌరీ లంకేష్ గారి తండ్రి సాహిత్య ప్రొఫెసర్, కవి, నాటక రచయిత, చిత్రనిర్మాత లంకేష్ పత్రికే అనే వారపు టాబ్లాయిడ్ ప్రచురణకర్త అయిన బహుముఖ ప్రజ్ఞశాలి పి. లంకేష్ . కన్నడ అక్షరాల ప్రపంచంలో ప్రసిద్ధ వ్యక్తి కాబట్టి ఆమెకు కొంత ప్రాముఖ్యత ఉండేది. లంకేష్ పత్రికే వాణిజ్య ప్రకటనలను అంగీకరించ కుండా నడిచింది.

గౌరీ లంకేష్ చిన్నప్పటినుంచే జర్నలిజంపై ఆసక్తి కనబరిచారు. పలు ఇంగ్లీష్, కన్నడ పత్రికల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలపై కథనాలను అందించారు. గౌరీ లంకేశ్ కన్నడ నాట ప్రముఖ పాత్రికేయురాలు. మితవాదులు, హిందూత్వవాదులపై లౌకిక కోణంలో విమర్శలు చేసే పాత్రికేయురాలిగా ఆమె ప్రసిద్ధి గాంచారు. నక్సలైట్ల సానుభూతి పరురాలిగా కూడా పేరుంది. టైమ్స్ ఆఫ్ ఇండియాలో పనిచేశారు. అనంతరం తన తండ్రి స్థాపించిన "లంకేశ్ పత్రికే" వార్తాపత్రికను సోదరుడు ఇంద్రజిత్‌తో కలిసి కొన్నేళ్లు నడిపారు. ఆ తర్వాత తన సొంత వార్తా పత్రిక "గౌరీ లంకేశ్ పత్రికే"తో పాటు పలు ప్రచురణలను ప్రారంభించారు.గౌరీ లంకేష్ 1962 జనవరి 29న కన్నడ లింగాయత్ కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి కవి-జర్నలిస్ట్ పి. లంకేష్. ఆమెకు కవిత ఇంద్రజిత్ అనే ఇద్దరు తోబుట్టువులు ఉన్నారు . గౌరి బెంగళూరులోని టైమ్స్ ఆఫ్ ఇండియాలో జర్నలిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు . తరువాత, ఆమె తన భర్త చిదానంద్ రాజ్‌ఘట్టతో కలిసి ఢిల్లీకి వెళ్లారు . కొంతకాలం తర్వాత, ఆమె బెంగళూరుకు తిరిగి వచ్చి, అక్కడ తొమ్మిది సంవత్సరాలు సండే మ్యాగజైన్‌కు కరస్పాండెంట్‌గా పనిచేశారు. 2000లో ఆమె తండ్రి మరణించే సమయానికి, ఆమె ఢిల్లీలోని "ఈనాడు" తెలుగు టెలివిజన్ ఛానెల్‌లో పని చేస్తుండే వారు. ఈ సమయానికి, ఆమె తన జీవితంలో 16 సంవత్సరాలు జర్నలిస్ట్‌గా గడిపారు.

వారి తండ్రి పి. లంకేష్ మరణించినప్పుడు, గౌరీ ఆమె తమ్ముడు ఇంద్రజిత్ లంకేష్ పత్రిక ప్రచురణకర్త మణిని కలిసి , ప్రచురణను నిలిపివేయాలనుకుంటున్నట్లు చెప్పారు. కానీ మణి వారిని ఆ ఆలోచనకు వ్యతిరేకించి పత్రికను కొనసాగించడానికి ఒప్పించారు. ఆ తర్వాత గౌరీ లంకేష్ పత్రికకు సంపాదకురాలిగా మారగా , ఇంద్రజిత్ ప్రచురణ వ్యాపార వ్యవహారాలను నిర్వహించేవారు.

2001 నుండి, గౌరీ ఇంద్రజిత్ మధ్య పత్రిక భావజాలంపై విభేదాలు తలెత్తాయి. ఫిబ్రవరి 2005లో గౌరీ ఆమోదించిన పోలీసులపై నక్సలైట్ దాడి గురించి ఒక నివేదిక పత్రికలో ప్రచురించబడినప్పుడు ఈ విభేదాలు బహిరంగమయ్యా యి. ఫిబ్రవరి 13న, ఇంద్రజిత్ (పత్రిక యజమాని ప్రచురణకర్త) ఆ నివేదికను నక్సల్స్‌కు అనుకూలంగా ఉందని ఆరోపిస్తూ ఆ నివేదికను ప్రచురించకుండా అడ్డుకున్నారు. ఫిబ్రవరి 14న, ఇంద్రజిత్ గౌరీపై పోలీసు ఫిర్యాదు దాఖలు చేసి , ప్రచురణ కార్యాలయం నుండి కంప్యూటర్, ప్రింటర్ స్కానర్‌ను దొంగిలించారని ఆరోపించాడు. ఇంద్రజిత్ తనను రివాల్వర్‌తో బెదిరించాడని ఆరోపిస్తూ గౌరీ కౌంటర్-ఫిర్యాదు దాఖలు చేసింది . ఫిబ్రవరి 15న, ఇంద్రజిత్ ఒక విలేకరుల సమావేశం నిర్వహించి గౌరీ పత్రిక ద్వారా నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించాడు. గౌరీ ఒక ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించింది, అక్కడ ఆమె ఆ ఆరోపణను ఖండించింది ఆమె సోదరుడు తన సామాజిక కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నాడని పేర్కొంది. తరువాత గౌరీ తన సొంత కన్నడ వారపత్రిక గౌరీ లంకేష్ పత్రికికేను ప్రారంభించింది గౌరి లంకేశ్ మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించారు. సమాజంలోని అసమానతలు, దురాచారాల నిర్మూలనకు నడుం కట్టిన పౌరులకు, వారు సాగించిన ఆందోళనలకూ లంకేశ్ పత్రికతో ప్రచారం ఇచ్చారు. గత దశాబ్దమున్నర కాలగమనంలో కన్నడ నాట జరిగిన అనేక ప్రజా ఉద్యమాలతో మమేకమయ్యారు. లింగాయత వీరశైవ వివాదంలో లింగాయత వాదానికి దన్నుగా నిలిచారు. ఎంగిలాకుల పై పొర్లు దండాలు పెట్టించే దుష్ట ఆచారానికి వ్యతిరేకంగా సాగిన పోరాటానికి మద్దతిచ్చారు. బాబాబుడాన్ గిరి దత్త పీఠం వివాదం లో సంఘపరివార్ శక్తుల దూకుడును అడ్డుగడుగునా అడ్డుకునేందుకు, మత సామరస్య సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. సమ సమాజ స్థాపనకు కాగడాలైన వారి వెలుగుబాటలోనే అడుగులేస్తున్నానని తన విధానాల్ని గట్టిగా సమర్థించుకున్నారు. ప్రజాందోళనల్లో పాల్గొనే యువ కార్యకర్తల్ని కన్న బిడ్డలుగా భావించారు. దళిత యువజన కార్యకర్త జిగ్నేశ మేవాని, అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకుడు కన్నయ్యలాల్‌ను తన దత్త పుత్రలని చెప్పుకొన్నారు.అణగారిన వర్గాల కోసం పోరాడే వారిపై ఎనలేని ప్రేమాభిమానాల్ని ప్రదర్శించారు. కేవలం మాటల్లోనే కాకుండా చేతల్లోనూ ప్రదర్శించారు. పత్రికారచనతోపాటు ప్రజాందోళనల క్రియాశీల కార్యకర్త, నేతగానూ జోడు గుర్రాల స్వారీని అప్రతిహతంగా సాగించి 2 రంగాల్లోనూ చెరగని ముద్ర వేసారు. మూఢనమ్మకా లను తీవ్రంగా వ్యతిరేకించే గౌరి, దేవాలయాల్లో జరిగే మూఢనమ్మకాలను విమర్శిస్తూ ఎన్నో కథనాలు ప్రచురించారు. దీంతో ఓ వర్గం నుండి వ్యతిరేకతను ఎదుర్కొనాల్సి వచ్చింది. 2008లో పలువురు హిందుత్వ నాయకులపై రాసిన కథనాలకు గాను రెండు పరువునష్టం కేసు (ఎంపీ ప్రహ్లాద్ జోషి, బీజేపీ నేత ఉమేశ్ దోషిలు వేసిన)ల్లో కోర్టు ఈమెను దోషిగా పేర్కొంది. ఆర్నెల్ల జైలుశిక్షకు ఆదేశించింది. అయితే, అదేరోజు కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది.గౌరీ కుడి-పక్ష హిందూత్వ రాజకీయాలను తీవ్రంగా విమర్శించింది . 2003లో, బాబా బుడాన్ గిరిలో ఉన్న సూఫీ మందిరం గురు దత్తాత్రేయ బాబా బుడాన్ దర్గాను హిందూమతం చేయడానికి సంఘ్ పరివార్ చేసిన ప్రయత్నాలను ఆమె వ్యతిరేకించించారు. 2012లో, మంగళూరులో మత సమూహాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ జరిగిన నిరసనలో పాల్గొంటూ , హిందూ మతం ఒక మతం కాదని, "సమాజంలో సోపానక్రమ వ్యవస్థ" అని, దీనిలో "స్త్రీలను రెండవ తరగతి జీవులుగా చూస్తారు" అన్నారు.

# అధ్యాపక వృత్తికే వన్నెతెచ్చిన షేక్ కరీముల్లా



**కవి షేక్ కరీముల్లాకి అభినందనలు !**

వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి షేక్ కరీముల్లాకు ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రకటించింది.

కరీముల్లా ప్రస్తుతం వినుకొండ మండలం లోని నాగులవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ. విద్యార్థులు, వారి తల్లీదండ్రుల దృష్టిలో ఆదర్శ ఉపాధ్యాయునిగా నిలిచారు.

తెలుగు సాహిత్యంలో ప్రగతిశీల ఇస్లాంవాద కవిత్వానికి కొత్త ఒరవడిని సృష్టించిన కవి,ఆయన కవిత్వం సామాజిక చైతన్యాన్ని రేకెత్తించడమే కాక, ఇస్లాం పట్ల ఉన్న అపోహలను దూరం చేయడంలో కూడా కీలక పాత్ర పోషించింది. ఆయన సృష్టించిన "అబాబీలు" అనే నూతన వచన కవితా ప్రక్రియ, ఇస్లామిక్ సంస్కృతి పంచ సూత్రాలను ప్రతిబింబిస్తూ, తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న ఆవిష్కరణగా నిలిచింది.

సాహితీవేత్త షేక్ కరీముల్లా. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, వినుకొండలో జన్మించిన ఈ కవి, తన రచనల ద్వారా ముస్లిం మైనారిటీల సమస్యలను, సామాజిక అసమానతలను, లౌకికవాదాన్ని ప్రతిబింబించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, కవిత్వమే ఆయన ప్రవృత్తిగా మారి, తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని పొందారు. కరీముల్లా రచనలు కేవలం సాహిత్యం కోసం సాహిత్యమే కాక, సామాజిక చైతన్యాన్ని, మత సామరస్యాన్ని, ప్రగతిశీల ఆలోచనలను ప్రోత్సహించే శక్తివంతమైన సాధనంగా నిలిచాయి. ఈ వ్యాసం కరీముల్లా జీవితం, సాహిత్య కృషి, రచనలు, సాహిత్య రంగంలో ఆయన సాధించిన గుర్తింపును సమగ్రంగా వివరిస్తుంది.

షేక్ కరీముల్లా 1964 జూన్ 1న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, వినుకొండలో జన్మించారు. వినుకొండ, కరువుతో అల్లాడే, వెనుకబడిన ఒక మారుమూల ప్రాంతం. ఈ సాధారణ నేపథ్యంలో పెరిగిన కరీముల్లా, విద్యను అభ్యసించి, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా వృత్తిని ఎంచుకున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, ఆయన హృదయం కవిత్వంలో నిమగ్నమైంది. వినుకొండలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆయన, తన రచనల ద్వారా సామాజిక సంస్కరణలకు, మత సామరస్యానికి, ముస్లిం అస్తిత్వ ఘోషకు నడుంకట్టారు.

కరీముల్లా జీవితం సామాజిక చైతన్యం, లౌకికవాదం, ప్రగతిశీల ఆలోచనలతో నిండి ఉంది. ఆయన బాల్యం నుండి సాహిత్యం, సామాజిక సమస్యలు, ఇస్లామిక్ సంస్కృతి పట్ల ఆసక్తి కలిగి ఉన్నారు. ఈ ఆసక్తి ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది, ఇది ఆయనను తెలుగు సాహిత్యంలో ఒక ప్రముఖ కవిగా నిలబెట్టింది.

సాహిత్య కృషి: కరీముల్లా సాహిత్య కృషి ప్రగతిశీల ఇస్లాంవాదాన్ని ఆధారంగా చేసుకుని, ముస్లిం మైనారిటీల సమస్యలను, సామాజిక అసమానతలను, లౌకిక ఆదర్శాలను చిత్రించింది. ఆయన రచనలు కవిత్వం, దీర్ఘకావ్యాలు, వ్యాసాలు, సాహిత్య సంపాదకత్వంతో సహా వివిధ ప్రక్రియలలో విస్తరించి ఉన్నాయి. ఆయన కవిత్వం సామాజిక చైతన్యాన్ని రేకెత్తించడమే కాక, ఇస్లాం పట్ల ఉన్న అపోహలను దూరం చేయడంలో కూడా కీలక పాత్ర పోషించింది.

కరీముల్లా తన రచనలలో ఇస్లాంవాదాన్ని ఒక సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణ లక్ష్యంగా చిత్రించారు. ఆయన ఇస్లాంవాదం అనేది మతవాదం కాదని, అన్ని మతాలు, కులాలు సోదరభావంతో జీవించే సమాజాన్ని నిర్మించడమే దాని లక్ష్యమని స్పష్టం చేశారు. ఆయన సృష్టించిన "అబాబీలు" అనే నూతన వచన కవితా ప్రక్రియ, ఇస్లామిక్ సంస్కృతి పంచ సూత్రాలను ప్రతిబింబిస్తూ, తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న ఆవిష్కరణగా నిలిచింది.

ప్రచురిత రచనలు: కరీముల్లా ఇప్పటివరకు ఇరవై పుస్తకాలను వెలువరించారు, ఇవి కవితా సంకలనాలు, దీర్ఘకావ్యాలు, వ్యాసాలు, చారిత్రక రచనలను కలిగి ఉన్నాయి. ఆయన రచనలలో కొన్ని ముఖ్యమైనవి:

1) వినుకొండ చరిత్ర (1999) : వినుకొండ ప్రాంత చరిత్రను ఆధారంగా చేసుకున్న చారిత్రక రచన.

2) ఆయుధాలు మొలుస్తున్నాయ్ (2000) : సామాజిక సమస్యలపై కవితా సంకలనం.

3) గాయ సముద్రం (2000) : మైనారిటీ సమస్యలను చిత్రించే కవిత్వం.

4) థూ... (2002): మైనారిటీ కవిత్వం, రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఏ పాఠ్యాంశంగా చేర్చబడింది.

5) నా రక్తం కారుచౌక (2002) : మైనారిటీ సమాజంలోని ఆవేదనను వ్యక్తీకరించే కవిత్వం.

6) సాయిబు (2004) : తెలుగు సాహిత్యంలో దీర్ఘకవిత రాసిన తొలి ముస్లిం కవిగా కరీముల్లాకు గుర్తింపు తెచ్చిన ఈ దీర్ఘకావ్యం, ఆంగ్లం (2020) కన్నడ (2021) భాషలలోకి అనువదించబడింది.

7) ఖిబ్లా (2006) : ఇస్లాంవాద కవితా సంకలనం, సంపాదకత్వం.

8) కవాతు (2008) : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాసిన ఇస్లాంవాద కవితా సంకలనం, కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా చేర్చబడింది.

9 ) ఈద్ ముబారక్ (2008) : ప్రగతిశీల ముస్లిం కవిత్వం.

10 ) కొలిమి (2009) : ఇస్లాంవాద సాహిత్య వ్యాసాలు.

11 ) నన్ను సాయిబును చేసింది వాళ్లే (2013) : ముస్లిం సామాజిక వ్యవస్థ లో ఉన్న అసమానతలను ప్రశ్నిస్తుంది.

12 ) ఎదురుమతం (2015) : నవ్యాంధ్ర తొలి ముస్లిం కవితా సంపుటి.

13 ) బదర్ (అబాబీలు) (2019) : అబాబీలు అనే నూతన వచన కవితా ప్రక్రియ సృష్టికర్తగా గుర్తింపు. కన్నడలోకి అనువదించబడింది (2021).

14 ) %×అ౦ఞుఖ వీబంశ్రీఅ౨% (2020) : "సాయిబు" దీర్ఘకవిత ఆంగ్ల అనువాదం

15 ) బదరో (2021) : "బదర్" కన్నడ అనువాదం.

??అబాబీలు: నూతన కవితా ప్రక్రియ....

కరీముల్లా సృష్టించిన "అబాబీలు" అనే నూతన వచన కవితా ప్రక్రియ, ఇస్లామిక్ సంస్కృతిలోని పంచ సూత్రాలను ప్రతిబింబిస్తుంది. ఈ ప్రక్రియలో కవితలు ఐదు పాదాలను కలిగి ఉంటాయి, ఇవి ఇస్లాం ఐదు ముఖ్య నియమాలకు (అల్లాహ్‌ను ఆరాధించడం, నమాజ్, రోజా, జకాత్, హజ్) ప్రతీకలుగా ఉంటాయి. "అబాబీలు" అనే పేరు చారిత్రక స్ఫూర్తి నుండి పుట్టింది, ఇది పక్షుల గుంపు సూచిస్తుంది. ఈ ప్రక్రియ తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న ఆవిష్కరణగా గుర్తింపు పొందింది.

**కరీముల్లా సాహిత్యంపై పరిశోధనలు**

కరీముల్లా రచనలు వివిధ విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా అధ్యయనం చేయబడ్డాయి:

1) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం : అందుగులపాటి శ్రీనివాసరావు "షేక్ కరీముల్లా సమగ్ర కవిత్వానుశీలన" అనే అంశంపై 600 పేజీల పరిశోధనా గ్రంథం సమర్పించారు.

2) అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం : డాక్టర్ సుహాసినీ పాండే "సాయిబు" దీర్ఘకవితపై, డాక్టర్ గుమ్మా సాంబశివరావు "కవాతు" పై పరిశోధన పత్రాలు సమర్పించారు.

3) వినుకొండ కవిత్రయం : డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ "ఆవిష్కర్తలు" పుస్తకంలో కరీముల్లాను గుర్రం జాషువా, పులుపుల వెంకట శివయ్యతో పాటు వినుకొండ కవిత్రయంగా పేర్కొన్నారు.

పాఠ్యాంశాలుగా కరీముల్లా గారి సాహిత్యం, కవిత్వం పాఠశాలల నుండీ విశ్వవిద్యాలయాల వరకు తుసుకోబడ్డాయి.

1) థూ...: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఏ ద్వితీయ సంవత్సరం పాఠ్యాంశం.

2) సాయిబు : కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆరు సంవత్సరాలు పాఠ్యాంశంగా ఉంది.

3) కవాతు : కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆరు సంవత్సరాలు పాఠ్యాంశంగా ఉంది.

4) ఆంధ్రప్రదేశ్ డిగ్రీ టెక్స్టుబుక్ : కరీముల్లా గురించి మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది.

**జాతీయ అంతర్జాతీయ గుర్తింపు....**

కరీముల్లా "సాయిబు" దీర్ఘకవిత ఆంగ్లం కన్నడ భాషలలోకి అనువదించబడి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ రచన ముస్లిం అస్తిత్వ ఘోషను ప్రపంచవ్యాప్తంగా వినిపించింది, ఆయనను ఒక ప్రాంతీయ కవి నుండి జాతీయ కవిగా ఉన్నత స్థానానికి చేర్చింది. ఆయన రచనలు సామాజిక సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తెచ్చాయి.

**సాహిత్య శైలి ప్రభావం**

కరీముల్లా సాహిత్య శైలి సరళమైనది, హృదయాన్ని హత్తుకునేది. ఆయన కవిత్వం ముస్లిం సమాజంలోని ఆవేదనను, సామాజిక అసమానతలను, లౌకికవాద ఆదర్శాలను వ్యక్తీకరిస్తుంది. "అబాబీలు" వంటి ఆవిష్కరణలు ఆయన సృజనాత్మకతకు నిదర్శనం. ఆయన రచనలు యువ కవులకు, రచయితలకు స్ఫూర్తినిచ్చాయి, తెలుగు సాహిత్యంలో ముస్లిం సాహితీవేత్తలకు ఒక గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాయి.

**సాహిత్యంపై విశ్లేషణలు.....**

1) డాక్టర్ ద్వానా శాస్త్రి గ్రూప్ 1, సివిల్ సర్వీసెస్ పుస్తకాలలో కరీముల్లా కవిత్వంపై విశ్లేషణలు.

2) అలిసె నాగేశ్వరరావు "కోస్తాంధ్ర సాహిత్యంలో ప్రాంతీయ చైతన్యం"లో కరీముల్లా ఇంటర్వ్యూ విశ్లేషణలు.

3. డాక్టర్ కుతుబ్ సర్వర్ "మషూర్ తెలుగు షాయర్"లో కరీముల్లా కవిత్వంపై విశ్లేషణలు.

**సాహిత్య సభలలో పాత్ర.....**

కరీముల్లా ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక సాహిత్య సభలలో కవిగా, వక్తగా పాల్గొని, ప్రసంగాలు చేశారు. ఆయన వక్తృత్వం సామాజిక సంస్కరణలు, మత సామరస్యం, ప్రగతిశీల ఆలోచనలపై దృష్టి సారించింది.

షేక్ కరీముల్లా తన రచనల ద్వారా తెలుగు సాహిత్యంలో ప్రగతిశీల ఇస్లాంవాదాన్ని ఆవిష్కరించారు. "సాయిబు", "అబాబీలు" వంటి ఆయన రచనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఆయన కవిత్వం సామాజిక చైతన్యాన్ని రేకెత్తించడమే కాక, ముస్లిం సమాజంలోని సమస్యలను, లౌకిక ఆదర్శాలను ప్రపంచానికి చాటిచెప్పింది. వినుకొండ నుండి జాతీయ స్థాయికి ఎదిగిన ఈ కవి, తెలుగు సాహిత్యంలో ఒక స్ఫూర్తిదాయక శక్తిగా నిలిచారు.

**రచన..చిత్రం మహమ్మద్ గౌస్**

# సాహితీ ఆకాశంలో మిలమిల మెరిసే 'జాబిల్లి'

అవార్డులు కొందరికి ఆభరణాల్లాగా విలువను, గుర్తింపును ఇస్తాయి.

కొందరు అవార్డుకి ఆభరణంగా మారి వన్నె తెస్తారు. అలాంటి కొందరిలో జాబిలి జయచంద్ర (జాబిలి చాంద్ బాషా) ఒకరు. అనేక ప్రత్యేకతలతో, ప్రతిభతో అనేక పురస్కారాలు అందుకున్న వారు చాంద్ బాషా . జాబిలి ఆయన ఇంటి పేరు. నేను పొరపాటు పడటం లేదు. ఎవరిని అడిగినా జాబిలి అనే అంటారు. 'జాబిలి' పేరుతో పత్రికను స్థాపించి, సాహిత్య రంగంలో విశేష సేవలు చేయటమే కాక జాబిలి కలం పేరుతో అనేక రచనలు చేయటం వల్ల 'జాబిలి' ఆయన ఇంటిపేరుగా సార్థకత అయింది.

విద్యారంగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకొని అవార్డుకి వన్నెతెచ్చారు చాంద్ బాషా.

చాంద్ బాషా కంటే '/జాబిలి చాంద్ బాషా' అని పిలిస్తేనే మన మనసులో ఒక పూలవనం వికసిస్తుంది. ఒక సౌరభం చుట్టుముడుతుంది. సాహిత్య, సామాజిక, విద్యారంగాలలో ఆయన చేసిన సేవల సౌరభాలు మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. విద్యార్థులే ధ్యాసగా, సాహిత్య మే శ్వాసగా, సమాజసేవే సర్వస్వంగా భావించి, కాలాన్ని కంఠాన ధరించి పరుగెడుతున్న వాడు చాంద్ బాష.

శ్రమ, శ్రద్ధ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతలను హృదయమాలలుగా ధరించిన వాడు.

బాలల వనములో తోటమాలిగా చిరు మొలకలను కల్ప వృక్షాలుగా తీర్చిదిద్దిన చరిత్ర జాబిలిది.కవిగా, రచయితగా అనేక కవితలను, వ్యాసాలను వ్రాశారు. 'జాబిలి' పత్రిక సంపాదకుడిగా సేవలు అందిస్తున్నారు.

ప్రకృతి పరిరక్షణ, మత సామరస్యం, సర్వమత సమానత్వం, మూఢవిశ్వాసాల ఖండన, సాంఘిక దురాచారాలు, సామాజిక రుగ్మతలు, డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీజీ,మహాకవి వేమన మొదలగు మహనీయుల గొప్పతనాన్ని చాటిచెప్పే కవి సమ్మేళనాలను నిర్వహించారు. వేకువ సాహితీ కళా సమాజసేవా సంస్థ,అనంత సాహిత్య అకాడమీ, జాబిలి బాలల వికాస్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం మొదలగు సంస్థల అధ్యక్షుడిగా, జాబిలి సాహిత్య పత్రిక సంపాదకుడిగా ఎనలేని సేవలు అందిస్తున్నారు. తను పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను, పిల్లల సృజనాత్మకతను వెలికి తెచ్చి, వారి మానసిక వికాసానికి తోడ్పడే కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల మానసిక పరిపక్వతకు, విజ్ఞానానికి నిరంతరం శ్రమిస్తున్నారు. వివిధ రంగాలలో చాంద్ బాషాగారి సేవలు అమూల్యమైనవి. వీరి వచన కవితా సంపుటి 'మట్టిని ముద్దాడిన మనిషి'లోని ఈ కవితలను చూడండి.



***ఆనందం పూల వానలో ...***
*కాల గమనంలో*
*జ్ఞాపకాల జీవన సౌరభాలెన్నో*
*కనుమరుగై పోతున్నాయి!*
*ఋతువులు మారుతున్న కొలది*
*ప్రకృతి తన రంగులను మార్చుకున్నట్లు మనిషి*
*కాలంతో పాటు మారాల్సిందే!*

*నిన్నటి జ్ఞాపకాలను నెమరేస్తూ*
*రేపటి నవ్వులకై నేడే ఉదయించాలి*
*ఎన్ని బాధలైనా, మరెన్ని సుఖాలైన నిన్నటివి తిరిగి రానివి*

*జీవితమంటే రేపటికై పోరాటమే ఆనందపూల వానలో*
*తడవటానికి ప్రతినిత్యం జీవన సాగరం ఈదాలి*
*నిన్న నేడు*
*నీవున్నావన్నది నిజమైనా*
*రేపటికి నీవు*
*ఏమవుతావో ఊహించనిది*
*అందుకే...*
*నేడు నిన్ను నీవు మలచుకోవాలి!*

*ఈ దేశం నా దేహం*
*ఆకాశం అద్దం ముందు*
*నా దేహాన్ని చూసినపుడల్లా*
*ఇది నా దేహమని గర్విస్తాను*
*వేకువలో మంచు తెరల్లో నడుస్తుంటే అమరవీరులు*
*చిందించిన చెమట చుక్కలకు మొలకెత్తిన నా దేహం*
*ఈ మట్టి కణాల రూపమే కదాని తడిసిపోయాను*
*సెలయేరుల సవ్వడి విన్నపుడల్లా*
*నా జీవనాధారానికి దారువైన నీరు*
*ఈ పుణ్యభూమిలో జాలువారినదే కదా!*
*చల్లగాలి తెమ్మెరలు నను తాకినపుడల్లా నా దేశ*
*జెండాను రెపరెపలాడించిన ఆ గాలి నా ఉచ్ఛ్వాస*
*నిశ్వాసాల ప్రాణవాయువు కదాని తుళ్ళిపడ్డాను*
*నదీ తీరాన నేను నిల్చున్నప్పుడు సస్యశ్యామల నాదేశ*
*జీవనదులే కదా*
*నా రక్తనాళాలలో ప్రవహిస్తున్నదని పరవశించాను!*
*ప్రతి ఉదయం పుడమి పాదాల చెంత పువ్వై విరబూస్తాను!*
*ప్రతి సాయంకాలం అవని ఒడిలో*
*సంధ్యా వందనమై అస్తమిస్తాను!*
*ఎన్ని జన్మలైనా నా జన్మభూమి కోసం జనిస్తాను!*
*మరెన్ని జన్మలైనా మాతృభూమి కోసం మరణిస్తాను!*

సైకత శిల్పం -కవితలో జాబిలి ఇలా అంటారు.

*ఎన్నో తప్పులు కొన్ని ఒప్పులకు కారణమైన చేతులను*
*అమరవీరుల చరణ ధూళితో కడిగి*
*ఆశ నిరాశల స్వార్థ సంసార పంజరాన్ని ఛేదించాను!*
*పగలూ రేయీ సుఖదుఃఖాలను నెమరేసిన శరీరాన్ని*
*మహాత్ముల ఆత్మ బలముతో నింపి*
*కామ, క్రోధ, ఈర్ష్యా ద్వేషాల గజిబిజి జీవితం వరదా తీసాను*
*అద్భుత ప్రపంచంలో జననం ఒక వరం మరణం ఒక నిజమని తెలుసుకున్నాను!*
*నా జీవనం నలుగురి కోసం*
*నా గమనం నలుగురి కోసం కావాలని*
*నవ జీవన కాంతి తలుపు తట్టి మేలుకున్నాను!*
*ఉషోదయ ఊపిరితో ముందడుగు వేశాను!*

జాబిలి ఈ కవితల్లో తనకుతాను దిశానిర్దేశం చేసుకుంటూనే,మనం నడవాల్సిన బాటను మనముందుంచుతున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే విద్యా రంగంలో, సాహిత్య, సామాజిక రంగాల్లో ఆయన చేస్తున్న సేవలు అమూల్యమైనవి.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ,పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరము తపించే జాబిలికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఏనాడో రావాల్సింది. ఈ పురస్కారానికి అన్నివిధాలా అర్హతలున్న జాబిలి చాంద్ భాషా ఈ సెప్టెంబర్ నెల 5వ తేదీన అవార్డును అందుకోవడం ఉపాధ్యాయులకు, సాహితీ మూర్తులకు సంతోషం కలిగించే విషయం.

ఈ సందర్భంగా జాబిలికి నా అభినందనలు.శుభాకాంక్షలు.

**డి.కె.చదువులబాబు.**



## ఈసీ పదేళ్లుగా ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోంది : ఖర్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఈసీ ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోందని, కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని ఆరోపించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలక డేటాను ఇప్పటికీ ఎన్నికల సంఘం బయటపెట్టలేదన్నారు.మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే చెప్పారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి, ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే చెప్పారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీ ద్వారా గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని, బీహార్‌లో మాత్రం బీజేపీ, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పారు.

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
సోమవారం
08 । సెప్టెంబర్ । 2025

## యువకుడితో మహిళ సాన్నిహిత్యాన్ని చూసిన బాలిక.. ఇద్దరూ కలిసి చిన్నారిని హత్య

**లక్నో-నవభూమి:** వివాహిత మహిళ, యువకుడు సాన్నిహిత్యంగా ఉండటాన్ని ఒక బాలిక చూసింది. తన తండ్రికి ఈ విషయం చెబుతానని ఆమె బెదిరించింది. ఈ నేపథ్యంలో వారిద్దరూ కలిసి ఆ బాలికను హత్య చేశారు. మృతదేహాన్ని బావిలో పడేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 30 ఏళ్ల వివాహిత మహిళకు, పొరుగున ఉండే 17 ఏళ్ల యువకుడి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. సెప్టెంబర్ 4న భర్త, అత్త బయటకు వెళ్లడంతో ఆ మహిళ యువకుడ్ని తన ఇంటికి పిలిచింది.కాగా, వారిద్దరూ సాన్నిహిత్యంగా ఉండటాన్ని ఆ ఇంటికి వచ్చిన ఆరేళ్ల బాలిక చూసింది. దీంతో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని ఆ బాలికను వారు బెదిరించారు. అయితే తన తండ్రికి చెబుతానని ఆ చిన్నారి చెప్పింది. ఈ నేపథ్యంలో మహిళ, ఆ యువకుడు కలిసి ఆ బాలిక గొంతునొక్కి హత్య చేశారు. మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి పాడుబడిన బావిలో పడేశారు.మరోవైపు బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆ చిన్నారి కోసం వెతకగా బావిలో పడేసిన గోనె సంచిలో బాలిక మృతదేహం లభించింది. ఆమె మెడకు గుడ్డ బిగించి ఉండటంతో షాకయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు. బాలిక మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించగా గుడ్డతో గొంతుబిగించి హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది.కాగా, బాలిక హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. చివరకు నిందితులైన మహిళ, యువకుడ్ని అరెస్ట్ చేశారు. హత్య సందర్భంగా బాలిక పెనుగులాడటంతో ఆ మహిళ చేతిపై కొరికిన గుర్తులున్నాయని పోలీస్ అధికారి వెల్లడించారు.

## రెస్టారెంట్‌లో పార్కింగ్ వివాదం.. యజమాని, జడ్జీ పరస్పర ఫిర్యాదులు





**పనాజీ-నవభూమి:** పార్కింగ్ విషయంపై రెస్టారెంట్ సిబ్బంది, మహిళా జడ్జి మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ జడ్జి, రెస్టారెంట్ యజమాని ఒకరిపై మరొకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువురి ఫిర్యాదులపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. గోవాలో ఈ సంఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సివిల్ జడ్జి దీపాంషి చౌదరి, తన భర్త నితిన్ లాల్‌తో కలిసి గోవా వెళ్లారు. శుక్రవారం రాత్రి అంజునా బీచ్‌లోని ఒక రెస్టారెంట్ వద్ద పార్కింగ్ వివాదంపై సిబ్బంది, వారి మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగిందిాగా, ఈ సంఘటన నేపథ్యంలో జడ్జి దీపాంషి చౌదరి ఆ రెస్టారెంట్ సిబ్బందిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను, తన భర్తను సిబ్బంది దుర్భాషలాడారని, నెట్టారని, బెదిరించారని, తన పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు ఆమె ఆరోపించారు. దీంతో రెస్టారెంట్ సిబ్బందిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.మరోవైపు రెస్టారెంట్ యజమాని సమర్థ్ సింఘాల్ కూడా జడ్జి దీపాంషి చౌదరి, ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బందిని వారు తిట్టారని, నిర్బంధించినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మహిళా న్యాయమూర్తి, ఆమె భర్తపై కూడా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇరువురి ఫిర్యాదులపై నమోదైన కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## వ్యాపారి వద్ద రూ.80 వేలు కొట్టేసి.. 2 లక్షల విలువైన బైక్ మర్చిపోయారు..



**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో విచిత్ర ఘటన చోటుచేసుకున్నది. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు తాము కొల్లగొట్టిన దానికంటే రెండు రెట్ల సొమ్మును కోల్పోయారు. రాత్రి 11 గంటల సమయంలో భోపాల్‌ని అయోధ్య నగర్ ప్రాంతంలో కిరాణా వ్యాపారి నీరజ్ తన దుకాణాన్ని బంద్ చేసి.. నగదుతో స్కూటర్‌పై ఇంటికి బయల్దేరాడు. అదేసమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతని బ్యాగ్ లాక్కోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో నీరజ్ స్కూటర్‌పై నుంచి కిందపడిపోయాడు. దీంతో బ్యాగ్ కూడా పడిపోయింది.గమనించిన దొంగలు తమ బైక్‌పైనుంచి దిగి దానిని తీసుకున్నారు. అయితే నీరజ్ కేకలు వేయడంతో స్థానికులు గుమికూడారు. దీంతో దొంగలు తమ బైక్‌పై పారిపోదామని చూడగా, అది స్టార్ట్ కాలేదు. దీంతో తమ కాళ్లకు పనిచెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాగ్‌లో రూ.80 వేలు ఉన్నాయని, వారు దానిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. అయితే దొంగలు వదిలివెళ్లిన బైకును పోలీసులు సీజ్ చేశారు. దాని విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని చెప్పారు. బైక్ రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా దొంగలను గుర్తిస్తామని, వారిని తొందర్లోనే పట్టుకుంటామని చెప్పారు. ఇదంతా చూసిన స్థానికులు పాపం దొంగలు.. రూ.80 వేలు ఎత్తుకెళ్తే, రూ.2 లక్షలు నష్టపోయారని అన్నారు.

## మహిళను చెట్టుకు కట్టేసి.. జుట్టుపట్టి కొట్టి, వివస్త్రను చేశారు

**చెన్నై-నవభూమి:** తమిళనాడులోనికడలూరు జిల్లా పన్రుతి సమీపంలో దారుణం చోటుచేసుకున్నది. ఓ మహిళలను చెట్టుకు కట్టేసి విచక్షణా రహితంగా కొట్టడంపోపాటు వివస్త్రను చేశారు. నలుగురు మహిళలు కలిసి ఓ మహిళను ఆమె చీరతోనే చెట్టుకు కట్టేశారు. అనంతరం ఆమెపై దాడిచేయడంతోపాటు జాకెట్‌ను చించివేశారు. నువ్వు కుక్కతో సమానం అంటూ ఓ మహిళ బాధితురాలిని బూతులు తిడుతుండగా, మరొకరు కర్రతో కొట్టింది. మరొకరు ఆమె జుట్టుపట్టుకుని లాగింది. అక్కడితో ఆగకుండా ఆమె జాకెట్‌ను చించివేశారు. అయితే బాధితురాలిని పూర్తిగా వివస్త్రను చేయకుండా ఆ నలుగిరిలో ఒకరు ఆమెను గట్టిగా పట్టుకున్నది. ఇదంతా అక్కడే ఉన్న కెమెరాలో రికార్డయింది. 2.13 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.కాగా భూ వివాదం కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఓ మహిళలను అరెస్టు చేశామని, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. వారిని గాలించడం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

# పల్నాడు జిల్లా తురకపాలెంలో ఏం జరుగుతోంది?

**గుంటూరు-నవభూమి:** పల్నాడు జిల్లా తురకపాలెంలో ఇవాళ(సోమవారం) బృందం పర్యటించనుంది. అక్కడి మట్టి నమూనాలు సేకరించబోతోంది. ఇప్పటికే తురకపాలెంలో ఎయిమ్స్ బృందం వైద్యులు పర్యటించి గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించారు. 'మెలియాయిడోసిస్' లక్షణాలున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఆరుగురికి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు.

ఈ క్రమంలో ఇవాళ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ బృందం పర్యటించి గ్రామంలోని వ్యవసాయ భూముల నుండి మట్టి నమూనాలను సేకరించి, నీటి సరఫరా, మట్టి ఫలదీకరణ స్థితిని విశ్లేషించనుంది. దీంతోపాటు, బృందం గ్రామస్తులతో సమావేశమై, వారి అనుభవాలు, సమస్యలపై చర్చించి, సాంకేతిక సలహాలు అందించనుంది.

మరోవైపు, ఎయిమ్స్ బృందం తీసుకున్న గ్రామస్తుల రక్తనమూనాల ఆధారంగా గ్రామంలో ఆరోగ్య సమస్యలను గుర్తించి, తగిన చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో వైద్య సిబ్బంది గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని తనిఖీ చేస్తూ, మరికొందరి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఈ పరీక్షల్లో మట్టి, నీటి కలుషితం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇక, గుంటూరు జీజీహెచ్‌లోని ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న తురకపాలేనికి చెందిన ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా తేలింది. 46 ఏళ్ల ఆ వ్యక్తి మోకాలిలోని ద్రవాన్ని సేకరించి పరీక్షకు పంపించగా ఈ వ్యాధి నిర్ధారణ అయిందని గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రకటించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. మరో పరీక్ష కోసం ఎడమ మోకాలికి ఎంఆర్ఐ స్కానింగ్ చేసినట్లు చెప్పారు. ఇదివరకే పాజిటివ్‌గా తేలి, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరొక రోగి ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

కాగా, తురకపాలెంలో ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అనుమానిత లక్షణాలున్న 72 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా నలుగురిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు గుర్తించామని అధికారులు ప్రకటించారు. గ్రామంలో నిపుణులతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధులను, పరిసరాలను, నీటి ట్యాంకులను శుభ్రపరిచారు. ఇంటింటికీ ఆహారం, సురక్షిత జలాలు అందిస్తున్నారు.

ఇదిలాఉంటే, తురకపాలెంలో రెండు నెలల వ్యవధిలో 38 మంది వరకు చనిపోవడం గ్రామస్తుల్ని కలవరపెడుతోంది. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. మరణాల వెనక మిస్టరీ ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ప్రభుత్వం మరణాలపై సీరియస్ గా దృష్టి సారించింది. మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయో తెలుసుకునే పనిలో పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తురకపాలెం మరణాలపై ఆరాతీశారు. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మరణాలపై సోమవారం లోగా తుది నివేదిక ఇవ్వాలని అధికారులతో చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తురకపాలెం గ్రామంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు.

గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లకు వెళ్లి బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. మెలిన్ అనే బ్యాక్టీరియా కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయని వైద్య అధికారులు చెబుతున్నారు.

## కొండపై మహాకాళి ఆలయం.. తెగిపడిన కార్గో రోప్‌వే, ఆరుగురు దుర్మరణం



**కోల్‌కతా-నవభూమి:** ఆలయం వద్ద విషాదం చోటు చేసుకుంది. కొండ పైకి కిందికి తిరిగే రోప్ వే తెగిపడి ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కొండపైన ఉన్న ఆలయానికి చేరుకోవాలంటే మెట్లు ఎక్కడం, లేదా రోప్ వే ద్వారా వెళ్లాల్సిందే. అయితే భక్తులు ప్రయాణించే రోప్ వేను పలు కారణాల వల్ల నిలిపేశారు. దీంతో భక్తులంతా మెట్ల మార్గం నుంచే కొండపైన ఆలయానికి చేరుకుంటున్నారు. అయితే వస్తువులు, ఇతర సరుకులు పంపించేందుకు మాత్రమే ప్రస్తుతం రోప్ వే ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆ కార్గో రోప్ వే ప్రమాదానికి గురైంది. రోప్ వే వెళ్తుండగా.. ఒక్కసారిగా వైరు తెగడంతో.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇక భక్తుల రోప్ వే కూడా పనిచేస్తే.. ఈ ప్రమాదం మరింత పెద్దది అయ్యేదని స్థానికులు చెబుతున్నారు. గుజరాత్‌లోని పంచ్‌మహల్ జిల్లాలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పావగఢ్ శక్తి పీఠంలో కార్గో రోప్‌వే వైర్ అకస్మాత్తుగా తెగిపోవడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. చనిపోయిన వారిలో ఇద్దరు లిఫ్ట్‌మెన్లు, ఇద్దరు కార్మికులతో పాటు మరో ఇద్దరు స్థానికులు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను పంచ్‌మహల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ హరీష్ దుధత్ వివరించారు. ఈ రోప్ వే తెగిపడిన తర్వాత.. ఆ ప్రాంతం మొత్తం తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొందని స్థానికులు తెలిపారు. పావగఢ్ శక్తి పీఠం మహాకాళి అమ్మవారికి అంకితం ఇచ్చారు. ఈ కొండ భూమికి దాదాపు 800 మీటర్ల ఎత్తులో ఉంటుంది. కొండ నుంచి పైకి వెళ్లేందుకు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి భక్తులు 2 వేల మెట్లు ఎక్కి.. ఆలయాన్ని చేరుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా రోప్‌వే ద్వారా కూడా కొండపైకి వెళ్లొచ్చు. అయితే శనివారం ఉదయం నుంచి.. పలు కారణాలతో భక్తులను తరలించే రోప్ వేను నిర్వాహకులు మూసివేశారు. కేవలం వస్తువులను పైకి తీసుకెళ్లడానికి ఉపయోగించే కార్గో రోప్‌వే మాత్రమే నడిపిస్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది.పావగఢ్ శక్తి పీఠం మహాకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు.. ప్రతీ సంవత్సరం దాదాపు 25 లక్షల మంది భక్తులు వెళ్తూ ఉంటారు. అలాంటి క్షేత్రంలో ఈ ప్రమాదం జరగడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఇప్పటివరకు ప్రమాదానికి గల కారణాలను అధికారులు వెల్లడించలేదు. టెక్నికల్ దర్యాప్తు నిర్వహించిన తర్వాతే అసలు ప్రమాదం ఎందుకు జరిగిందనే కారణం స్పష్టంగా తెలుస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు సహాయం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే.. పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

## పుట్టిన రోజు పార్టీ తర్వాత.. యువతిపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారం



**కోల్‌కతా-నవభూమి:** యువతి పుట్టిన రోజు సెలబ్రేషన్ పేరుతో పరిచయం ఉన్న వ్యక్తి మరో వ్యక్తి ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె బర్త్ డే పార్టీ జరిపారు. ఆ తర్వాత ఆ ఇద్దరు వ్యక్తులు కలిసి ఆ యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. దక్షిణ కోల్‌కతా పూజా కమిటీ హెడ్ అయిన చందన్ మాలిక్‌కు కొన్ని నెలల కిందట హరిదేవ్‌పూర్ ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువతి పరిచయం అయ్యింది. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగి అయిన ద్వీప్ బిశ్వాస్‌కు ఆమెను పరిచయం చేశాడు. ఆ యువతిని పూజా కమిటీలో చేర్చుతామని వారిద్దరూ హామీ ఇచ్చారు. ఈ ముగ్గురు తరచుగా మాట్లాడుకుంటున్నారు.కాగా, సెప్టెంబర్ 5న ఆ యువతి పుట్టిన రోజు. దీంతో శుక్రవారం రాత్రి బర్త్ డే సెలబ్రేషన్ పేరుతో చందన్ ఆ యువతిని రీజెంట్ పార్క్ ప్రాంతంలోని దీప్ ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బర్త్ డే పార్టీ తర్వాత వారు భోజనం చేశారు. ఆ యువతి తన ఇంటికి వెళ్తానని చెప్పగా వారిద్దరూ డోర్ లాక్ చేశారు. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.మరోవైపు మరునాడైన శనివారం ఉదయం ఆ యువతి అక్కడి నుంచి తప్పించుకున్నది. తన ఇంటికి చేరుకున్న తర్వాత జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆ తర్వాత తనపై జరిగిన సామూహిక అత్యాచారం గురించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులైన చందన్, దీప్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వారిద్దరిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## బాలికపై వ్యక్తి అత్యాచారం.. ఆమె ప్రసవించిన శిశువు మృతి



**లక్నో-నవభూమి:** వివాహితుడైన వ్యక్తి ఒక బాలికను లోబర్చుకున్నాడు. ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భం దాల్చిన ఆ బాలిక నెలలు నిండని శిశువును ప్రవించింది. అయితే పుట్టిన కొన్ని నిమిషాలకే ఆ బిడ్డ మరణించింది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవాబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతానికి చెందిన 31 ఏళ్ల రషీద్ వివాహితుడు. అతడికి ఇద్దరు పిల్లలున్నారు.కాగా, ఏడు నెలల కిందట పొరుగున నివసించే 11 ఏళ్ల బాలికకు పండు ఇస్తానని చెప్పి తన ఇంటికి రషీద్ రప్పించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఆమె కుటుంబాన్ని చంపుతానని బెదిరించాడు. తనతో లైంగిక సంబంధం కొనసాగించాలని బలవంతం చేశాడు. వీడియో రికార్డ్ చేసి ఆ బాలికను బ్లాక్‌మెయిల్ చేశాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు.మరోవైపు సెప్టెంబర్ 4న ఆ బాలిక కడుపు నొప్పితో బాధపడింది. దీంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అల్ట్రాసౌండ్ పరీక్ష చేసిన డాక్టర్లు ఆ బాలిక ఏడు నెలల గర్భిణి అని నిర్ధారించారు. దీంతో ఆమెను మహిళా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అదే రోజున నెలలు నిండని బిడ్డను ప్రసవించింది. అయితే కొద్దిసేపటికే ఆ శిశువు మరణించించింది. అధిక రక్త స్రావం, చిన్న వయస్సులో కాన్పు వల్ల ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నదని డాక్టర్లు తెలిపారు. అయితే ఆమె కోలుకుంటున్నది వెల్లడించారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. బాలిక సోదరుడి ఫిర్యాదుతో నిందితుడైన రషీద్‌ను అరెస్ట్ చేశారు. బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన నిందితుడి డీఎన్ఏతో సరిపోల్చడానికి మరణించిన శిశువు డీఎన్ఏ నమూనా సేకరించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రషీద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


## నటి సుధపై అసభ్యకరంగా పోస్టులు..పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్-నవభూమి:** సినీ నటి రంగ సుధపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. నటి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, రాధాకృష్ణ అనే వ్యక్తి తనపై అసభ్యకరమైన పోస్టులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాడని పేర్కొన్నారు.



గతంలో రాధాకృష్ణతో తాను రిలేషన్‌లో ఉన్నట్లు రంగ సుధ ఫిర్యాదులో తెలిపింది. తాము కలిసి ఉన్న సమయంలో తీసిన కొన్ని ప్రైవేట్ వీడియోలు, ఫొటోలు బయట పెడతానని గతంలోనే రాధాకృష్ణ తనను బెదిరించాడని ఆమె ఆరోపించింది. ప్రస్తుతం కొన్ని ట్విట్టర్ పేజీలతో పాటు రాధాకృష్ణ కూడా అసభ్యకర పోస్టులు చేస్తున్నాడని నటి ఫిర్యాదులో తెలిపారు. దీంతో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు షేర్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## మరోసారి భారత్‌పై పీటర్ నవారో విమర్శలు.. ఎలాన్ మస్క్‌పై కూడా..!




**న్యూయార్కు-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీనియర్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి భారత్‌పై విమర్శల దాడి చేశారు. ఈ సారి ఆయన ఎలాన్ మస్క్‌తో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌ను సైతం టార్గెట్ చేశారు. ఎక్స్ ఫ్యాక్ట్‌చెక్ 'తప్పుదారి పట్టించేదిస అని పేర్కొన్నారు. రష్యా నుంచి చౌకగా ముడి చమురును కొనుగోలు చేస్తూ భారత్ లాభాలను ఆర్జిస్తోందని.. ఆయిల్ కొనుగోలుతో వచ్చిన డబ్బుతో రష్యా యుద్ధ యంత్రాన్ని నడిపిస్తుందని పీటర్ నవారో ఆరోపించారు. 'భారత్ అధిక సుంకాలు అమెరికన్ ఉద్యోగాలను చంపుతోందని.. భారత్ లాభం కోసమే రష్యన్ చమురును కొనుగోలు చేస్తుంది. ఈ ఆదాయం రష్యాకు యుద్ధంలో బలాన్ని ఇస్తుంది. ఉక్రేనియన్లు, రష్యన్లు చనిపోతున్నారు.

అమెరికన్ పన్ను చెల్లింపుదారులు ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు. భారతదేశం సత్యాన్ని తట్టుకోలేక అబద్ధాలను వ్యాప్తి చేస్తోంది' భారతదేశం అధిక దిగుమతి సుంకం (సుంకం) కారణంగా అమెరికన్ పరిశ్రమ భారీ నష్టాలను చవిచూస్తోందని కూడా నవారో ఆరోపించారు. పీటర్ నవారో పోస్ట్ కింద ఎక్స్ ఓ ఫ్యాక్ట్ చెక్‌ను జోడించి.. రష్యన్ చమురు కొనుగోలు చేయడం పూర్తిగా చట్టబద్ధమైందని.. దాని ఇంధన భద్రత కోసం అంటూ కామెంట్‌ని జోడించారు. ఎక్స్ ఫ్యాక్ట్‌చెక్ "భారతదేశం రష్యన్ చమురు దిగుమతులు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించవు" అని పేర్కొంది. "భారతదేశం కొన్ని ఉత్పత్తులపై సుంకాలు ఉన్నప్పటికీ, భారతదేశంతో సేవలలో అమెరికాకు వాణిజ్య మిగులు ఉంది. అమెరికా ఇప్పటికీ రష్యా నుంచి యురేనియం వంటి కొన్ని వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. ఈ పరిస్థితిలో భారత్‌ను విమర్శించడం ద్వంద్వ ప్రమాణాలను చూపుతుంది అని పేర్కొంది.ఆ తర్వాత ఎక్స్ యజమాని ఎలోన్ మస్క్‌పై సైతం నవారో విమర్శలు గుప్పించారు. 'వావ్! ఎలోన్ మస్క్ ప్రజల పోస్టలలోకి ప్రచారాన్ని అనుమతిస్తున్నారు. ఫ్యాక్ట్‌చెక్ అర్థం లేనిదని.. భారతదేశం లాభాపేక్ష కోసం మాత్రమే రష్యన్ చమురును కొనుగోలు చేస్తుందని.. యుద్ధానికి ముందు భారతదేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయలేదన్నారు. ఉక్రేనియన్లను చంపడం ఆపండి.. అమెరికన్ ఉద్యోగాలను తొలగించడం ఆపండి అంటూ స్పందించారు. ఇదిలా ఉండగా.. భారత్‌పై అమెరికా ఇప్పటి వరకు 50శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దాంతో భారత్ ఎగుమతులపై 50శాతం కంటే ఎక్కువగా సుంకాలు ఉన్నాయి. బ్రెజిల్ కంటే అత్యధికం.సుంకం విధించిన కొన్ని గంటలకే.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ యుద్ధంగా నవారో అభివర్ణించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యా సైనిక దురాక్రమణ బలపడుతోందని ఆరోపించారు. నవారో మరింత ఘాటుగా ఆరోపణలు చేస్తూ భారత్-క్రెమ్లిన్‌ను లాండ్రోమాట్‌గా పిలుస్తూ.. భారతీయ ప్రజల ఖర్చుతో లాభపడుతున్న బ్రాహ్మణులు ఉన్నారు అంటూ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారు. భారత శుద్ధి కర్మాగారాలు చౌకైన రష్యన్ ముడి చమురును ప్రాసెస్ చేసి, అధిక ధరలకు ఇతర దేశాలకు అమ్ముతున్నాయని ఆయన పేర్కొన్నారు. రష్యా-చైనాతో ప్రధాని మోదీ సందేశం సుంకం వివాదం మధ్య, చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. అక్కడ ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌లతో సమావేశమయ్యారు.

## పీసీసీ అధ్యక్షుడి ఇంట్లో దొంగల బీభత్సం.. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులు..



**ఇండోర్-నవభూమి:** మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఇండోర్‌లోని రాజేంద్ర నగర్ జిజల్‌పూర్‌లో ఉన్న పీసీసీ చీఫ్ జీతూ పట్వారీ ఇంట్లోకి ప్రవేశించిన అరడజను మందికి పైగా దొంగలు.. కరెంట్ బంద్ చేసి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఇంటిలోని ఆఫీస్‌లో ఉన్న డ్రాలు, లాకర్లను బద్దలు కొట్టారు. విలువైన వస్తువులు, మొబైళ్లను వదిలేసి మిగిలిన వస్తువులను ఎత్తుకెళ్లారు. అయితే విలువైన వస్తువులను వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ముఖాలు కనిపించకుండా మాస్కులు వేస్తున్న దొంగలు పటేల్ ఇంటితోపాటు సమీపంలోని చీఫ్ మున్సిపల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ఠాకూర్, మధ్యప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఆఫీసర్ నరేంద్ర దూబే ఇంట్లోనూ చొరబడ్డారు. సుమారు రెండున్నర గంటల పాటు ఆ ప్రాంతంలో హల్‌చల్ చేశారు. మరో మూడు ఇండ్లలోకి ప్రవేశించిన దొంగలు కిటికీల మెష్‌లు పగులగొట్టి బీభత్సం సృష్టించారు. కరెంటు బంద్ చేయడంతో ఆ ప్రాంతంలో పూర్తిగా అంధకారం నెలకొంది. అయితే పట్వారీ ఇంట్లో ప్రవేశించినప్పుడు వెలుపల ఉన్న కెమెరాల్లో చోరులు రికార్డయ్యారు. కనిపించకుండా మాస్కులు వేసుకుని ఉన్నారు.



## అందానికి మొక్కజొన్న

మొక్కజొన్నను చాలామంది ఇష్టంగా తింటారు. దానితో వంటలూ చేస్తారు. అయితే మొక్కజొన్న అందాన్ని పెంచడంతో సహాయపడుతుందని తెలుసా..? ఆ వివరాలు తెలుసుకుందాం...
మొక్కజొన్నల్లో విటమిన్ ఎ, సి, డి ఉంటాయి. ఇవి చర్మం మీది నల్లటి మచ్చలను తగ్గిస్తాయి.
విటమిన్ ఇ చర్మం పొడిబారే సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
కాపర్, జింక్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ముడతలు, మచ్చలను మాయం చేస్తాయి.
విటమిన్ ఇ పొడిబారకుండా సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గిస్తాయి.
మొక్కజొన్నలోని కొన్ని రకాల అమైనో ఆమ్లాలు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మం కాంతివంతంగా మారేలా చేస్తాయి.
ఇలా వాడాలి:
మొక్కజొన్న పిండిలో కొంచెం తేనె, పాలు కలిపి పేస్టులా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. దీని వలన చర్మం మృదువుగా మారుతుంది.
మొక్కజొన్న పిండిలో పసుపు, పెరుగు వేసి కలిపి మెత్తని మిశ్రమంగా చేసుకుని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వలన చర్మం మీది మచ్చలు పోయి, ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.



# ఉపాధికి వారధిగా



**"తమ అవసరాలకు తగిన నైపుణ్యం ఉన్నవారు దొరకడం లేదనేది పరిశ్రమల నుంచి నిరంతరం ఎదురవుతున్న ఫిర్యాదు. డిమాండ్ ఉన్నా నిపుణులు దొరకని పనులు అనేకం ఉన్నాయి. టెకీలు, ఇంజనీర్లు, అకౌంటెంట్ల లాంటి వృత్తి నిపుణులనే కాదు..**

"తమ అవసరాలకు తగిన నైపుణ్యం ఉన్నవారు దొరకడం లేదనేది పరిశ్రమల నుంచి నిరంతరం ఎదురవుతున్న ఫిర్యాదు. డిమాండ్ ఉన్నా నిపుణులు దొరకని పనులు అనేకం ఉన్నాయి. టెకీలు, ఇంజనీర్లు, అకౌంటెంట్ల లాంటి వృత్తి నిపుణులనే కాదు... ఇంకా ఎన్నో బాధ్యతలను చక్కగా నెరవేర్చేవారి కోసం సంస్థలు వెతుకుతూ ఉంటాయి. అలాంటి వాటికి అవసరమైన నైపుణ్యాన్ని... అట్టడుగువర్గాల వారికి అందించాలన్న ఆలోచన పదిహేడేళ్ళ క్రితం కలిగింది. దీనికి నేపథ్యం ఏమిటంటే... నాకు పదేళ్ళ వయసున్నప్పుడే మా నాన్న చనిపోయారు. అయిదేళ్ళ తరువాత మా అమ్మ, సోదరుడు కూడా మరణించారు. నేను, నా సంరక్షణలో నా తమ్ముడు మిగిలేం. పదిహేనేళ్ళ వయసులో... నా జీవితానికి అర్థం ఏమిటనే ప్రశ్న తలెత్తింది. తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాను. కానీ కొద్ది రోజులలోనే దాని నుంచి బయటపడ్డాను. నాకన్నా దుర్భరమైన స్థితిలో బతుకున్నవారెందరో నా చుట్టూ కనిపించారు. ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకోసం, పిల్లలకోసం ఏదైనా చేయాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తట్టుకొని, కష్టపడి చదివాను. ఐఎంఎం-కోల్‌కతాలో సీటు సంపాదించాను. చదువు పూర్తయ్యాక... ఇంజనీరింగ్ లెక్చరర్‌గా చేరాను. ఆ వృత్తిలో నేను పరిశీలించిన ఎన్నో అంశాలు... నేను కొత్త దారిని ఎంచుకొనేలా చేశాయి. విద్యార్థులు డిగ్రీలు సంపాదిస్తున్నా... వారు చేయాల్సిన, చేయాలనుకొనే ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఇది ఏదో ఒక విద్యా సంస్థకే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. తరువాతి తరానికి మంచి ఉద్యోగావకాశాలు రావాలన్నా, తమతమ వృత్తుల్లో వారు రాణించాలన్నా... దానికి నైపుణ్యాలు తప్పనిసరి. వాటిని పెంపొందించడమే మనముందున్న అత్యవసర సమస్య అని అర్థమయింది. 2008లో ఉద్యోగం వదిలేసి... మా ఇంటి బేస్‌మెంట్‌లో... నలభై మంది విద్యార్థులతో ప్రాథమిక నైపుణ్య శిక్షణ సంస్థను ప్రారంభించాను.

ఆ డిమాండ్ తీర్చాలని...ఎవరికి శిక్షణ ఇవ్వాలో, వేటిలో ఇవ్వాలో ఒక ప్రణాళిక నేను ముందే తయారు చేసుకున్నాను. వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలు, వీధులు ఊడ్చేవారు, చిన్న చిన్న నేరాలు చేసి జైలుకు వెళ్ళి వచ్చాక ఉపాధి లేనివారు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, సెక్యూరిటీ సర్వీసెస్ తదితర వృత్తుల్లో ప్రాథమిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. వీటిలో చాలా సేవలు దాదాపు అన్ని సంస్థలకూ అవసరమే. కానీ ఇలాంటి శిక్షణ కల్పించడానికి ఏ సంస్థా చొరవ తీసుకోదు. కానీ ఈ సేవలకు భారీ డిమాండ్ ఉంది. ఆ డిమాండ్ తీర్చడం, తద్వారా పేదలకు ఆసరాగా నిలవడం నా ఆశయం. అలా ఇప్పటివరకూ లక్ష మందికి పైగా నా సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చాను. వారికి నైపుణ్య శిక్షణ కౌన్సిలింగ్, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సాయం చెయ్యడం... ఇలా వివిధ అంశాల్లో మా సంస్థ సాయపడుతోంది. కొన్ని వందలమంది మా సంస్థ తరఫున పని చేస్తున్నారు. ఇప్పుడు 'కెపాసిటా కనెక్ట్' పేరిట మా కార్యకలాపాలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడంతో పాటు... ఇతర అంశాల్లోకి కూడా విస్తరించాం. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్-కార్పొరేట్ సంస్థలకు కూడా సేవలు అందించడం ప్రారంభించాం. రాజస్థాన్ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ సాంకేతికతల్లో శిక్షణ ఇవ్వడం కోసం... కిందటి ఏడాది' రైజింగ్ రాజస్థాన్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'లో రూ. 45 కోట్ల ఒప్పందాన్ని 'కెపాసిటా కనెక్ట్' చేసుకుంది. ఇది మా సంస్థ పురోగతిలో ఒక మైలురాయి.


నైపుణ్యం పెంచడమే మార్గం...ప్రస్తుతం పేద వర్గాలవారికి శిక్షణతో పాటు ఉద్యోగులకు, విద్యార్థులకు, కార్పొరేట్ సంస్థలకు విద్యా సంస్థలకు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాం. కృత్రిమ మేధ, డేటా అనాసిలిస్, సైబర్ సెక్యూరిటీ లాంటి సరికొత్త సాంకేతికతలను కూడా బోధిస్తూ... యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. మా సంస్థకు 'సిఐఐ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్' లాంటి పలు పురస్కారాలు లభించాయి. ప్రతిష్టాత్మకమైన 'ఫోర్బ్స్ ఇండియా-గ్లోబల్ ఇండియన్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ ఎడిషన్'లో... టాటా, మహీంద్రా, బజాజ్, హెచ్‌సిఎల్, బిర్లా లాంటి సంస్థల సరసన చోటు దక్కింది. వ్యక్తిగతంగా 'రాజస్థాన్ ఇండస్ట్రీ ఐకాన్' అవార్డు అందుకున్నాను. 2019లో 'ఫోర్బ్స్ ఇండియా- లీడింగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాబితా'లో స్థానం లభించింది. ఇప్పుడు నా దృష్టంతా భారతీయ యువతను డిజిటల్ ఎకానమీ దిశగా సంసిద్ధం చేయడం మీద ఉంది. ఏ దేశ భవిష్యత్తునైనా నిర్దేశించేవి తరగతి గదులేనని నేను నమ్ముతాను. ఎక్కువ మార్కులు సంపాదించడం ఎలాగో మనం పిల్లలకు నేర్పుతున్నాం కానీ ఒక వైఫల్యాన్ని, విషాదాన్ని ఎదుర్కోవడం ఎలాగనేది చెప్పడం లేదు. ఈ ధోరణిలో మార్పు రావాలనేది నా కోరిక. అలాగే ఆర్థిక, సామాజిక స్థితులతో సంబంధం లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు లభించాలి. వారిలో నైపుణ్యం పెంచడమే అందుకు మార్గం. దానికోసమే ఇన్నేళ్ళుగా కృషి చేస్తున్నాను. భవిష్యత్తులో ఆ కృషిని మరింత దీక్షగా కొనసాగిస్తాను."నైపుణ్యం ఉన్నవారికోసం వెతుకులాటలో పరిశ్రమలు... వాటికి తగిన నైపుణ్యాన్ని అందుకోలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్న యువత.. ఈ అంతరాన్ని తగ్గించడానికి పదిహేడేళ్ళుగా కృషి చేస్తున్నారు శిప్రా శర్మ భుటాని. లక్షమందికి పైగా అట్టడుగువర్గాలవారికి శిక్షణ ఇచ్చి,ఉపాధికి దోహదం చేసిన ఈ జైపూర్ మహిళ... విద్యార్థులకు, పరిశ్రమలకు మధ్యవారధిగా నిలుస్తున్నారు.

## తలనొప్పి తగ్గేదెలా



ఒత్తిడి, ఆందోళన, అనవసరమైన ఆలోచనలు, వాతావరణ కాలుష్యం లాంటి కారణాల వల్ల తలనొప్పి రావడం సర్వ సాధారణం. తలనొప్పి అనిపించగానే మందుబిళ్ల మింగకుండా కొన్ని ఇంటి చిట్కాలతో ఉపశమనం పొందవచ్చని నిపుణులు సూచిస్తు న్నారు. ఒక్కోసారి తీవ్రమైన భావోద్వేగాలు తలనొప్పికి కారణమవుతుంటాయి. అలాంటప్పుడు ధారాళంగా గాలి వీచే ప్రదేశంలో కూర్చుని కళ్లు మూసుకుని శ్వాస మీద ధ్యాస నిలపాలి. ఇలా పావుగంటసేపు చేస్తే ప్రయోజనం కనిపిస్తుంది.కొంతమంది పని ధ్యాసలో పడి మంచి నీళ్లు తాగడం మార్చిపోతుంటారు. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గి నిర్జలీకరణ తలెత్తుతుంది. ఫలితంగా కళ్లు తిరగడం, తలనొప్పి ప్రారంభమవుతాయి. వెంటనే ఒక గ్లాసు చల్లటి మంచినీరు తాగితే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. దాహం అనిపించ పోయినా గంటకు ఒకసారి నీరు తాగడం మంచిది.పలుచని చేతి రుమాలులో కొన్ని ఐస్ ముక్కలు చుట్టి తల మీద, నుదుటి మీద పెట్టుకుంటే తలనొప్పి చాలావరకు తగ్గుతుంది. వేసవికాలంలో ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. అదే చలికాలమైతే గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే ఫలితం కనిపి స్తుంది. మాడు మీద, కణతల మీద చేతి వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ మెల్లగా మర్దన చేస్తే తలనొప్పి తగ్గిపోతుంది. మంచి నిద్ర కూడా వస్తుంది!చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని కొద్దికొద్దిగా నములుతూ రసం మింగుతుంటే క్రమంగా తలనొప్పి మాయమవుతుంది.

# నామెదడులో చిప్ పెట్టారు



"నా మెదడులో ఏదో ఉంది. అమెరికాలోని ఫెడరల్ పోలీసులు నా మెదడును ట్యాప్ చేస్తున్నారు. వెంటనే నన్ను రక్షించండి. ప్లీజ్. నాకు పిచ్చెక్కిపోతోంది." - బెంగళూరులో ఓ మహిళా టెకీ ఫిర్యాదు. 'పంజాబ్‌లో 'సూపర్‌కాప్'గా పేరు పొందిన కేపీఎస్ గిల్ నామెదడులో చిప్ పెట్టారు. ఆయన నా ఆలోచనలను నియంత్రిస్తున్నారు. ఇది దారుణం." - ఓ యువకుడి ఆరోపణ "పోలీసులు నా ఆలోచనలను కనిపెట్టేస్తున్నారు. నా భర్త సాయంతో వారు నా మెదడును నియంత్రిస్తున్నారు". - తమిళనాడులో గృహిణి వేదన.. చాలా విచిత్రంగా అనిపిస్తున్నా.. ఈ ఫిర్యాదులు..ఈ వేదనలు నిజమే. దేశంలో చాలా మంది ఏదేదో ఊహించుకుంటూ.. చిత్ర విచిత్రంగా భ్రమపడుతూ.. పోలీసులు, మానవ హక్కుల సంఘాలకు రకరకాల ఫిర్యాదులు చేస్తున్నారు. ఎందుకిలా అని నిపుణులు ఆరా తీస్తే.. వీరు 'పారనోయా' అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇటీవల కొంతకాలంగా ఉద్యోగులు.. యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. ఒకే విషయాన్ని పదే పదే ఆలోంచి.. ఆందోళన పెంచుకోవడం వల్ల ఈ సమస్య వస్తుందని వారు వివరించారు. పారనోయా మాత్రమే కాదు.. కుంగుబాటు, ఒత్తిడి, ఆందోళన ఇలా రకరకాల మానసిక సమస్యలతో దేశంలో దాదాపు 20 కోట్ల మంది బాధపడుతున్నట్లు అంచనా. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన బెంగళూరులోని జాతీయ మానసిక ఆరోగ్యం, నాడీ శాస్త్ర సంస్థ (నిమ్‌హాన్స్) కమిటీ స్పష్టం చేసింది .ఇది దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన మరీ ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని గుర్తించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈ సమస్యలపై అధ్యయనానికి 2014లో నిమ్‌హాన్స్‌ను నియమించింది. అప్పటి నుంచి ఈ సంస్థ ఏటా దేశంలో మానసిక సమస్యలపై అధ్యయనం చేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 10.1 శాతం నుంచి 14.1 శాతం మంది ప్రజలు తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నటు అంచనా.

10 శాతం మందిలో కుంగుబాటు, ఆందోళన, వ్యసనాలు అధికం.ప్రతి 20 మందిలో ఒకరు కుంగుబాటుతో బాధపడుతున్నారు. మహిళల్లో ఇది ఇంకా ఎక్కువ.

18 ఏళ్లకుపైబడిన వారిలో 22.4 శాతం వ్యసనపరులే. వ్యసనాల్లో మద్యపానం, పొగాకు నమలడం, ధూమపానమే అధికం..పురుషుల్లోనే అధికం!!

కుంగుబాటు, మూడ్ డిజార్డర్లు తప్ప మిగతా మానసిక సమస్యలు పురుషులకే ఎక్కువ. మొత్తానికి 13.9 శాతం మంది పురుషులు మానసిక రోగులు. మహిళల్లో ఈ రేటు 7.5 శాతం.13 నుంచి 17 ఏళ్ల మధ్య వారిలో 7.3 మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నవారే.

చికిత్సకు దూరం!! తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిలో కేవలం 25 శాతం మంది మాత్రమే చికిత్స తీసుకుంటున్నారు.మిగతవారు అస్సలు తమకు మానసిక సమస్య ఉన్నట్లే వైద్యులకు చెప్పడం లేదు. ఇతరులు ఏమనుకుంటారో నని వీరు చికిత్సకు వెనుకాడుతున్నారు. ఏడాది పాటు కుంగుబాటు, ఒత్తిడి, ఇతర సమస్యలతో బాధపడుతున్నా వైద్యుల ముందుకు వెళ్లడం లేదు.వీరికి చికిత్స అందించాలంటే ఒక్కొక్కరికి నెలా రూ.1000 నుంచి 1500 వరకు ఖర్చువుతుంది.

ఇదీ కారణమే!!మానసిక సమస్యలను తక్కువ తీవ్రంగా పరిగణించడం.. దీనికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రజలు చికిత్సకు ముందుకు రావడం లేదని నిపుణులు అంటున్నారు. చాలా మంది వైద్యులు సైతం మానసిక సమస్యలను తీవ్రంగా గుర్తించడం లేదని వారు పేర్కొంటున్నారు.

కారణాలు :మారిన జీవనశైలి
అనవసరంగా ఒత్తిడికి గురికావడం
జీవన విధానంలో నాణ్యత లేమి
చిన్న కుటుంబాలు
ఆర్థిక అస్థిరత
అతిగా ఫోన్లు..నెట్ వినియోగం
నిద్రలేమి, వ్యసనాలు

పట్టణాలు, నగరాల్లో అధికం!
గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే.. పట్టణాలు, నగరాల్లోనే ఎక్కువ మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారు.

దేశంలో మానసిక సమస్యలున్నవారు 13.7 శాతం
వెంటనే చికిత్స అవసరమైన వారి శాతం 10.6
అతి తీవ్రమైన మానసిక రోగులు 2 శాతం
ప్రధాన సమస్యలు

# మహిళా ఖైదీలకు అండ హక్కుల సాధనే అజెండా




"పౌరుల్లో ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయి. ఖైదీలు దీనికి మినహాయింపు కాదు. కానీ వారి సమస్యలను ఎవరూ పట్టించుకోరు. వారి తరఫున మాట్లాడడానికి ఎవరూ ముందుకు రారు. ఈ పరిస్థితి మారాలి" అంటున్నారు అపూర్వ వివేక్. రాంచీకి చెందిన ఈ న్యాయవాది... మహిళా ఖైదీలను విద్యావంతులను చేయడానికి, న్యాయపరమైన సాయం అందించడానికి పాటుపడుతున్నారు. వారి హక్కుల పరిరక్షణ కోసం తన గళాన్ని గట్టిగా వినిపిస్తున్నారు.

"తెలిసినవారు ఎవరైనా ఎదురుపడినప్పుడు... ఎక్కడికి వెళ్తున్నారని అడిగేవారు. "జైలుకు" అని చెబితే ఆశ్చర్యంగా చూసేవారు. ఇప్పుడు అందరికీ నేనేమిటో, నేను చేస్తున్న పని ఏమిటో తెలుసు. రోజూ ఎక్కువ సమయం నేను గడిపేది జైల్లోనే మరి" అని నవ్వుతూ చెబుతారు అపూర్వ వివేక్. మహిళా ఖైదీల సంక్షేమం కోసం 'హోషియా సోషియో-లీగల్ సెంటర్ ఫర్ విమెన్" (హెచ్‌ఎసఎససిడబ్ల్యూ) అనే సంస్థను ఆమె స్థాపించారు.

**పాఠాలతో మొదలుపెట్టి...**

2013లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అపూర్వ... ఖాళీ సమయాల్లో పిల్లలకు పాఠాలు చెప్పేవారు. అప్పుడే ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేయడం ప్రారంభించారు. జైలులో మహిళా ఖైదీల గురించి అధ్యయనం చేయడానికి ఇతర వాలంటీర్లతో కలిసి రాంచీలోని బిర్సాముండా సెంట్రల్ జైలుకు వెళ్ళారు. అక్కడ ఖైదీల జీవన పరిస్థితులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా మహిళా ఖైదీల దుస్థితి ఆమెను తీవ్రంగా ఆలోచింపజేసింది. "చాలామందికి చదువు లేకపోవడం వల్ల వారికి తమ హక్కులేమిటో తెలియదు. న్యాయవాదులు తెచ్చిన కాగితాల మీద గుడ్డిగా సంతకాలు పెట్టడం తప్పితే... వాటిలో ఏం రాసి ఉందో, అది తమకు ఉపయోగమో కాదో అవగాహన లేదు. అందుకే వారికి ప్రాథమిక విద్య నేర్పాలని నిర్ణయించుకున్నాను" అని గుర్తు చేసుకున్నారు అపూర్వ. మహిళా ఖైదీలతో పాటు వారి పిల్లలకు కూడా పాఠాలు చెప్పడానికి జైలు అధికారుల అనుమతి తీసుకున్నారు. "మొదట్లో నన్ను అందరూ అనుమానంగా చూసేవారు. వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి అధికారుల తరఫున వచ్చానని భావించేవారు. క్రమంగా నా ఉద్దేశమేమిటో అర్థం చేసుకున్నారు. కనీసమైన చదువు లేనివారికి అక్షరాలు దిద్దించడం, కూడబలుక్కొని చదవగలిగేవారితో వార్తా పత్రికలు చదివించడంతో జైలులో నా తరగతులు ప్రారంభమయ్యాయి. క్రమంగా వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కూడా తెలిశాయి" అని వివరించారు అపూర్వ.

**పలు కారాగారాల్లో...**

జైలులో గడుపుతున్నవారిలో ఎక్కువమంది విచారణ ఖైదీలు. న్యాయవాదులను నియమించుకొనే స్థోమత లేనివారు. కొందరి తరఫున ప్రభుత్వమే న్యాయవాదులను ఏర్పాటు చేసినా... కేసులు ఏళ్ళ తరబడి సాగుతూనే ఉంటాయి. మహిళా ఖైదీల్లో గర్భిణులు కూడా ఉంటారు. వారికి సరైన వైద్య సహాయం కానీ, పోషకాహారం కానీ ఉండదు. వారికి జన్మించిన పిల్లలకు సరైన సంరక్షణ అందదు. ఈ సమస్యలకు తన వంతుగా ఏదైనా పరిష్కారం చూపాలని ఆపూర్వ అనుకున్నారు. 'లా' చదివి, న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 2022లో 'హెచ్‌ఎసఎససిడబ్ల్యూ' సంస్థను ఏర్పాటు చేసి... మహిళా ఖైదీల సంక్షేమం కోసం కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. అప్పటివరకూ నేను ఒంటరిగా చేస్తున్న కార్యక్రమాలను వ్యవస్థాగతం చేశాను. స్వచ్ఛంద సేవకులు, ఔత్సాహికుల భాగస్వామ్యంతో రాంచీ సెంట్రల్ జైల్‌లోని మహిళా ఖైదీలకు విద్యతో పాటు నైపుణ్య శిక్షణను మా సంస్థ తరఫున చేపట్టాం. ఆ తరువాత జైళ్ళ శాఖ అధికారుల ప్రోత్సాహంతో జార్ఖండ్ రాష్ట్రంలోని పలు కారాగారాలకు వాటిని విస్తరించాం. వైద్య శిబిరాల ఏర్పాటు, కుంగుబాటు, మానసికమైన ఒత్తిడిని నివారించడం కోసం కౌన్సెలింగ్, మహిళా ఖైదీల కేసుల్లో న్యాయపరమైన సహాయం, జైలు నుంచి విడుదలైనవారికి పునరావాసం, ఉపాధి కల్పన, వారి పిల్లలకు విద్య, వైద్య సౌకర్యాలు, ఆశ్రయం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. దీనికోసం వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం" అని చెప్పారు అపూర్వ.

**చారిటీగా భావించడం లేదు...**

ఒకసారి ఒక మహిళా ఖైదీ సమస్య అపూర్వ దృష్టికి వచ్చింది. ఆ ఖైదీ అరెస్ట్ అయినప్పుడు గర్భవతి. ఆమె అబార్షన్ చేయించుకోవాలని అనుకుంది. కానీ దానికి న్యాయపరమైన అనుమతి వచ్చేసరికి ఆరు వారాలకు పైగా సమయం పట్టింది. అప్పటికే సమయం మించిపోయిందని, అబార్షన్ చేయడం కుదరదని వైద్యులు చెప్పారు. ఆమె తీవ్రమైన ఆవేదనకు గురయింది. ఈ సంఘటన నేపథ్యంలో... మహిళా ఖైదీల పునరుత్పత్తి హక్కులపై అపూర్వ చేసిన పోరాటం 'జార్ఖండ్ ప్రిజన్ మాన్యువల్'లో మార్పులకు దారి తీసింది. "ఇలాంటి సంఘటనలు భావోద్వేగపరమైన ఒత్తిడిని ఖైదీలకు తీసుకువస్తాయి. తమ బాధను ఎవరికైనా వినిపించాలనుకుంటారు. ఆ బాధ్యతను మేము తీసుకుంటున్నాం. వారికోసం మేము చేస్తున్న ఏ పనినీ చారిటీగా భావించడం లేదు. ఆ మహిళలకు హక్కులు ఉన్నాయి. ఆ హక్కులపై వారికి అవగాహన కల్పించి, వాటిని వినియోగించుకొనేలా చూస్తున్నాం. ఇప్పటివరకూ వేలమంది మహిళా ఖైదీలకు మా సంస్థ ద్వారా సాయపడ్డాం. భవిష్యత్తులో అన్ని జైళ్ళలో మహిళా ఖైదీల ఇబ్బందులను పరిష్కరించాలనేది మా లక్ష్యం" అని అంటున్నారు అపూర్వ.


# తల్లులకు.. హగ్ ఇవ్వొద్దు



వారం రోజులు ఊరెళితే అమ్మను చూడకుండా ఉండలేం. మాట్లాడకుండా అస్సలు ఉండలేం. ఇంటికి వచ్చిన వెంటనే ఆమెను హత్తుకుంటాం. ఆనందంతో తల్లీబిడ్డలిద్దరూ మురిసిపోతారు. ఇక, మదర్స్‌డే వచ్చిందంటే.. పాశ్చాత్య దేశాల్లో హగ్‌లు ఇచ్చుకోవడం సహజం. కరోనా వల్ల సామాజిక దూరం పాటించక తప్పడం లేదు. 'మదర్స్‌డే శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే పిల్లలు.. తల్లికి హగ్ ఇవ్వకూడదు. అలాచేస్తే ఆమె ప్రాణాలకే ముప్పు తెచ్చినవాళ్లు అవుతారు' అంటూ ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మదర్స్‌డే వేడుకను కూడా పదిమందికి మించి చేసుకోవద్దంటూ హెచ్చరించింది.

తల్లులకు ఎలాంటి కానుకలు ఇవ్వకూడదు. పూలబొకేలు కూడా దూరం నుంచే అందివ్వాలి. ఇంట్లో అందరూ ఒకటిన్నర మీటరు దూరం నుంచే అమ్మకు శుభాకాంక్షలు చెప్పాలి. ఎందుకంటే వయసు మీదపడిన మాతృమూర్తులకు కరోనా సులభంగా సోకే ప్రమాదం ఉంది.. పిల్లలూ జాగ్రత్త అంటూ ఆ ప్రభుత్వం సూచించింది. మదర్స్‌డే రోజున అమ్మను హగ్ చేసుకోవద్దంటూ ఒక దేశ ప్రభుత్వం.. ఇలా అధికారికంగా ఆదేశాలు జారీచేయడం బహుశా ఇదే తొలిసారి అనుకుంటా.


## ముఖం మెరిపిద్దామిలా



అందం కనిపించాలని అందరూ కోరుకుంటారు. అయితే రసాయనాలు ఉండే సౌందర్యసాధనాలు వాడకుండా, ఇంట్లో ఉండే వాటితోనే సహజంగా ఫేస్ ప్యాక్ తయారు చేసుకుని ముఖం అందంగా మార్చుకోవచ్చు.

ఒక గిన్నెలో నాలుగు చెంచాల శనగపిండి, కొంచెం పసుపు, రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ అంతా ప్యాక్‌లా వేయాలి. అరగంట తరువాత నీళ్లతో కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మం తేమను కోల్పోకుండా చేస్తుంది.పావు కప్పు బొప్పాయి గుజ్జులో ఒక చెంచా తేనే వేసి కలిపి ముఖంపై రాయాలి. 20 నిమిషాల తరువాత నీటితో కడగాలి. దీని వల్ల ముఖంపై మొటిమలు తగ్గుతాయి.అరకప్పు దోస ముక్కలను పేస్టులా చేసి అందులో చెంచా పెరుగు కలిపి ముఖం, మెడకు పట్టించి ఆరిపోయాక కడిగేసుకోవాలి. ఈ ప్యాక్‌తో చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది.ఒక పండిన అరటిపండును గుజ్జుల చేసి, అందులో ఒక చెంచా పాలు, చెంచా తేనె వేసి కలపాలి. దీనిని ముఖంపై రాస్తూ సున్నితంగా మర్దన చేయాలి. ఇరవై నిమిషాల తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి. దీని వల్ల చర్మంపై మురికి పోయి మెరుస్తుంది.రెండు టేబుల్ స్పూన్ల బార్లీ గింజల పొడిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో కొంచెం వేడి నీళ్లు పోసి ముద్దలా చేయాలి. దీనిని ముఖంపై రాసి పావు గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ వల్ల చర్మంపై మృతకణాలు తొలగి ముఖం అందంగా మారుతుంది.

## వానల్లో మొక్కల సంరక్షణ



మనం సాధారణంగా బాల్కనీలో, ఇంటి పరిసరాల్లో మొక్కల కుండీలను ఏర్పాటు చేసుకుంటూ ఉంటాం. వర్షాకాలంలో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. కానీ ఒక్కోసారి ఆకులు పసుపు రంగులోకి మారడం, కాండానికి ఫంగస్ రావడం, వేళ్లు కుళ్లిపోయి మొక్కలు వడలిపోవడం లాంటివి గమనిస్తూ ఉంటాం. అలాకాకుండా మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

నీళ్లు ఎక్కువగా అవసరంలేని మొక్కల కుండీలకు వర్షం తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి మీద గ్రీన్ నెట్ అమర్చడం మంచిది.

వర్షాకాలంలో కుండీలను ముప్పావు వంతుకు పైగా మట్టితో నింపాలి. దీనివల్ల వర్షపు నీరు ఎక్కువగా కుండీల్లో నిలవకుండా ఉంటుంది.

కుండీల్లో మట్టి మరీ మెత్తగా ఉంటే అది ఎక్కువగా నీటిని పీల్చుకుంటుంది. దీనివల్ల వర్షాకాలంలో మొక్కలు త్వరగా పాడవుతాయి. అలాంటప్పుడు ఈ మెత్తని మట్టిలో కొద్దిగా ఇసుకను కలిపితే అదనపు నీరు త్వరగా బయటికి వెళుతుంది.

కుండీ అడుగు భాగంలో ఉండే రంధ్రాలను గమనించాలి. కుండీలో చేరిన అదనపు నీరు బయటికి వస్తుందో లేదో పరిశీలించాలి. రంధ్రాల వద్ద వేళ్లు లేదా మట్టి చేరి నీళ్లు బయటికి పోకుండా అడ్డుపడుతుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు సరిచేస్తూ ఉండాలి.

వర్షాకాలంలో కుండీల కింద పళ్లాలు ఉంచకూడదు. అలా ఉంచితే మొక్కల వేళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. చిన్న కాళ్లు ఉన్న కుండీలను ఎంచుకోవడం మంచిది. అలా లేని పక్షంలో కుండీ కింద నాలుగు వైపులా చదునుగా ఉన్న రాళ్లు అమర్చాలి. అప్పుడు కుండీలో చేరే వర్షపు నీరు సులువుగా బయటికి వెళుతుంది.వర్షాకాలంలో గాలులు బలంగా వీస్తుంటాయి. వీటి ధాటికి కుండీల్లోని మొక్కలు వంగిపోవచ్చు. ఒక్కోసారి వేళ్లతో సహా ఒరిగిపోవచ్చు. అలాకాకుండా మొక్కలన్నింటికీ ఆధారంగా కర్రలను కుండీల్లో నిలబెట్టాలి.కాండానికి కింది భాగంలో ఉన్న ఆకులకు తేమ ఎక్కువగా తగులుతూ ఉంటుంది. దీనివల్ల మొక్కకు ఫంగస్ చేరవచ్చు. కాబట్టి కుండీలో మట్టికి దగ్గరగా ఉండే ఆకులను కత్తిరించడం మంచిది.





## వచ్చే వారం మార్కెట్ ఫుల్ బిజీ.. 9 ఐపీఓలు, 7 లిస్టింగ్‌లతో..

**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ ఐపీఓల వీక్ రానే వచ్చేసింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమయ్యే వారంలో స్టాక్ మార్కెట్ ఫుల్ బిజీగా మారనుంది. ఎందుకంటే ఈ వారంలో మొత్తం 9లు సబ్‌స్క్రిప్షన్ కోసం రానున్నాయి . అందులో 3 మెయిన్‌బోర్డ్ లు, 6లు ఉన్నాయి. పెట్టుబడిదారులకు ఇది మంచి ఛాన్స్ అని చెప్పవచ్చు. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం.

మంగళసూత్ర తయారీ సంస్థ
తెరవబడే తేదీ: సెప్టెంబర్ 10
ముగిసే తేదీ: సెప్టెంబర్ 12
ధర: రూ. 155 – రూ. 165
లాట్ సైజు: 90 షేర్లు
మొత్తం షేర్లు: 2,43,00,000 (తాజా షేర్లు)
కనీస పెట్టుబడి: రూ. 14,850

2. అర్బన్ కంపెనీ
గృహ, సౌందర్య సేవల సంస్థ
సేకరణ: రూ. 1,900 కోట్లు (రూ. 472 కోట్ల తాజా షేర్లు, రూ. 1,428 కోట్ల పాత షేర్లు)
కనీస పెట్టుబడి: రూ. 14,935




3. దెవ్ యాక్సిలరేటర్
కార్యాలయ స్థలాల నిర్వహణ సంస్థ
సేకరణ: రూ. 143.35 కోట్లు (తాజా షేర్లు)
కనీస పెట్టుబడి: రూ. 14,335



## బెస్ట్ స్కీమ్.. నెలకు రూ. 10 వేలతో కోటీశ్వరులయ్యారు.. 20 ఏళ్లలో చేతికి డబ్బులు

**న్యూఢిల్లీ-నవభూమి:** చాలా మంది దీర్ఘకాలంలో మెరుగైన భారీ రాబడి రావాలనుకుంటే మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటుంటారు. ఇక్కడ కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ కారణంగా లాంగ్ రన్‌లో మంచి లాభాలు వస్తాయని చెబుతుంటారు నిపుణులు. కాంపౌండింగ్ అంటే చక్రవడ్డీ. అంటే ఏటా వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. ఇలా కాలం గడుస్తున్న కొద్దీ మీ సంపద గణనీయంగా వృద్ధి చెందుతుంది. ఈ కాంపౌండింగే మ్యూచువల్ ఫండ్లలో ఉన్న అతిపెద్ద ప్రయోజనం అని చెబుతుంటారు. ఇక కాంపౌండింగ్‌ను ప్రపంచంలోనే 8వ వింత అని అభివర్ణించారు ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. ఇక వారెన్ బఫెట్ వంటి దిగ్గజ పెట్టుబడిదారులు కూడా ఇదే కారణంతో.. మ్యూచువల్ ఫండ్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటారు.ఏదో ఏడాది, రెండేళ్ల వరకు అంటే మ్యూచువల్ ఫండ్లు అంత మంచి పెట్టుబడి ఆప్షన్స్ కావని.. 5,10, 15 ఏళ్లు ఇలా సుదీర్ఘకాలంలోనే మంచి రాబడి ఇస్తుందని చెబుతుంటారు. ఇక గత చరిత్ర కూడా ఇదే చెబుతోంది. చాలా వరకు లాంగ్ రన్‌లో ద్రవ్యోల్బణాన్ని మించే రాబడి అందించాయని చెప్పొచ్చు. దీర్ఘకాలం పెట్టుబడులతో రిస్క్ కూడా తగ్గించుకోవచ్చు.ఇప్పుడు మనం గత 20 ఏళ్ల వ్యవధిలో అద్భుత స్థాయిలో రిటర్న్స్ అందించిన ఒక మ్యూచువల్ ఫండ్ గురించి చూద్దాం. అదే బంధన్ మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నుంచి అందుబాటులో ఉన్న బంధన్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్. ఇది గత ఆగస్ట్ 9తో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో 20 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇక ఈ క్రమంలోనే స్కీమ్ లాంఛ్ అయినప్పటి నుంచి నెలకు రూ. 10 వేలు సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన వారికి ఊహించని రీతిలో రూ. 1.16 కోట్లు వచ్చాయి. అంటే రూ. 10 వేల సిప్ నుంచి కోటీశ్వరులు అయ్యారు.౧౧ ఇది ఒక ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీ కిందికి వస్తుంది. వాల్యూ రీసెర్చ్ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్ అందుకుంది. ఇంకా మార్నింగ్ స్టార్ 4 స్టార్ రేటింగ్ ఇచ్చింది. ఇక ఈ ఫండ్.. ఎన్నేళ్ల వ్యవధికి ఎంత రాబడి ఇచ్చిందనేది చూద్దాం. పదేళ్ల కిందట నెలకు రూ. 10 వేల చొప్పున పెట్టుబడి పెట్టిన వారికి రూ. 30.39 లక్షలు వచ్చాయి. ఇక్కడ వార్షిక ప్రాతిపదికన సగటున 17.70 శాతం రాబడి వచ్చింది. ఇదే ఐదేళ్లలో చూసుకుంటే రూ. 10.12 లక్షలు అందించింది. మూడేళ్ల వ్యవధిలో సగటున 20.24 శాతం రిటర్న్స్‌తో రూ. 4.83 లక్షలు అయింది.పైన చెప్పుకున్నది సిప్ అయితే.. ఇప్పుడు లంప్‌సమ్ పెట్టుబడి రిటర్న్స్ చూద్దాం. ఈ స్కీమ్ ప్రారంభమైనప్పుడు ఇందులో ఒకేసారి రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు రూ. 13.10 లక్షలు వచ్చాయి. పదేళ్లలో రూ. 4.34 లక్షలు వచ్చాయి. ఐదేళ్లలో రూ. 2.94 లక్షలు వచ్చాయని చెప్పొచ్చు. మూడేళ్ల వ్యవధిలో చూస్తే రూ. 1 లక్ష పెట్టుబడి కాస్తా రూ. 1.84 లక్షలు అయ్యాయి.

## దేశంలో యాపిల్ ఐఫోన్ థర్డ్ స్టోర్..ఈసారి సౌత్‌లో

**న్యూఢిల్లీ-నవభూమి:** టెక్ లవర్స్‌కి, యాపిల్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్. యాపిల్ ఇప్పుడు సౌత్ ఇండియాలో తన మొదటి స్టోర్‌ని ఓపెన్ చేయనుంది. బెంగళూరులోని ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఏసియాలో యాపిల్ హెబ్బల్ స్టోర్ సెప్టెంబర్ 2, 2025న మధ్యాహ్నం 1 గంటలకు ఓపెన్ చేయనుంది. ఇది భారతదేశంలో యాపిల్‌కి మూడో ఆఫీషియల్ స్టోర్. ముంబైలోని యాపిల్ ఢిల్లీలోని యాపిల్ సాకేత్ తర్వాత ఇప్పుడు సౌత్ ఇండియాలోని బెంగళూరుకు వచ్చింది. త్వరలో పూణేలో యాపిల్ కోరెగావ్ పార్క్ ప్రాంతంలో నాలుగో స్టోర్ ఓపెన్ కానుంది.యాపిల్ హెబ్బల్ స్టోర్ బెంగళూరులోని ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఏసియాలో ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంది. మీరు మాల్ లోపలికి వెళ్లిన తర్వాత కుడి వైపు ఎస్కలేటర్ కనిపిస్తుంది. దాన్ని ఎక్కి ఫస్ట్ ఫ్లోర్‌కి వెళితే మీకు యాపిల్ హెబ్బల్ స్టోర్ కనిపిస్తుంది. ఈ స్టోర్ కేవలం షాపింగ్ స్పాట్ మాత్రమే కాదు. ఇదొక కమ్యూనిటీ హబ్. బెంగళూరు ఇన్నోవేషన్ స్పిరిట్‌ని సెలబ్రేట్ చేసే వేదికగా యాపిల్ దీన్ని రూపొందించింది.70 మంది టీమ్ మెంబర్స్: ఈ స్టోర్‌లో 15 రాష్ట్రాల నుంచి వచ్చిన 70 మంది టీమ్ మెంబర్స్ మీకు బెస్ట్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. మీరు ఏ ప్రొడక్ట్ గురించి అడిగినా, సరైన సలహాలు, సపోర్ట్ అందిస్తారు.100% రిన్యూవబుల్ ఎనర్జీ: యాపిల్ హెబ్బల్ స్టోర్ పూర్తిగా రిన్యూవబుల్ ఎనర్జీతో నడుస్తుంది. ఇది ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ స్టోర్ బిజినెస్ సపోర్ట్: స్మాల్ బిజినెస్ ఓనర్స్ కోసం బిజినెస్ ప్రోస్ టీమ్ రెడీగా ఉంది. డివైస్ సపోర్ట్, టూల్స్, గైడెన్స్‌తో మీ బిజినెస్‌ని బూస్ట్ చేసుకోవచ్చు.ప్రొడక్ట్స్ రేంజ్: ఐఫోన్ 16 సిరీస్, ఐఫోన్ 15, యాపిల్ వాచ్, ఎయిర్ పాడ్స్, మ్యాక్‌లు, ఐప్యాడ్‌లు, యాపిల్ పెన్సిల్, హోమ్‌పాడ్ లాంటి యాపిల్ డివైస్‌లు, యాక్సెసరీస్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబర్ 9న జరిగే ఈవెంట్‌లో లాంచ్ అయ్యే ఐఫోన్ 17 సిరీస్‌ని కూడా ఇక్కడ పొందవచ్చు.యాపిల్ జీనియస్ బార్: ఏదైనా యాపిల్ ప్రొడక్ట్ గురించి డౌట్స్ ఉంటే, జీనియస్ బార్‌లో ఎక్స్‌పర్ట్స్ మీకు సహాయం చేస్తారు.ఆన్‌లైన్ ఆర్డర్ పికప్: యాపిల్ ఇండియా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ చేసి, స్టోర్‌లోని డెడికేటెడ్ పికప్ ఏరియాలో మీ ఆర్డర్‌ని కలెక్ట్ చేసుకోవచ్చు.

## ఎమ్ఐటీ సంచలన నివేదిక.. ఏఐతో నష్టపోతున్న వ్యాపారాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పది మంది చేసే పని ఏఐ ఒక్కటే చేసేస్తోంది. దీంతో కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి, ఆదాయం పెంచుకోవడానికి ఏఐని వాడుకుంటున్నాయి. కంపెనీల ఏఐ వాడకంపై అమెరికాకు చెందిన మాసాచుషెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంచలన నివేదికను ప్రచురించింది. ఏఐ వాడుకుని తయారు చేసిన ప్రాజెక్టులు చాలా వరకు ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయని ఆ నివేదికలో వెల్లడైంది. ఏఐ సిస్టమ్స్ వాడిన 95 శాతం సంస్థలు భారీగా నష్టపోయాయని తెలిపింది.ఒక్కపైసా కూడా ఆదాయం పొందలేకపోయాయని పేర్కొంది. పరిశోధకులు మొత్తం 300 సంస్థలపై పరిశోధనలు చేశారు. 350 మంది ఉద్యోగులతో మాట్లాడారు. పెద్ద సంఖ్యలో సంస్థలు చాట్ జీపీటీ, కోపైలట్ వాడుతున్నట్లు తేలింది. కేవలం 5 శాతం ఏఐ పైలట్లు మాత్రమే పెట్టిన పెట్టుబడిపై ఆదాయాన్ని సృష్టిస్తున్నాయని వెల్లడైంది. మిగిలిన 95 శాతం ఏఐ పైలట్ల ద్వారా ఒక్క పైసా కూడా ఆదాయం లేదని స్పష్టం అయింది. 80 శాతం సంస్థలు 40 శాతం మంది ఉద్యోగుల్ని తొలగించి వారి స్థానంలో ఏఐని వాడటం మొదలెట్టాయి.ఏఐల ద్వారా వ్యక్తిగత ఉత్పాదక పెరిగింది. కానీ, ఆదాయం మాత్రం పెరగలేదు. ప్రాఫిట్ అండ్ లాస్ విషయంలో ఏఐ తన సత్తా చాటలేకపోయింది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. సదరు సంస్థలు ఆదాయం గడించలేకపోవడానికి కారణం ఏఐలు సరిగా పనిచేయకపోవటం కాదు. కంపెనీ వర్కింగ్ స్టైల్‌ను ఏఐలు ఒంటబట్టించుకోలేకపోయాయి. లెర్నింగ్ గ్యాప్ వల్ల ఏఐ వెనుకబడుపోతోంది.

# పండగ షాపింగ్‌కు రెడీ అవుతున్నారా?



**ముంబై-నవభూమి:** మన దేశంలో పండగల సీజన్ మొదలైపోయింది. మరో 15 రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత దీపావళి మొదలు కొని సంక్రాంతి వరకు ఏదో ఒక పండగ వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా దసరా, దీపావళి పెద్ద పండగలు. యావత్ భారతావని ఈ రెండు పండగలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. పండగ అంటే కొత్త బట్టలు ఉండాల్సిందే. ఇక పూజా సామగ్రి, గృహోపకరణాలు, బంగారం, వెండి ఆభరణాలు కొంటుంటారు. మరి ఈ లాంగ్ పండగ సీజన్‌లో షాపింగ్ చేసేందుకు మీరు సిద్ధమవుతున్నారా? అయితే, మీ కోసం కొన్ని జాగ్రత్తలు ఈ కథనం ద్వారా తెలియజేస్తున్నాం కచ్చితంగా తెలుసుకోండి.పండగలు, ప్రత్యేక సందర్భాలు ఎప్పుడు వస్తున్నాయి, ఎప్పుడు ఏది కొనాలి, ఎక్కడ ఎలా కొనాలి, ఎంత బడ్జెట్లో కొనుగోలు చేయాలి? అనే వివరాలతో ఒక లిస్ట్ రాసి పెట్టుకోవాలి.

దుస్తుల బడ్జెట్‌తో పాటు పండగకు అయ్యే ఖర్చును ఆ లిస్టులో చేర్చాలి. అందులోనే మీ రాబడి ఎంత, ఖర్చు ఎంత అవుతుందని రాసుకోవాలి. రెండింటి లెక్క చూసుకుని ఖర్చు చేయాలి.

కొనుగోలు చేయాలనుకుంటున్న వాటిలో అతి ముఖ్యమైనవి ఏవి, ముఖ్యమైనవి ఏవి, అంతగా ప్రాధాన్యం లేనివి అవి లేకున్నా పని జరుగుతుందనే వాటిని విభజించుకుని ఓ లిస్ట్ తయారు చేసుకోవాలి. దీంతో వృథా ఖర్చు తగ్గించుకోవచ్చు.

కొనుగోలు చేసే ముందు ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఉన్న ధరలను చెక్ చేయాలి. ఆ తర్వాత దుకాణాల్లో ధరలను పోల్చి చూసుకోవాలి. ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ తీసుకుంటే సరిపోతుంది. అయితే, నాణ్యత విషయంలో రాజీ పడకూడదు.


ఇంట్లో తరుచుగా ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేయాలనుకుంటే మాత్రం ఒక్కోటి కాకుండా బల్క్‌లో తీసుకోవడం మంచిది. ఒకేసారి ఎక్కువ కొంటే ఆఫర్లు ఉంటాయి. తక్కువ ధరకే లభిస్తాయి.

పండగల సమయంలో డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులపై బ్యాంకులు రివార్డులు, క్యాష్ బ్యాక్స్ ఇస్తాయి. ఆన్‌లైన్‌లో ఏ కార్డుల ద్వారా ఏ ఆఫర్ వస్తుందో చెక్ చేసుకోవాలి.

అవసరానికి తగినంత డబ్బు చేతిలో లేకపోతే తర్వాత కట్టచ్చులే అని క్రెడిట్ కార్డును ఇష్టమచ్చినట్లు వాడేయకూడదు. ఇచ్చిన సమయంలోపు తిరిగి చెల్లించలేకపోతే వడ్డీ ఎక్కువ కట్టాల్సి వస్తుంది. క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు.

పండగల సీజన్‌లో ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు సైతం వల వేస్తుంటారు. మొబైల్ ఫోన్‌కు, ఇ-మెయిల్స్‌కు ఆఫర్లు ఇస్తున్నామని లింకులు పంపిస్తుంటారు. అలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ఆఫర్ వస్తుంది కదా అని లింకులు తెరిస్తే మీ ఫోన్ హ్యాక్ అవుతుంది. మీ బ్యాంక్ ఖాతాల్లో ఉండే డబ్బు మొత్తం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అయితే, పండగ షాపింగ్ ఎంత జాగ్రత్తగా చేస్తారో అంతకన్నా ఎక్కువగా ఆఫర్ల విషయంలో జాగ్రత్త పడాలి. తక్కువ ధరకే ఇస్తున్నారని ఆశపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది.

## ఇన్వెస్టర్లకు ముందే వచ్చిన పండగ.. ఈ వారం 10 ఐపీఓలు..



**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. లిస్టింగ్ గెయిన్స్ కోసం చూస్తున్న మార్కెట్ ఇన్వెస్టర్లకు దసరా ఉత్సవాలు ముందే వచ్చేశాయని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ వారంలో ఏకంగా 10 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. ఇందులో మూడు మెయిన్ బోర్డ్ కంపెనీలు ఉండగా, ఏడు ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి వస్తున్నాయి. మెయిన్ బోర్డు విభాగంలో చూసుకుంటే శ్రింగర్ హౌస్ ఆఫ్ మగళసూత్ర ఐపీఓ, దేవ్ యాక్సిలరేటర్ ఐపీఓ, అర్బన్ కంపెనీ ఐపీఓలు ఉన్నాయి. ఈ కంపెనీలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొత్త ఐపీఓలతో పాటు మరో 8 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ ముగించుకుని ఈ వారమే మార్కెట్లలోలిస్టవుతున్నాయి.

మెయిన్ బోర్డ్ ఐపీఓలు..

శ్రింగర్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర కంపెనీ మెయిన్ బోర్డు నుంచి వస్తోన్న ఐపీఓ. ఈ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10వ తేదీన మొదలవుతోంది. సెప్టెంబర్ 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.155 నుంచి రూ.165 మధ్య నిర్ణయించారు.

దేవ్ యాక్సిలరేటర్ కంపెనీ ఐపీ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ఐపీఓలో షేర్ల ధర ఒక్కొక్కటి రూ.56- రూ.61గా నిర్ణయించారు.

అర్బన్ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సైతం సెప్టెంబర్ 10వ తేదీన మొదలై 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఒక్కో షేరుకు రూ.98 నుంచి రూ.103 మధ్య ధర నిర్ణయించారు.

ఎస్ఎంఈ ఐపీఓలు

స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సెగ్మెంట్ నుంచి 7 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. ఈ జాబితాలో కృపాలు మెటల్స్, నిలాచల్ కార్పో మెటాలిక్స్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 8వ తేదీన మొదలవుతోంది. అలాగే కార్బన్ స్టీల్ ఇంజినీరింగ్, తౌరియాన్ ఎంపీఎస్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 9వ తేదీతో మొదలవుతోంది. జయ్ అంబే సూపర్ మార్కెట్స్, ఎయిర్ ఫ్లో రైల్ టెక్నాలజీ, ఎల్ టీ ఎలవేటర్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీ నుంచి మొదలవుతుంది.

మెయిన్ బోర్డు పబ్లిక్ ఇష్యూలో అమంత హెల్త్ కేర్ ఐపీఓ సెప్టెంబర్ 9వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టింగ్ కానుంది. ఇక ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో రచిత్ ప్రింట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9వ తేదీనే లిస్టవుతోంది. జియోల్ కన్‌స్ట్రక్షన్ ఐపీ, ఆప్టివాల్యూ టెక్ కన్సల్టింగ్ ఐపీఓ స్టాక్ సెప్టెంబర్ 10వ తేదీన మార్కెట్లలోకి అడుగుపెట్టనుంది. ఇక ఆస్టర్ సిస్టమ్ ఐపీఓ, విగోర్ ప్లాస్ట్ ఇండియా ఐపీఓ, శర్వాయా మెటల్స్ ఐపీఓ సెప్టెంబర్ 12వ తేదీన స్టాక్ మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి.

### జీఎస్టీ రేట్ల కోత.. నేరుగా రంగంలోకి నిర్మలా సీతారామన్..

## సెప్టెంబర్ 22లోగా చేయాల్సిందే..!




వస్తు, సేవల పన్ను జీఎస్టీలో చేపట్టిన సంస్కరణలను ప్రజల సంస్కరణగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో దేశంలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. వినియోగం పెరుగుతుందని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అయితే, జీఎస్టీ రేట్లను తగ్గించినప్పటికీ అది ప్రజలకు చేరవేయడంలో కంపెనీలు, హోటళ్లు, దుకాణదారులు జాప్యం చేయవచ్చన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఈ అంశంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని ప్రజలకు చేరవేసేందుకు తానే వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. నేరుగా తానే రంగంలోకి దిగి ఈ విషయాన్ని పర్యవేక్షిస్తూ ఉంటానని, కచ్చితంగా ప్రజలకు అందేలా చూస్తామన్నారు.పరిశ్రమ సైతం ఇప్పటికే జీఎస్టీ రేట్ల కోతలపై సానుకూలతలు చూపించినట్లు చెప్పారు నిర్మలా సీతారామన్. ఈ నిర్ణయం తీసుకున్న కొద్ది రోజుల్లోనే కార్ల తయారీ సంస్థల నుంచి బీమా కంపెనీలు, షూ, దుస్తుల బ్రాండ్ల ధరల తగ్గింపును ప్రకటించాయని పేర్కొన్నారు. కొత్త జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చే సెప్టెంబర్ 22వ తేదీ నాటికి మిగిలిన సంస్థలూ దీనిని అనుసరించే అవకాశాలు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 22 నుంచి కచ్చితంగా తగ్గించిన రేట్లను అమలు చేయాల్సిందేనన్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం నాటి నుంచే జీఎస్టీ కొత్త రేట్లు అమలులోకి వస్తాయని, అప్పటి నుంచి సబ్బుల నుంచి కార్ల వరకు, ఎయిర్ కండిషనర్ల నుంచి షాంపులు, ట్రాక్టర్ల వరకు మొత్తం 400 ఉత్పత్తుల వరకు ధరలు దిగివస్తాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్య జీవిత బీమా ప్రీమియం పన్ను రహితంగా మారుతుందన్నారు. రూపాయి కూడా జీఎస్టీ కట్టాల్సిన అవసరం రాదని, దీంతో ప్రీమియం దిగువస్తుందని చెప్పారు. అయితే, హానికర ఉత్పత్తులు, అల్ట్రా లగ్జరీ వస్తువులపై కొత్త శ్లాబు 40 శాతం ప్రకారం జీఎస్టీ అమలవుతుందన్నారు,

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తాజా జీఎస్టీ సంస్కరణలు 140 కోట్ల మంది ప్రజల జీవితాలను తాకుతాయన్నారు. ఈ దేశంలో జీఎస్టీ నుంచి ఏ ఒక వ్యక్తి సైతం దూరంగా లేరని గుర్తు చేశారు ఆర్థిక మంత్రి. పేదలు, అత్యంత నిరుపేదలు సైతం చిన్న వస్తువును కొనుగోలు చేసినా జీఎస్టీ చెల్లిస్తున్నారని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరికీ కొత్తగా చేపట్టిన జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. సెప్టెంబర్ 22 తర్వాత 400 వరకు వస్తువుల ధరలు దిగివస్తాయని, అంది ప్రజలకు చేర వేసేందుకు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానన్నారు.

## ట్రంప్ ఏం చేయబోతున్నారు? మళ్లీ తెరపైకి 200 శాతం సుంకాలు..




**ముంబై-నవభూమి:** అమెరికా అధ్యక్షుడుడ డొనాల్డ్ ట్రంప్ వారి దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దాదాపు అన్ని రంగాలపై టారిఫ్‌లు వేశారు. అయితే, ఒక్కో దేశం నుంచి వచ్చే వస్తువులపై ఒక్కో విధంగా సుంకాలు విధించడం గమనార్హం. ఇప్పుడు ప్రధానంగా కనిపిస్తోంది. ఫార్మా ఉత్పత్తులే. వీటిపై సుంకాలు విధిస్తామని చెప్పినప్పటికీ అమలులోకి మాత్రం తీసుకురాలేదు. ఔషధాల జోలికి ట్రంప్ వెళ్లలేదు. కానీ, ముందు ముందు ఈ పరిస్థితిమారవచ్చని తెలుస్తోంది. ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధాలు, పరికరాలపై 200 శాతం పన్నులు విధించాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మళ్లీ తెరపైకి ఫార్మా సుంకాలు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఫార్మా పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.జీరో నుంచి ఒక్కసారిగా 200 శాతం సుంకాలు విధించాలనే ఆలోచన చేయడంపై ట్యాక్సులు, కన్సలింటగ్ సేవల సంస్థ పీడబ్ల్యూసీ ప్రతినిధి ఒకరు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఔషధాల ధరలు తగిస్తామని చెప్పిన ట్రంప్ ఇప్పుడు భారీగా సుంకాలు విధించాలని ఆలోచన చేయడాన్ని తప్పుబట్టారు. అమెరికా ప్రజలకు భరోసా ఇచ్చి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, సుంకాలు విధిస్తే అమెరికాలో మందుల ధరలు పెరగుతాయన్నారు. అలాగే మందుల కొరత ఏర్పడి ఇబ్బందులు కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు సుంకాల కరాణంగా ఆరోగ్య బీమా ప్రీమియం సై,తం భారీగా పెరిగిపోతుందని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ఐఎన్‌జీ పేర్కొంది.మందుల ధరలు తగ్గించాలని అమెరికా ఫార్మా కంపెనీలపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. అలాగే ఇతర దేశాల మందుల ఉత్పత్తిని అమెరికాలోనే చేయాలని సూచిస్తున్నారు. కొన్ని కంపెనీలు ట్రంప్‌కి లేఖలు సైతం రాశాయి. ఈ క్రమంలోనే స్థానికంగా ఔషధాల ఉత్పత్తి పెంచేందుకు, అవసరమైన మందుల నిల్వ సౌకర్యాలు కల్పించేందుకు ఏడాదిన్నర పాటు దిగుమతి సుంకాలు విధించడాన్ని వాయిదా వేస్తామని ట్రంప్ చెప్పారు.ఈ పరిస్థితుల్లో అమెరికా ఫార్మా సంస్థలు ఔషదాల దిగుమతిని బాగా పెంచాయి. ఏడాదిన్నర పాటు సరిపడా మందులను నిల్వ చేశాయి. దీంతో 2027-28 వరకు మందులపై పన్నుల ప్రభావం కనిపించదని, అప్పటి వరకూ మార్పు ఉండదని అక్కడి నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే అప్పటికి 200 శాతం పన్నులు విధించే నిర్ణయం నుంచి వెనక్కి తగ్గుతారని అంటున్నారు. అయితే 25 శాతం విధించినా మందుల ధరలు 10 శాతం నుంచి 14 శాతం వరకు పెరుగుతాయనే ఆందోళనలు ఉన్నాయి. అంటే 200 శాతం సుంకాలు వేస్తే భారీగా ధరలు పెరగడమే కాకుండా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు.


## భారత ఐటీ రంగంలో ఆందోళన..

### అమెరికాతో చర్చలు జరుపుతున్నామన్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**ముంబై-నవభూమి:** భారత ఐటీ పరిశ్రమ అభివృద్ధిని కాపాడుకునేందుకు బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, విదేశీ ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఐటీ ఔట్ సోర్సింగ్‌కు కూడా బ్రేకులు వేస్తామంటూ ట్రంప్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు కామెంట్స్ చేస్తున్న తరుణంలో మంత్రి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు %జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలో నెలకొన్న భయాలపై స్పందించారు. భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), సర్వీస్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని అన్నారు. 'అమెరికా, యూరప్, జపాన్, ఇతర ఆసియా దేశాలతో చర్చలు జరుపుతున్నాము. భారత్‌లో అత్యధిక నాణ్యత గల ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఐటీ రంగంలో వృద్ధి ఎప్పటిలాగే కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నాము' అని తెలిపారు 300 బిలియన్ డాలర్ల విలువైన భారత ఐటీ పరిశ్రమ సుమారు 5.67 మిలియన్ మందికి ఉపాధి కల్పిస్తున్న విషయం తెలిసిందే. భారత ఎగుమతుల్లో ఐటీ ఉత్పత్తుల వాటా ప్రధానమైనది. అయితే, భారత ఐటీ సంస్థలు అమెరికా క్లయింట్స్‌కు ఐటీ సేవలను అధికంగా ఎగుమతి చేస్తున్నాయి. ఇలా పొరుగు దేశాల నుంచి వచ్చే ఐటీ సేవలకు ముగింపు పలకాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని ట్రంప్ ప్రభుత్వంలో కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ ఐటీ పరిశ్రమలో ఆందోళన నెలకొంది.అయితే, ఐటీ ఎగుమతులపై భారత్ ఎక్కువగా ఆధారపడటం లేదని మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, స్వావలంబన సాధించేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 'ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ చాలా పెరిగింది. మన స్మార్ట్ ఫోన్ మార్కెట్ వాటా పెరిగింది. ఈ సప్లై చైన్ మొత్తం భారత్‌లో ఏర్పాటయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని తెలిపారు. ప్రస్తుతమున్న ఉద్యోగాలను కాపాడుకోవడంతో పాటు దేశీయంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఇటీవల 280 బిలియన్ డాలర్ల భారత ఐటీ రంగాన్ని టార్గెట్ చేస్తూ పోస్టు పెట్టడంతో ఈ చర్చ మొదలైంది. విదేశాల్లో ఉంటూ అమెరికాలో ఐటీ సేవలు అందించే వర్కర్లపై సుంకాలు విధించాలని అన్నారు. ఇది కార్యరూపం దాలిస్తే భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళన నెలకొంది.

## మరింత పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**ముంబై-నవభూమి:** దేశీయంగా బంగారం ధర ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్ 7న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 08, 490కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 99, 450కి చేరింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 08, 620కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 99, 600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 08, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 99, 450కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం హైదరాబాద్‌లో రూ. 1, 08, 490, రూ. 99, 450

విజయవాడలో రూ. 1, 08, 490, రూ. 99, 450
ఢిల్లీలో రూ. 1, 08, 620, రూ. 99, 600
ముంబైలో రూ. 1, 08, 490, రూ. 99, 450
వడోదరలో రూ. 1, 08, 520, రూ. 99, 500
కోల్‌కతాలో రూ. 1, 08, 490, రూ. 99, 450
చెన్నైలో రూ. 1, 08, 490, రూ. 99, 450
బెంగళూరులో రూ. 1, 08, 490, రూ. 99, 450
కేరళలో రూ. 1, 08, 490, రూ. 99, 450
పుణెలో రూ. 1, 08, 490, రూ. 99, 450

నవభూమి
www.navabhoomidaily.com
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | సోమవారం | 08 ၊ సెప్టెంబర్ ၊ 2025

# కూలీ నుండి విడుదలైన ఊరమాస్ వీడియో సాంగ్.. రజనీకాంత్ స్టెప్పులకి ఫిదా



సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'కూలీ', భారీ అంచనాలతో ఆగస్టు 14న విడుదలైంది. కళానిధి మారన్ సన్ పిక్చర్స్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ మూవీ, ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను తెచ్చుకుంది. తాజాగా మూవీ నుండి 'చికిటు' అంటూ సాగే ఫుల్ వీడియో సాంగ్ విడుదల చేయగా, ఇది ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది. తెలుగులో శ్రీనివాస మౌళి ఈ పాటను రాయగా.. టి. రాజేందర్, అనిరుధ్, అరివు ఆలపించారు. ఇందులో రజినీకాంత్ తనదైన స్టైల్‌లో డ్యాన్స్ స్టెప్పులతో అదరగొట్టేశాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతుంది. కూలీ చిత్రంలో అక్కినేని నాగార్జున సైమన్ అనే స్టైలిష్ విలన్ పాత్రలో నటించారు. అలాగే ఉపేంద్ర.. కాళేశ్ పాత్రలో, సౌబిన్ షాహిర్.. దయాల్ పాత్రలో, సత్యరాజ్, ఆమిర్ ఖాన్, పూజా హెగ్డే, శృతి హాసన్ వంటి నటీ నటులు కీలక పాత్రలలో కనిపించి సందడి చేశారు.. భారీ అంచనాల నడుమ వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద మిక్స్ టాక్ అందుకుంది. ఇందులో రజినీకాంత్ యాక్టింగ్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులకి మాత్రం బాగా నచ్చేసింది. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచంద్రన్ ఈ సినిమాకి ప్లస్ పాయింట్ అనే చెప్పాలి. సినిమాని పైకి లేపడంలో చాలా కృషి చేశాడు. అయితే మూవీకి సంబంధించి కథ, స్క్రీన్ ప్లే బలహీనంగా ఉన్నాయని, కొన్ని సన్నివేశాలు రొటీన్‌గా ఉన్నాయని విమర్శలు కూడా వచ్చాయి.

## నవచిత్ర



## సాంప్రదాయ లుక్స్‌లో అనసూయ అందాలు



టాలీవుడ్‌లో యాంకర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనసూయ భరద్వాజ్, ఇప్పుడు సోషల్ మీడియాలోనూ తన ఫ్యాషన్ లుక్స్ తో ఆకట్టుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు అందుకు నిదర్శనం. సంప్రదాయ కంచిపట్టు సారీ, వైలెట్ కలర్ బ్లౌజ్ కాంబినేషన్‌తో అందరినీ ఆకట్టుకుంది. ఈ ఫోటోషూట్‌లో ఆమె ధరించిన ఆభరణాలు, మేకప్ మరింత అందంగా హైలెట్ అయ్యింది. అనసూయ ఎప్పటిలాగే తన లుక్స్‌కి కొత్తదనం తీసుకువచ్చేలా ఈసారి కూడా ఫ్యాషన్‌కు సాంప్రదాయాన్ని కలిపి తనదైన స్టైల్‌లో ప్రదర్శించింది. ఆరెంజ్ కలర్ సిల్క్ సారీకి వైలెట్ బ్లౌజ్ జతచేయడం ద్వారా క్లాసీ టచ్ వచ్చింది. బం జుమ్కీలు, వెండి గాజులు, రింగ్‌లు ఆమె లుక్‌కి ప్రత్యేకమైన ఆకర్షణగా మారాయి సినిమా కెరీర్ విషయానికి వస్తే, అనసూయ యాంకర్‌గా 'జబర్దస్త్' షోతో బుల్లితెరపై ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి విభిన్న పాత్రలతో నటిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. క్షణం, రంగస్థలం, పుష్ప: ది రైజ్ వంటి చిత్రాల్లో ఆమె నటన మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా రంగస్థలంలో రంగమ్మత్త పాత్రతో ఆమెకు మంచి పేరు వచ్చింది. ఇక ఇటీవల ఆమె చేసిన కొన్ని సినిమాల్లోనూ యాక్టింగ్ వైవిధ్యాన్ని చూపిస్తూ, గ్లామర్ పాత్రలు కాకుండా ప్రాధాన్యం ఉన్న రోల్స్ ఎంచుకుంటోంది. అదే సమయంలో టెలివిజన్ రంగంలోనూ తన ప్రెజెన్స్ కొనసాగిస్తూ, యాంకరింగ్‌లో తన ఎనర్జీతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తోంది.

## కొడుకుతో అమలాపాల్ ఓనం



కేరళ రాష్ట్రంలో అత్యంత ఘనంగా జరుపుకునే పండుగలలో ఓనం పండుగ కూడా ఒకటి.. వ్యవసాయ పండుగగా చెప్పుకునే ఈ ఓనం పండుగ కేరళ ప్రజలకు అతి పెద్ద పండుగ అని చెప్పవచ్చు.. సామాన్యులను మొదలుకొని సెలబ్రిటీల వరకు ఈ పండుగలో ప్రతి ఒక్కరూ భాగం అవుతారు. ఇంటిని అందంగా పువ్వులతో అలంకరించి.. సాంప్రదాయ దుస్తులు ధరించి పూజలో పాల్గొంటారు. కేరళ కాలమానం ప్రకారం .. ఆగస్టు - సెప్టెంబర్ నెలల మధ్యలో వచ్చే ఈ పండుగ కోసం కేరళ ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తారు. అలాంటి ఈ పండుగ రానే వచ్చేసింది. ఇక సెలబ్రిటీలందరూ కూడా తమ తమ కుటుంబ సభ్యులతో ఓనమ్ సెలబ్రేషన్స్ జరుపుకుంటూ ఆ విషయాన్ని అభిమానులతో పంచుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రముఖ హీరోయిన్ అమలాపాల్ కూడా ఓనం సెలబ్రేషన్స్ ను ఘనంగా నిర్వహించారు.. తన కొడుకు సమక్షంలో భర్తతో కలిసి ఆమె జరుపుకున్న ఈ ఓనం సెలబ్రేషన్స్ కి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ముఖ్యంగా అమలాపాల్ తన భర్త , కొడుకుతో కలిసి సాంప్రదాయ దుస్తులు ధరించి ఓనం పండుగను జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఇంటిని పువ్వులతో అలంకరించిన వీరు.. అందులో భాగంగానే రుచికరమైన భోజనంతో పండుగను పూర్తి చేసుకున్నారు. భార్య, భర్త, కొడుకు మాత్రమే కాకుండా మిగతా కుటుంబ సభ్యులు కూడా ఈ ఓనం సెలబ్రేషన్స్లో సందడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలను అమలాపాల్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేయడంతో ఇది చూసిన అభిమానులు తెగ సంతోష పడిపోతున్నారు.. తమ అభిమాన హీరోయిన్ ఫ్యామిలీని ఒకే చోట ఈ ఓనం సెలబ్రేషన్స్ లో భాగంగా చూడడంతో మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమలాపాల్ కెరియర్ విషయానికి వస్తే.. కేరళ కుట్టి అయిన ఈ అమ్మడు తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో నటించి భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. 'నీల తామర' అనే చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. ఆ తర్వాత పలు చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక తెలుగులో 'ఇద్దరమ్మాయిలతో', 'నాయక్' వంటి చిత్రాలు ఒకే ఏడాది చేసి రెండు చిత్రాలతో కూడా మంచి విజయాన్ని అందుకుంది అమలాపాల్.. ఆ తర్వాత జెండాపై కపిరాజు, పిట్టకథలు లాంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. ముఖ్యంగా సినిమాలతోనే కాదు వెబ్ సిరీస్ లతో కూడా ఆకట్టుకుంది అమలాపాల్.

## సూపర్ స్టార్‌తో జైభీమ్ డైరెక్టర్ బయోపిక్.. ఇంతకీ హీరో ఎవరో తెలుసా..?



జై భీమ్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సంపాదించాడు డైరెక్టర్ టీజే జ్ఞానవేల్. కోర్టు రూం డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం డైరెక్టుగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలై అద్భుతమైన వ్యూయర్‌షిప్‌ను నమోదు చేసింది. ఈ సక్సెస్‌తో ఏకంగా సూపర్ స్టార్ రజినీకాంత్‌తో వెట్టైయాన్ సినిమాను తెరకెక్కించే ఛాన్స్ కొట్టేశాడు. అయితే ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన వెట్టైయాన్ బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. కాగా టీజే జ్ఞానవేల్ మరో సూపర్ స్టార్‌తో సినిమాకు ప్లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇంతకీ ఆ హీరో ఎవరనే కదా.. మీ డౌటు. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్. శరవణ భవన్ స్థాపకుడు రాజగోపాల్ జీవిత కథకు సంబంధించిన స్క్రిప్ట్‌ను మోహన్ లాల్‌కు వినిపించాడట టీజే జ్ఞానవేల్ . బిజినెస్ మెన్ రాజగోపాల్ ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవించాడు. దోస కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాను జంగ్లీ పిక్చర్స్ నిర్మించబోతుందట. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశాలున్నట్టు సమాచారం.

## డైమండ్ మెరుపుల చీరలో క్వీన్ వైబ్స్




అవును.. చూడగానే రాణిని తలపిస్తోంది. వజ్రంలోని మెరుపులు కెంపుల సొగసు ఆమె మేని విరుపుల్లో కనిపిస్తున్నాయి. ఇంతకీ ఎవరు ఈ క్వీన్? అంటారా? బర్మింగ్‌హామ్ 2025లో కరీనా కపూర్ ఖాన్ తనదైన అద్భుత సౌందర్యంతో యువతరాన్ని ఆకర్షించింది. ప్రఖ్యాత డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన ఈ వజ్రాల మెరుపుల చీరలో కరీనా రారాణిని తలపించిందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. సీక్విన్స్ అండ్ ఫ్లూయిడ్ డిజైన్.. లిక్విడ్-మెటల్ ఫినిషింగ్‌తో అలంకరించిన ఈ చీర కరీనా అందాన్ని పదింతలు పెంచిందని చెప్పాలి. సాంప్రదాయ చీరకట్టుకు తగ్గట్టు బోల్డ్ హాల్టర్-నెక్ బ్లౌజ్‌తో కరీనా క్లాసిక్ గా కనిపించింది. ఈ ఫోటోలకు బర్మింగ్‌హామ్ 2025 అని క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అవుతున్నాయి. మెరిసే డైమండ్ చాంద్‌బలి చెవిపోగులు, చక్కని గాజుతో యాక్సెసరైజ్ చేసిన ఈ ఆభరణాలు అందాన్ని మరింత పెంచాయి. అనే పదానికి కరీనా ఒక సింబల్. ఈవెంట్ కోసం విచ్చేసిన కరీనా బ్లాక్ కార్ నుంచి నేరుగా లగ్జరీ హోటల్ లో అడుగుపెట్టింది. లాంజ్ నుంచి బయటకు వెళ్లి చూడగానే, భారీ ఫాలోవర్స్ వీధి పొడవునా కనిపిస్తున్నారు. మొత్తానికి పాపులర్ డైమండ్స్ మర్చెంట్ కి ప్రచార హంగామా హోరెత్తిపోతోంది. ఎంపిక చేసుకున్న బ్రాండ్ కి బెబో పర్ఫెక్ట్ యాప్ట్ మోడల్ అని చెప్పాలి. తైమూర్ అలీఖాన్, జేహ్ జన్మించాక కరీనా కపూర్ ఖాన్ కొంత కాలం సినిమాలకు దూరమైంది. కానీ ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లవుతుంటే, తిరిగి నటిగా బిజీ అవుతోంది.

## విడుదలకు ముందే భారీ లాభాలు తీసుకొస్తున్న మిరాయ్!




తేజా సజ్జా హీరోగా వస్తున్న మిరాయ్ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన గ్రాఫిక్స్ ఈ సినిమాపై విపరీతమైన హైప్ క్రియేట్ చేసింది. ఇది కాస్త పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి భారీ లాభాలను తీసుకొస్తుంది. సినిమా విడుదలకు ముందే దాదాపు 20 కోట్ల వరకు లాభాలు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో బాక్సాఫీసు వద్ద గత సినిమాల నష్టాల నుంచి పీపుల్ మీడియా ఫ్యాకర్టీ తేరుకుంటుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.మిరాయ్ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రూ.60 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించింది. అద్భుత దృశ్యకావ్యంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 12వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. కానీ ఇప్పటికే ఈ సినిమా నాన్ థియేట్రికల్ హక్కులు ( ఓటీటీ, శాటిలైట్ హక్కులు) కింద దాదాపు 45 కోట్లను సంపాదించిందని తెలుస్తోంది. దీంతో టేబుల్ ప్రాఫిట్ కింద రూ.20 కోట్లు అందుకుందని సమాచారం. ప్రస్తుతం బాక్సాఫీసు దగ్గర సినిమాల ఫలితాలను బట్టి చూస్తే ఇది చిన్న విజయం కాదనే చెప్పొచ్చు.ఎందుకంటే.. ఈ ఏడాదిలో వచ్చిన భారీ బడ్జెట్ చిత్రాలు.. తిరిగి డబ్బులను తీసుకురావడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా పాన్ ఇండియా ట్రెండ్‌ను ఫాలో అవుతూ, మార్కెట్‌ను మించి బడ్జెట్ పెట్టడం ద్వారా ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయి. కానీ ఈ విషయంలో తేజా సజ్జా తెలివిగా వ్యవహరిస్తున్నారు. అనవసరపు హడావుడికి వెళ్లకుండా కంటెంట్ ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కూడా కంటెంట్‌ను నమ్ముకునే మిరాయ్ సినిమాను తెరకెక్కించింది. పాన్ ఇండియా స్టోరీ అని భారీ బడ్జెట్, స్టార్ క్యాస్టింగ్ జోలికి వెళ్లకుండా రూ.60 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించింది. అదనపు హడావుడితో కాకుండా కంటెంట్‌ను నమ్ముకుని ఈ సినిమాను నిర్మించింది. ఇటీవల విడుదలైన మిరాయ్ ట్రైలర్ దాన్ని నిరూపిస్తోంది. తాజాగా విడుదలైన మిరాయ్ ట్రైలర్‌కు తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ అంచనాల కారణంగానే డైరెక్ట్‌గా తామే ఈ సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించు కున్నారు. థియేట్రికల్ హక్కుల కోసం ప్రీమియం చెల్లించేందుకు డిస్ట్రిబ్యూటర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ, కంటెంట్‌పై ఉన్న నమ్మకం కారణంగా ఈ సినిమాను మేకర్స్ సొంతంగా విడుదల చేస్తున్నారు. రిలీజ్‌కు ముందే రూ.20 కోట్ల వరకు లాభాలు తీసుకొచ్చిన మిరాయ్.. విడుదల తర్వాత మరెన్ని లాభాలు తీసుకొస్తుందో చూడాలి.!

## థ్రిల్లింగ్‌గా ఫీలయ్యా.. పవన్ కల్యాణ్ ఓజీపై ఇమ్రాన్ హష్మీ



టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీతో బాలీవుడ్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్ డెబ్యూ ఇస్తున్నాడు.కాగా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలుకరిస్తుండటం.. అందులోనా పవన్ కల్యాణ్ సినిమాతో ఎంట్రీ ఇస్తుండటం పట్ల చాలా ఎక్జయిటింగ్‌గా ఉన్నాడు ఇమ్రాన్ హష్మీ. ఓజీ గురించి ఇమ్రాన్ హష్మీ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సినిమా కోసం నన్ను సంప్రదించినప్పుడు థ్రిల్లింగ్‌గా ఫీలయ్యా. ఇది నాకు తెలుగు సినీ ఇండస్ట్రీ ఎంట్రీ సినిమా. లెజెండరీ పవన్ కల్యాణ్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం కంటే ఉత్తమ విషయం ఇంకేముంటుందన్నారు.పవన్ కల్యాణ్, డైరెక్టర్ సుజిత్‌తో పనిచేయడం అద్భుతమైన అనుభవం. నా లుక్, డైలాగ్ డెలివరీ నుంచి పూర్తి క్యారెక్టరైజేషన్ వరకు ప్రతీ విషయం నన్ను ఇంప్రెస్ చేయడంతో నిజంగా ఈ సినిమాలో భాగం కావడానికి ఎక్జయిట్ అయ్యాను అంటూ చెప్పుకొచ్చాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## యూఎస్ ఓపెన్ విజేత సబలెంక.. ఆమెకు దక్కే ప్రైజ్‌మనీ ఎంతో తెలుసా?



**న్యూయార్క్-నవభూమి:** అత్యంత ఆసక్తికరంగా సాగిన యూఎస్ ఓపెన్‌లో బెలారస్ క్రీడాకారిణి అర్యానా సబలెంక టైటిల్ సాధించింది. అమెరికాకు చెందిన అనిసిమోవాపై 6-3, 7-6 (3)తో వరుస సెట్లలో విజయాలు సాధించిన సబలెంక విజేతగా నిలిచింది. వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సబలెంక తాజా యూఎస్ ఓపెన్ టోర్నీ మొత్తానికి ఒక్క సెట్‌ను మాత్రమే చేజార్చు కుంది తాజా విజయవంతో సబలెంక రికార్డ్ ప్రైజ్‌మనీని దక్కించుకుంది . యూఎస్ ఓపెన్ పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు సమానంగా ఐదు మిలియన్ డాలర్ల చొప్పున టోర్నీ నిర్వాహకులు అందించారు. అంటే ఈ విజయం ద్వారా సబలెంకకు రూ.44.08 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి పాలై రన్నరప్‌గా నిలిచి 22.04 కోట్ల రూపాయల అందుకోనుంది. వరుసగా రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్‌లో కూడా ఓటమి చవిచూడడంతో అనిసిమోవా కోర్టులోనే కన్నీటిపర్యంతమైంది.

## 2019లో బీసీసీఐ బ్యాంక్ బ్యాలెన్స్ 6 వేల కోట్లు.. 2024లో ఎంతంటే..





**న్యూఢిల్లీ-నవభూమి:** బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) రికార్డులను తిరగరాస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డుగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. బీసీసీఐ బ్యాంక్ బ్యాలెన్స్ ప్రతీ ఏటా డబుల్, ట్రిబుల్ అవుతోంది. క్రిక్‌బజ్ రిపోర్టు ప్రకారం.. 2019లో స్టేట్ బోర్డులకు పంచింది పోగా బీసీసీఐ బ్యాంక్ ఖాతాలో 6,059 కోట్లు మిగిలాయి. 2024లో స్టేట్ బోర్డులకు పంచింది పోగా ఏకంగా 20, 686 కోట్ల రూపాయలు మిగిలాయి. గత ఐదేళ్లలో బీసీసీఐ బ్యాంక్ ఖాతాలో డబ్బులు డబుల్ అయ్యాయి.14, 627 కోట్ల రూపాయల ఆదాయం వచ్చి చేరింది. జనరల్ ఫండ్ కూడా బాగా పెరిగింది. 2019లో ఈ ఫండ్ 3,906 కోట్ల రూపాయలుగా ఉండేది. 2024 నాటికి 7,988 కోట్లకు చేరింది.

అంటే 4,082 కోట్లు అదనంగా వచ్చి చేరింది. 2023-2024 సంవత్సరానికి గాను బీసీసీఐ ట్యాక్సుల రూపంలో 3,150 కోట్ల రూపాయలు చెల్లించింది. ఇన్వెస్టిమెంట్ ఇన్‌కమ్ 533.05 కోట్ల రూపాయల నుంచి 986.45 కోట్ల రూపాయలకు చేరింది. డిపాజిట్లపై అత్యధిక మొత్తంలో లాభాలను గడించింది. 2023లో ఐపీఎల్ ఆదాయం 1,167. 99 కోట్ల రూపాయలు ఉండేది.

## నవక్రీడ

## సంజూ శాంసన్ ప్లేస్‌లో జితేష్ శర్మ.. తొలి మ్యాచ్ ఆడేది ఎవరు?



**దుబాయ్-నవభూమి:** దుబాయ్ వేదికగా ఆసియా కప్-2025 మరో రెండ్రోజుల్లో ప్రారంభం కాబోతోంది. పూర్తిగా టీ-20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో ఆసియా ఖండానికి సంబంధించిన జట్లు పాల్గొనబోతు న్నాయి. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఇప్పటికే దుబా య్‌లో ల్యాండ్ అయ్యి ప్రాక్టీస్ ప్రారంభించింది. ఈ టోర్నీలో టీమిండియా తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10వ తేదీన ఆడబో తోంది. ఈ మ్యాచ్‌కు ఓపెనర్ సంజూ శాంసన్ అందుబాటులో ఉండడం అనుమానా స్పదంగా మారింది సంజూ శాంసన్ ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా లేదని వార్తలు వస్తున్నాయి. ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ పాల్గొనకుండా ఒక పక్కన కూర్చుని బ్యాటింగ్ కోచ్‌తో మాట్లాడుతున్నాడు. ఈ నేపథ్యంలో సంజూ ఫిట్‌నెస్‌పై అనుమానాలు మొదల య్యాయి సెప్టెంబర్ 10వ తేదీన యూఏఈ జరిగే తొలి మ్యాచ్‌కు సంజూ అందుబాటులో ఉండడంటూ వార్తలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో సంజూ ప్లేస్‌లో జితేష్ శర్మను ఆడిస్తారని తెలుస్తోంది. తాజా ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన జితేష్ శర్మ అద్భుతంగా రాణించాడు.ఆసియా కప్ కోసం శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసినపుడే సంజూ స్థానంపై అనుమానాలు మొదలయ్యాయి.

అయితే అభిషేక్ శర్మతో కలిసి సంజూనే ఓపెనింగ్ చేస్తాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ఏడాది సంజూ టీ-20 క్రికెట్‌లో అమోఘంగా రాణించాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**